ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం 01.05.2025 | సంపుటి : 11 సంచిక : 282 | పేజీలు : 12 వెల: రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

## ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ ఓఎస్డీగా కమలాసన్ రెడ్డి

**ఐఏఎస్ అధికారి శశాంక్ గోయల్ పోస్టింగ్‌లో మార్పు**

**ఢిల్లీలోని తెలంగాణ భవన్ ప్రత్యేక సీఎస్‌గా నియామకం**

**విశ్రాంత ఐఏఎస్ అధికారి శ్రీనివాసరాజు సీఎం కార్యదర్శిగా నియామకం.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు**



**హైదరాబాద్(జనంసాక్షి):** నేడు పదవీ విరమణ చేసిన కమలాసన్ రెడ్డిని ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ ఓఎస్డీగా నియమించారు. రెండేళ్ల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఐఏఎస్ అధికారి శశాంక్ గోయల్ పోస్టింగ్‌లో తెలంగాణ ప్రభుత్వం మార్పు చేసింది. ఆయన్ను ఢిల్లీలోని

మిగతా 2లో..

# జనగణనతో పాటే కులగణన

## రాహుల్ విజన్ సాకారం కాబోతోంది

కేంద్రం కులగణన నిర్ణయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం

మోదీకి కృతజ్ఞతలు తెలిపిన సీఎం

**హైదరాబాద్(జనంసాక్షి):**కులగణన చేపట్టాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అభినందించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర క్యాబినెట్‌కు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.కేంద్రం నిర్ణయంతో రాహుల్ గాంధీ విజన్ సాకారం కాబోతోందని పేర్కొన్నారు. "రాహుల్ విపక్షంలో ఉండి కూడా కేంద్ర విధానాన్ని ప్రభావితం చేశారు. దేశంలో

మిగతా 2లో..



## కేంద్ర ప్రభుత్వం సంచలన ప్రకటన

- వచ్చే జనాభా లెక్కలతో పాటు ప్రక్రియ చేపట్టాలని కేంద్ర కేబినెట్ నిర్ణయం
- భారత్ - పాక్ సరిహద్దు ఉద్రిక్తతలో పాటు పలు అంశాలపై సుదీర్ఘం చర్చ
- మంత్రివర్గ సమావేశ వివరాలు వెల్లడించిన మంత్రి అశ్వినీ వైష్ణవ్
- ఆయా రాష్ట్రాల్లో కాంగ్రెస్ చేపడుతున్న సర్వేల్లో పారదర్శకత లేదని వెల్లడి

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**దేశంలో కులగణనకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే జనాభా లెక్కలతో పాటు కులగణన చేపట్టాలని నిర్ణయించింది. జనాభా లెక్కల్లోనే కులగణను చేర్చుతామని కేంద్రం ప్రకటించింది. కులగణన పేరుతో కాంగ్రెస్ సర్వే చేయించిందని, ఆయా రాష్ట్రాల్లో చేపడుతున్న సర్వేల్లో పారదర్శకత లేదని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. నేడు కేంద్ర కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాలకు సంబంధించిన వివరాలను మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు.రాజకీయ వ్యవహారాల కేబినెట్ కమిటీనిసూపర్ కేబినెట్‌గా వ్యవహరిస్తారు. బుధవారం జరిగిన భేటీలో కులగణనకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర మంత్రి

మిగతా 2లో..



## కులగణనకు తెలంగాణే రోల్‌మోడల్

**ఈ విషయంలో కేంద్రానికి కాంగ్రెస్ సహకరిస్తుంది**

**ఈ ప్రక్రియ సమానత్వం తీసుకొస్తుంది**

**అయితే దీనికి ఒక డెడ్‌లైన్ ఉండాలి: రాహుల్**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**కేంద్ర ప్రభుత్వం చేపట్టే కులగణనకు కాంగ్రెస్ పార్టీ సహకరిస్తుందని ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ తెలిపారు. అయితే, కులగణనకు నిర్ణీత సమయం తెలపాలని కోరుతున్నామన్నారు. తెలంగాణలో చేపట్టిన

మిగతా 2లో..

# 'పది'లో గురుకులాలే ఫస్ట్

**98.7 శాతం ఉత్తీర్ణత నమోదు**

**ప్రైవేటు పాఠశాలల్లో 94.21 శాతం**

**మొత్తం 92.78 శాతం మంది ఉత్తీర్ణత**

- 94.26 శాతంతో బాలికల పైచేయి
- మహబూబాబాద్ ఫస్ట్..వికారాబాద్ లాస్ట్
- జూన్ 3 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు
- తెలంగాణ టెన్త్ ఫలితాలు విడుదల చేసిన సీఎం రేవంత్

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ టెన్త్ ఫలితాలను సీఎం రేవంత్‌రెడ్డి విడుదల చేశారు. రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పలువురు మంత్రులతో కలిసి సీఎం విడుదల చేశారు. ఫలితాల్లో 92.78 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

మిగతా 2లో..



# అసెంబ్లీకిరాని కేసీఆర్‌కు ప్రతిపక్ష హోదా ఎందుకు?

## తెలంగాణ ఇచ్చినందుకు కాంగ్రెస్ విలన్ అయ్యిందా?: సీఎం రేవంత్

- సోనియా ప్రత్యేక రాష్ట్రం ఇస్తే పదేళ్లు దోపిడీ చేశావ్
- ప్రభుత్వ నిర్ణయాల్లో ఎక్కడా మంచి కనబడట్లేదా?
- కడుపు నిండా విషం నింపుకొని విద్వేషప్రసంగంతో ప్రజల మధ్య చిచ్చుపెట్టాలని చూస్తున్నారు
- 16 నెలలుగా జీత భత్యాలు తీసుకొని ఫాంహౌస్‌లోనే ఎందుకు ఉంటున్నారు?
- మాజీ సీఎం కేసీఆర్‌కు ముఖ్యమంత్రి సూటి ప్రశ్న

**హైదరాబాద్(జనంసాక్షి):** ఇటీవల ఎల్కతుర్తిలో జరిగిన భారాస రజతోత్సవ సభకు తాము సంపూర్ణంగా సహకరించినట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రవీంద్రభారతిలో నిర్వహించిన బసవేశ్వర 892 జయంతి వేడుకల్లో పాల్గొన్నారు.పదో తరగతి పరీక్ష ఫలితాలను విడుదల చేసిన అనంతరం రేవంత్ రెడ్డి ప్రసంగించారు. భారాస రజతోత్సవ వేడుకల్లో మాజీ సీఎం కేసీఆర్ కాంగ్రెస్

మిగతా 2లో..





## సింగిల్ బెంచ్ ఉత్తర్వులపై జోక్యం చేసుకోలేం

గ్రూప్-1 నియామకాలపై స్టేకు తెలంగాణ హైకోర్టు నిరాకరణ

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణలో గ్రూప్-1 నియామకాలను తాత్కాలికంగా నిలిపివేయాలంటూ హైకోర్టు సింగిల్ బెంచ్ ధర్మాసనం జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులను సవాల్ చేస్తూ టీజీపీఎస్సీ అప్పీలు దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై సీజే ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. గ్రూప్ 1 నియామకాల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయంటూ కొందరు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. మెయిన్స్ పరీక్షల మూల్యాంకనం

మిగతా 2లో..

## జాతీయ భద్రతా సలహా బోర్డు ఛైర్మన్‌గా అలోక్ జోషి 9లో

పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు

# యాసంగి పంట కొనుగోలు వేగవంతం చేయాలి

**ధాన్యం కొనుగోలుపై జిల్లా కలెక్టర్ లు ప్రత్యేకంగా పర్యవేక్షించాలి**

**మిల్లర్లు తాలు, తరుగు పేరిట ఎటువంటి కోతలు పెట్టకండా చర్యలు తీసుకోవాలి**

**ప్రభుత్వ పరిధిలో అత్యధికంగా రైస్ మిల్లులు మిల్లింగ్ చేసేలా కార్యాచరణ**

**అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి ఉత్తమ్, మంత్రి తుమ్మల**

**యాసంగిలోనూ రికార్డ్ స్థాయిలో దిగుబడి.. రబీ కొనుగోలుకు రూ.15 వేల కోట్లు**

**70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు**



**తెలంగాణ పౌరసరఫరాల సంస్థకు ఐఎస్ఓ సర్టిఫికెట్**

- లభించిన అంతర్జాతీయ గుర్తింపు 2లో

**హైదరాబాద్(జనంసాక్షి):**యాసంగిపంట కొనుగోలు వేగవంతం చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, పౌర సరఫరాల శాఖ కమీషనర్ డిఎస్ చౌహాన్ ధాన్యం కొనుగోలుపై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించగా ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు తో కలిసి కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి పాల్గొన్నారు.మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో యాసంగి పంట 2024-25 సంవత్సరంలో 54 లక్షల

మిగతా 2లో..

## సింహాద్రి అప్పన్న చందనోత్సవంలో అపశృతి

**గోడకూలి ఎనిమిది మంది భక్తులు మృతి**


మృతుల్లో ముగ్గురు మహిళలు, ఐదుగురు పురుషులు



- నిజరూప దర్శనం కోసం వచ్చి మృత్యువాత
- భారీ వర్షంతో గోడ తడవడంతోనే దుర్ఘటన
- ఘటనపై రాష్ట్రపతి, ప్రధాని మోదీ సీఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి



2లో



## సమ్మె నిర్ణయంపై పునరాలోచించాలి

సమస్యలపై కలిసి చర్చించుకుందాం

ఆర్టీసీ సమ్మె నోటీసుపై రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక వ్యాఖ్యలు

## బంగారం కొనుగోళ్లు పతనం

**ధరలు పెరుగుదలే కారణం**

**15 శాతం పడిపోయిన డిమాండ్**

## కర్రెగుట్టలను స్వాధీనం చేసుకున్న భద్రతా బలగాలు


జాతీయ జెండా ఎగురేసిన జవాన్లు

పై వార్తల వివరాలు 2 లో

# పాక్ భారత్ సరిహద్దుల్లో ఉద్రిక్తత

**సరిహద్దు వెంబడి కాల్పులు కొనసాగిస్తున్న పాక్**

- ఆరో రోజూ కొనసాగుతున్న దుశ్చర్య
- పీవోకేకు విమాన సర్వీసులు రద్దు చేసిన పాక్
- మరో రెండో రోజుల్లో మాపై భారత్ సైనిక చర్య
- మాకు సమాచారం ఉంది: పాక్ మంత్రి





**ఇస్లామాబాద్(జనంసాక్షి):** పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడితో భారత్-పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. ఈ పరిణామాల వేళ పాక్ మంత్రి ఒకరు కీలక వ్యాఖ్యలు చేశారు. రానున్న 24-36 గంటల్లో తమ దేశంపై సైనిక చర్య చేపట్టేందుకు న్యూఢిల్లీ ప్రణాళికలు రచిస్తోందన్నారు. దీనికి సంబంధించి తమకు కచ్చితమైన నిఘా సమాచారం ఉందని పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రదాడి కి ప్రతిస్పందనపై సైనిక దళాలకు పూర్తి స్వేచ్ఛనిస్తున్నామంటూ భారత ప్రధాని మోదీ వెల్లడించిన వేళ.. పాక్ మంత్రి ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.ఉగ్రదాడి నేపథ్యంలో భారత్ తీసుకుంటున్న ప్రతిచర్యలపై పాక్ సమాచార శాఖ మంత్రి అతవుల్లా తరార్ అక్కసు వెళ్లగక్కారు. ఈక్రమంలోనే న్యూఢిల్లీపై కీలక వ్యాఖ్యలు చేశారు. అంతేగాక, తాము కూడా ఉగ్రవాద బాధితులమేనంటూ

మిగతా 2లో..

## ఆంధ్రా,తెలంగాణలో అసెంబ్లీ సీట్ల పెంపుపై సుప్రీంలో విచారణ

విభజన చట్టం ప్రకారం పెంచాలన్న పిటిషనర్

విచారణ చేసి తీర్పు రిజర్వు చేసిన ధర్మాసనం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్య పెంపు విషయంలో సుప్రీంకోర్టులో కీలక విచారణ జరిగింది. ఈ విషయంపై దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ

మిగతా 2లో..



## జనగణనతో పాటే కులగణన

అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. కులగణన అంశం కేంద్రం పరిధిలోకి వస్తున్నప్పటికీ.. కొన్ని రాష్ట్రాలు మాత్రం సర్వేల పేరుతో వాటిని నిర్వహించా యన్నారు. ముఖ్యంగా విపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో రాజకీయ కారణాల వల్ల వాటిని చేపట్టారని విమర్శించారు. ఇందులో పారదర్శకత లేదన్నారు. కేవలం రాజకీయకారణాలతో చేసినందున స్పష్టత లేదన్నారు. అందుకే తదుపరి దేశవ్యాప్తంగా చేపట్టే జనాభా లెక్కల ప్రక్రియలో కులగణనను చేర్చి పారదర్శకంగా చేపట్టాలన్నదే మోదీ ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. దేశ రక్షణకు సంబంధించి ముఖ్యంగా దృష్టిపెట్టిన కేంద్ర మంత్రివర్గం ఈ అంశంతో పాటు, దేశ వ్యాప్తంగా, వివిధ రాష్ట్రాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి కూడా నిర్ణయాలు తీసుకుంది. ఈ నిర్ణయాలను కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. జనాభా లెక్కల్లో భాగంగా కులగణన కూడా చేస్తామని కేంద్రం పేర్కొంది. పారదర్శకంగా కులగణన జరగాలని కేంద్రం భావిస్తోంది. ఇందు కోసం సర్వేలపై ఆధారపడకుండా జనాభాలెక్కలలోనే ఈ విషయం నిర్ధారణ చేసుకుంటే సామాజిక సమతుల్యతకు ఆస్కారం లభిస్తుందని కేంద్రం నిర్ణయానికి వచ్చింది. వివిధ రాష్ట్రాల్లోని కాంగ్రెస్ సర్కార్లు తీసుకొచ్చే సర్వేలు చాలా లోపభూయిష్టంగా ఉన్నాయని, దీని వల్ల సమాజ శ్రేయస్సు దెబ్బతినే అవకాశం ఉందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. అందుకే తదుపరి జనాభా లెక్కల్లో కుల సర్వేను కూడా చేర్చాలని కేబినెట్ తీసుకున్న నిర్ణయం చారిత్రకమని అశ్విని వైష్ణవ్ అన్నారు. ఏప్రిల్ 2020లోనే జనాభా లెక్కలు చేపట్టాల్సి ఉన్నప్పటికీ.. కొవిడ్ కారణంగా వాయిదా పడిన విషయం తెలిసిందే. భారత్-పాకిస్థాన్ సరిహద్దులో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ.. గత రెండు రోజులుగా దిల్లీలో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం ప్రధాని మోదీ నేతృత్వంలో రక్షణమంత్రి, జాతీయ భద్రతా సలహాదారు, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్, త్రివిధ దళాధిపతులతో సమావేశం జరిగింది. ఇదే క్రమంలో బుధవారం భద్రతపై కేబినెట్ కమిటీ, అనంతరం రాజకీయ వ్యవహారాల కేబినెట్ కమిటీ భేటీ జరిగింది.

## కులగణనకు తెలంగాణే రోల్‌మోడల్

కులగణన ప్రక్రియ ఇందుకు బ్లూప్రింట్‌గా నిలుస్తుందని అన్నారు. కులగణన సమనత్వం తీసుకొస్తుందని తెలిపారు. ఇది తొలి మెట్టేనని పేర్కొన్న రాహుల్.. కులగణనకు అందరి భాగస్వామ్యం కూడా అవసరమ న్నారు. కులగణనకు తెలంగాణ ఓ మోడల్‌గా నిలుస్తుందని చెప్పారు.

## పాక్ భారత్ సరిహద్దుల్లో ఉద్రిక్తత

మొసలి కన్నీరు కార్చారు. పహల్గాం దాడిపై తటస్థ, పారదర్శక, స్వతంత్ర దర్యాప్తునకు సహకరిస్తామని తాము ఇప్పటికే ప్రకటించామన్నారు. అయినా సరే.. భారత్ తమపై సైనిక చర్యకు సిద్ధమవుతోందని ఆరోపించారు. దీనికి తమ నుంచి ప్రతిచర్య తీవ్రంగా ఉంటుందని రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేశారు. భారత ప్రధాని నరేంద్రమోదీ నివాసంలో మంగళవారం జరిగిన సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్న సంగతి తెలిసిందే. 'సీమాంతర ఉగ్రవాదం, దాని సూత్రధారులపై చర్యలు ఎప్పుడు, ఎలా తీసుకోవాలన్న విషయంలో సైనిక దళాలకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నాం' అని మోదీ స్పష్టంచేసినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఈనేపథ్యంలో పాక్ నుంచి స్పందన వచ్చింది.

పహల్గాంలో ఏప్రిల్ 22న పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన పాశవిక దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. దీనికి భారత్ తగిన సమాధానం ఇచ్చే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. దీంతో గుబులుగా ఉన్న ఆ దేశం.. పీవోకేలోని ఉగ్రవాద లాంచ్ ప్యాడ్‌లను ఖాళీ చేయిస్తున్నట్లు తెలుస్తోంది. ఉగ్రవాదులను ఆర్మీ షెల్టర్లు, బంకర్లకు తరలించడం ప్రారంభించింది. ఈ మేరకు నిఘా వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియాలో కథనం ప్రచురితమైంది.

సరిహద్దు వెంబడి కాల్పులు ఆపని పాక్

పహల్గాం ఉగ్రదాడితో భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న వేళ ఇరుదేశాల మధ్య సరిహద్దుల్లో అలజడి కొనసాగుతూనే ఉంది.గత కొన్ని రోజులుగా నియంత్రణ రేఖ వెంబడి కవ్వింపు చర్యలకు పాల్పడుతోన్న దాయాది సైన్యం.. వరుసగా ఆరో రోజు దుశ్చర్య కొనసాగించింది. తాజాగా ఎల్‌వోసీతో పాటు అంతర్జాతీయ సరిహద్దు వెంబడి కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించింది. జమ్మూకశ్మీర్ లోని నాలుగు సరిహద్దు జిల్లాల్లో పలు సెక్టార్లలో భారత సైన్యం పైకి కాల్పులు జరిపింది. శత్రువుల దాడికి మన బలగాలు సమర్థంగా తిప్పికొట్టినట్లు అధికారులు వెల్లడించారు.ఏప్రిల్ 29-30 అర్ధరాత్రి సమయంలో జమ్మూ జిల్లాలోని అంతర్జాతీయ సరిహద్దు వెంబడి ఉన్న పరగ్వాల్ సెక్టార్‌తో పాటు రాజౌరీ జిల్లాలోని సుందర్‌బనీ, నౌషెరా సెక్టార్లలో పాక్ సైన్యం కాల్పులు జరిపినట్లు అధికారులు తెలిపారు. బారాముల్లా, కుప్వారా జిల్లాల్లోనూ ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నట్లు పేర్కొన్నారు. ఏప్రిల్ 24 అర్ధరాత్రి నుంచి వరుసగా ప్రతిరోజూ పాక్ సైన్యం.. భారత ఆర్మీపై కాల్పులు జరుపుతున్న సంగతి తెలిసిందే. పహల్గాంలో ఏప్రిల్ 22న పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన పాశవిక దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో భారత్, పాక్ మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. పాక్‌తో దౌత్య సంబంధాలకు సంబంధించి భారత్ కీలక నిర్ణయాలు తీసుకుంది. సింధూ జలాల ఒప్పందం అమలును నిలిపివేయడంతో పాటు పాక్ పౌరులు తక్షణమే భారత్ విడిచివెళ్లాలని ఆదేశించింది. ఈ చర్యలతో దాయాది అక్కసు వెళ్లగక్కింది. సిమ్లా ఒప్పందంతోపాటు మిగిలిన ద్వైపాక్షిక ఒప్పందాలను పక్కనబెడుతున్నట్లు ప్రకటించింది. తమ గగనతలంలో భారత్‌కు చెందిన విమానాలకు అనుమతిని నిలిపేస్తున్నట్లు వెల్లడించింది.పహల్గాం ఉగ్రదాడి తర్వాత నియంత్రణ రేఖ వెంబడి పాకిస్థాన్ కవ్వింపు చర్యలకు పాల్పడుతూనే ఉంది. ఈ క్రమంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. పాకిస్థాన్, భారత్‌కు చెందిన మిలిటరీ ఆపరేషన్స్ డైరెక్టర్ జనరల్లు హాట్‌లైన్‌లో మాట్లాడుకున్నారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ పాక్ సైన్యం కాల్పులకు పాల్పడుతున్న విషయాన్ని ప్రస్తావించిన భారత్.. దాయాది దేశాన్ని హెచ్చరించినట్లు రక్షణశాఖ వర్గాలు వెల్లడించాయి.పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్-పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న విషయం తెలిసిందే. దీంతో సరిహద్దు ప్రజలు అప్రమత్తమవుతున్నారు. ఇదే సమయంలో పాకిస్థాన్ కూడా భద్రతాపరంగా పలు చర్యలు తీసుకుంటోంది. తాజాగా పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని గిల్గిత్, స్కర్దు తదితర ప్రాంతాలకు విమాన సర్వీసులను పాకిస్థాన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌లైన్స్ రద్దు చేసింది. సరిహద్దులో ఉద్రిక్తతలు నెలకొన్న వేళ పాకిస్థాన్ కూడా గగనతలాన్ని నిఘాను ముమ్మరం చేసింది. ఈ క్రమంలోనే లాహోర్, కరాచీ నుంచి పాక్ ఆక్రమిత కశ్మీర్ (%ాశీఖ%)లోని స్కర్దు, గిల్గిత్‌కు నడిచే విమాన సర్వీసులను పీఐఏ నిలిపివేసినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. జాతీయ భద్రతను దృష్టిలో ఉంచుకొని ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. వీటితోపాటు స్థానికంగా అన్ని విమానాశ్రయాలకు హై అలర్ట్ ప్రకటించినట్లు సమాచారం.

## తెలంగాణ పౌరసరఫరాల సంస్థకు ఐఎస్ఓ సర్టిఫికెట్

### లభించిన అంతర్జాతీయ గుర్తింపు

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ పౌరసరఫరాల సంస్థకు అంతర్జాతీయ గుర్తింపు లభించింది. ఈ సంస్థ సంస్కరణలపై అధ్యయనం చేసిన హెచ్‌వైఎం అంతర్జాతీయ సంస్థ.. సన్న బియ్యం పంపిణీ, మెరుగైన సేవలకు గుర్తింపుగా ఐఎస్ఓ సర్టిఫికెట్ అందించింది. ఐదు నక్షత్రాల రేటింగ్‌తో ఐఎస్ఓ 9001 సర్టిఫికెట్ ఇచ్చింది. పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా ఆ శాఖ ముఖ్య కార్యదర్శి చౌహాన్ సర్టిఫికెట్ అందుకున్నారు.





# అసెంబ్లీకిరాని కేసీఆర్‌కు ప్రతిపక్ష హోదా ఎందుకు ?

ప్రభుత్వంపై చేసిన విమర్శలకు కౌంటర్ ఇచ్చారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ కోతుల గుంపునకు అప్పగించినట్లయిందంటూ సీఎం ధ్వజమెత్తారు. ప్రతిపక్ష నేత కుటుంబం తెలంగాణ మీద పడి దోచుకుందన్నారు. 'తెలంగాణ ఆగమైంది.. కాంగ్రెస్ విలన్' అంటూ కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై సీఎం తీవ్రంగా మండిపడ్డారు. మరో పదేళ్లు దోచుకోవడం ఆగిందని తెలంగాణ ఆగమైందా? తెలంగాణ ఇచ్చినందుకు కాంగ్రెస్ విలన్ అయ్యిందా? అని ప్రశ్నించారు. కాళేశ్వరం, రైతు రుణమాఫీ, ఎస్సీ వర్గీకరణ, కులగణన, రైతుబంధుపై చర్చిద్దామా? అంటూ ఈ సందర్భంగా సవాల్ విసిరారు. ప్రతిపక్ష హోదా ఇచ్చిన ప్రజల వద్దకు కేసీఆర్ ఎందుకు వెళ్లట్లేదని ప్రశ్నించారు."బీఆర్ఎస్ సభ ఏర్పాటు చేసుకుంటే బస్సులు ఇవ్వాలని చెప్పాం. సభకు అవసరమైన వెసులు బాటుకల్పించాలని అధికా రులను ఆదేశించాం. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వంతో పాటు ప్రతిపక్షం బలంగా ఉండాలి. బీఆర్ఎస్ సభకు మేం సంపూర్ణంగా సహకరించింది నిజం కాదా? ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయంలో ఎక్కడా మంచి కనబడటం లేదా? ప్రభుత్వాన్ని భుజం తడుతూ వైఫల్యాలను ప్రశ్నించాలి. మా వైఫల్యాలపై ఎండగట్టాలి.. కానీ, ప్రతిపక్ష నేత ఇంట్లో నుంచి బయటకు వెళ్లకుండా ప్రభుత్వ వసతులు అనుభవిస్తున్నారు. 16 నెలలుగా జీత భత్యాలు తీసుకొని ఫాంహౌస్‌లోనే ఎందుకు ఉంటున్నారు? అసెంబ్లీకి రాను.. మా పిల్లల్ని పంపామని చెబుతున్నారు. పిల్లలను సభకు పంపితే మీరెందుకు ప్రతిపక్ష నేతగా ఉన్నారు? సభకు రాని ప్రతిపక్ష నేతకు మమ్మల్ని ప్రశ్నించే నైతిక హక్కు ఉందా? ప్రతిపక్ష హోదా ఇచ్చిన ప్రజల వద్దకు ఎందుకు వెళ్లడంలేదు. అధికారం ఉంటే చెలాయిస్తాం. లేకపోతే ఫాం హౌస్‌లో ఉంటామం టున్నారు. గత ప్రభుత్వ పథకాలు నిలిపివేసినట్లు చెబుతున్నారు. మీరు హయాంలోని పథకాలు ఏం ఆగిపోయాయి? రైతుబంధు ఆగిందా?, షాదీముబారక్, కల్యాణలక్ష్మీ, ఫీజురియంబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్ ఆగాయా? రాష్ట్రంలో ప్రజా పాలన ఎక్కడైనా ఆగిందా? మేం సన్నబియ్యం ఇస్తున్నాం. పేదల ఇళ్లకు 250 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, 60వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చాం. రెండున్నర లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చాం. ప్రైవేటులో లక్ష ఉద్యోగాలు కల్పించాం. హైదరాబాద్‌ను విస్తరించేందుకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నాం. ఆడబిడ్డలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాం. ఇవేమీ మీకు కనడటంలేదా?. కడుపు నిండా విషం నింపుకొని విద్వేషపూరిత ప్రసంగంతో ప్రజల మధ్య చిచ్చుపెట్టాలనే ప్రయత్నం మంచిదికాదు" అన్నారు.

## రాహుల్ విజన్ సాకారం కాబోతోంది

కులగణన చేపట్టిన తొలి రాష్ట్రం తెలంగాణే. రాహుల్ విజన్‌తో రాష్ట్రంలో కులగనణ చేపట్టాం. కులగణన కోసం కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా పోరాడింది. రాష్ట్ర కాంగ్రెస్ నేతలు దిల్లీలోనూ ఆందోళన చేశారు. తెలంగాణ చేసింది.. దేశం అనుసరిస్తోందని మరోసారి రుజువైంది" అన్నారు.కుల గణనపై కేంద్రం నిర్ణయం తెలంగాణ ప్రభుత్వ విజయమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. జనగణనతో పాటు కులగణన నిర్వహిస్తామనడం హర్షించదగిన అంశమని పేర్కొన్నారు. రాహుల్ ఆలోచన మేరకు రాష్ట్రంలో కులగణన సర్వే చేపట్టామన్న ఆయన.. కేంద్రం ఎట్టకేలకు ప్రజల ఒత్తిడితో కులగణనకు ఒప్పుకొందన్నారు.

## 'పది'లో గురుకులాలే ఫస్ట్

గతేడాది కంటే ఈసారి 1.47 శాతం అధికంగా ఉత్తీర్ణత నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఈ ఫలితాల్లోనూ బాలికలే పైచేయి సాధించారు. 94.26 శాతం మంది బాలికలు ఉత్తీర్ణత కాగా.. 91.32 శాతం మంది బాలురు పాసయ్యారు. అత్యధికంగా గురుకుల పాఠశాలల్లో 98.7 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా.. ప్రైవేటు పాఠశాలల్లో 94.21 శాతం విద్యార్థులు పాసయ్యారు. ఈసారి సబ్జెక్టుల వారీగా మార్కులు, గ్రేడ్లను ఎస్ఎస్‌సీ బోర్డు ఇచ్చింది. పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 3 నుంచి 13వ తేదీ వరకు జరగనున్నాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు జరుగుతాయని ఎస్ఎస్‌సీ బోర్డు ప్రకటించింది. ఫీజు చెల్లింపునకు తుది గడువు మే 16గా నిర్ణయించారు. రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు మే 15వరకు అవకాశం కల్పించారు. ఇందుకోసం సబ్జెక్టుకు రూ.500 చొప్పున చెల్లించి రీకౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. సబ్జెక్టుకు రూ.వెయ్యి చొప్పున చెల్లించి రీవెరిఫికేషన్‌కు దరఖాస్తుకు అవకాశం కల్పించారు. ఈ ఏడాది రెండు ప్రైవేటు పాఠశాలల్లో ఒక్క విద్యార్థి కూడా పాస్ కాలేదు. ఈ ఫలితాల్లో మహబూబాబాద్ జిల్లాలో అత్యధికంగా 99.29శాతం ఉత్తీర్ణత నమోదు కాగా.. వికారాబాద్‌లో అతి తక్కువగా 73.97శాతం ఉత్తీర్ణత నమోదైంది. పదో తరగతిలో ఈసారి కొత్తగా సబ్జెక్టుల వారీగా మార్కులతో పాటు గ్రేడింగ్ కూడా ఇచ్చారు. ఈ విధనంగా మార్కుల మెమోలు జారీ చేయనున్నారు. మార్కుల మెమోలపైనా సబ్జెక్టుల వారీగా రాత పరీక్షలు, ఇంటర్నల్ పరీక్షల మార్కులు, మొత్తం మార్కులు, గ్రేడ్ పొందుపరిచారు విద్యార్థి పాసయ్యారా..? ఫెయిల్ అయ్యారా...? అనేది మాత్రమే ఫలితాలలో కనిపిస్తుంది. ఇంకా బోధనేతర కార్యక్రమాల (కో కరిక్యులర్ యాక్టివిటీ-స్)లో విద్యార్థులకు గ్రేడ్లు ఇస్తారు. ప్రస్తుతం సిబిఎస్ఇలో సబ్జెక్టులవారీగా మార్కులు, గ్రేడ్లను ముద్రిస్తున్నారు. .

## బంగారం కొనుగోళ్లు పతనం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** అధిక ధరల కారణంగా పసిడి వన్నె తగ్గింది. జనవరి-మార్చి మధ్య కాలంలో డిమాండ్ 15 శాతం పడిపోయి, 118.1 టన్నులకు చేరిందని బుధవారం ప్రపంచ స్వర్ణ మండలి వెల్లడించింది. ధరలు ఎక్కువగా ఉండటంతో విలువపరంగా చూసుకుంటే 22 శాతం పెరిగి, రూ.94,030 కోట్లకు చేరినప్పటికీ.. డిమాండ్ మాత్రం తగ్గింది. 2025లో భారత గోల్డ్ డిమాండ్ 700 టన్నుల నుంచి 800 టన్నుల మధ్యలో ఉంటుందని డబ్ల్యూజీసీ అంచనా వేసింది.ఈ ఏడాది ప్రారంభం నుంచి బంగారం ధర 25 శాతం పెరిగింది. ప్రస్తుతం కాస్త దిగొచ్చిందికానీ.. ఒక దశలో 10 గ్రాముల మేలిమి పసిడి ధర రూ.లక్ష కూడా దాటేసింది. ఈ పరిణామాలు కొనుగోలుపై ప్రభావం చూపింది. అయితే అక్షయ తృతీయ, పెళ్లిళ్ల సీజన్ కొనుగోళ్ల సెంటిమెంట్‌కు మద్దతు ఇస్తూనే ఉందని డబ్ల్యూజీసీ ఇండియా సీఈఓ సచిన్ జైన్ తెలిపారు. రికార్డు ధరల కారణంగా వినియోగదారులు చిన్నపాటి, తేలికైన ఆభరణాల వైపు మొగ్గుచూపుతున్నారు. కొందరేమో ధర తగ్గుతుందని వేచి చూస్తున్నారు. అయితే వివాహాల కారణంగా డిమాండ్ కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్లలో అనిశ్చితి కారణంగా బంగారాన్ని సురక్షిత పెట్టుబడిగా భావిస్తున్నారు.

## దేవినేని కుమారుడి వివాహం.. హాజరైన సీఎం రేవంత్, ప్రముఖులు

**విజయవాడ(జనంసాక్షి)** తెదేపా సీనియర్ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు కుమారుడి వివాహ వేడుక ఘనంగా జరిగింది. నగర శివారు కంకిపాడులో జరిగిన ఈ వేడుకకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, ఏపీ సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి, మంత్రి నారా లోకేశ్‌తో పాటు తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు ముఖ్యనేతలు హాజర య్యారు.నూతన వధూవరులు నిహార్, సాయి నర్మదలను వారు ఆశీర్వదించారు. తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక తొలిసారి విజయవాడ చేరుకున్న రేవంత్‌రెడ్డికి హెలిప్యాడ్ వద్ద ఏపీ మంత్రులు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు, బీసీ జనార్దన్‌రెడ్డి స్వాగతం పలికారు.

## ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ ఓఎస్డీగా కమలాసన్ రెడ్డి

- ఐఏఎస్ అధికారి శశాంక్ గోయల్ పోస్టింగ్‌లో మార్పు..
- దిల్లీలోని తెలంగాణ భవన్ ప్రత్యేక సీఎస్‌గా నియామకం
- విశ్రాంత ఐఏఎస్ అధికారి శ్రీనివాసరాజు సీఎం కార్యదర్శిగా నియామకం

తెలంగాణ భవన్ ప్రత్యేక సీఎస్‌గా నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల శశాంక్ గోయల్‌ను సీజీజీ డీజీగా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చిన విషయం తెలిసిందే. తాజాగా ఆ పోస్టింగ్‌ను మార్చుతూ ఆయనకు దిల్లీలోని తెలంగాణ భవన్ ప్రత్యేక సీఎస్‌గా పోస్టింగ్ ఇచ్చింది. అలాగే, సీఎం కార్యదర్శిగా ఉన్న షానవాజ్ ఖాసీం బదిలీ అయ్యారు. ఆయన్ను డ్రగ్ కంట్రోల్ డైరెక్టర్ జనరల్‌గా ప్రభుత్వం నియమించింది. దీంతో పాటు ఎక్సైజ్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది. ఇప్పటివరకు ఈ రెండు పోస్టులు నిర్వహిస్తున్న సీనియర్ ఐపీఎస్ అధికారి కమలాసన్ రెడ్డి నేడు పదవీ విరమణ చేయడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. విశ్రాంత ఐఏఎస్ అధికారి శ్రీనివా సరాజు సీఎం కార్యదర్శిగా నియమితుల య్యారు. రెండేళ్ల పాటు ఈ పోస్టులో కొనసాగనున్నారు.

## సింగిల్ బెంచ్ ఉత్తర్వులపై జోక్యం చేసుకోలేం

సరిగా చేయలేదని, పరీక్ష కేంద్రాల కేటాయింపులోనూ నిబంధనలు పాటించలేదని పిటిషనర్లు పేర్కొన్నారు. దీనిపై ఇటీవల విచారణ చేపట్టిన జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు ధర్మాసనం.. నియామకాలు తాత్కాలికంగా నిలిపివేయాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. ధ్రువపత్రాల పరిశీలన చేసుకునేందుకు అవకాశం కల్పించారు.ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ సీజే ధర్మాసనంలో టీజీపీఎస్సీ పిటిషన్ దాఖలు చేసింది. ఈక్రమంలో బుధవారం వాదనల సందర్భంగా సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని టీజీపీఎస్సీ తరఫు న్యాయవాది కోరారు. దీనికి సీజే ధర్మాసనం నిరాకరించింది. ఈరోజు మధ్యాహ్నం సింగిల్ బెంచ్‌లో విచారణ ఉన్నందున జోక్యం చేసుకోలేమంది. సింగిల్ బెంచ్‌లో ఈ పిటిషన్లపై తేల్చుకోవాలని స్పష్టం చేసింది.

## ఆంధ్రా,తెలంగాణలో అసెంబ్లీ సీట్ల పెంపుపై సుప్రీంలో విచారణ

చేపట్టి, తీర్పును రిజర్వు చేసింది. ఈ కేసు రాజకీయ, రాజ్యాంగ దృష్ట్యా రెండు రాష్ట్రాలకు అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశంగా నిలిచింది.ఆంధ్రప్రదేశ్ రీ ఆర్గనైజేషన్ యాక్ట్, 2014లోని సెక్షన్ 26 ప్రకారం, ఏపీ, తెలంగాణలో అసెంబ్లీ సీట్ల సంఖ్యను పెంచాలని చట్టం సూచిస్తుంది. ఈ నిబంధన అమలు చేయాలని కోరుతూ డాక్టర్ కె. పురుషోత్తమ్ రెడ్డి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ చట్టం ప్రకారం, రెండు రాష్ట్రాల్లో జనాభా పెరుగుదల, రాజకీయ ప్రాతినిధ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని నియోజకవర్గాల సంఖ్యను సమీక్షించి పెంచాల్సి ఉంటుంది. అయితే, గత కొన్నేళ్లుగా ఈ నిబంధన అమలు కాకపోవడంతో ఈ పిటిషన్ దాఖలైంది.డాక్టర్ పురుషోత్తమ్ రెడ్డి తన పిటిషన్‌లో కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం సెక్షన్ 26ను అమలు చేయడంలో విఫలమయ్యాయని ఆరోపించారు. ఈ నిబంధనను అమలు చేయాలని కేంద్రానికి, ఎన్నికల సంఘానికి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కోర్టును కోరారు. ఈ విషయంపై గతంలో కూడా సుప్రీంకోర్టులో చర్చలు జరిగినప్పటికీ, తాజా విచారణ అంశం చర్చనీయాంశంగా మారింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కె.సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటీషన్‌పై విస్తృతంగా వాదనలు చేసింది. పిటిషనర్ తరపున వాదిస్తూ, రెండు రాష్ట్రాల్లో జనాభా వృద్ధి, భౌగోళిక అవసరాల ఆధారంగా అసెంబ్లీ సీట్ల సంఖ్య పెంచడం తప్పనిసరి అని ప్రస్తావించారు. ఏపీలో ప్రస్తుతం 175 అసెంబ్లీ సీట్లు-, తెలంగాణలో 119 సీట్లు- ఉన్నాయి. ఈ సంఖ్యను పెంచితే, ప్రజాప్రతినిధుల సంఖ్య పెరిగి, రాజకీయ ప్రాతినిధ్యం మరింత సమర్థవంతంగా ఉంటుందని వాదించారు. కేంద్ర ప్రభుత్వం తరపున వాదనలు విన్న ఎన్నికల సంఘం తమ స్థానాన్ని సమర్థించుకుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 170 ప్రకారం, 2026 తర్వాత జనాభా లెక్కల ఆధారంగానే నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుందని వారు వాదించారు. అంతకుముందు సీట్ల పెంపు కోసం రాజ్యాంగ సవరణ అవసరమని, ఇది సంక్లిష్టమైన ప్రక్రియ అని పేర్కొన్నారు.

# యాసంగి పంట కొనుగోలు వేగవంతం చేయాలి

89 వేల ఎకరాలలో సాగు జరిగిందని, 137.10 ఎల్ఎంటి ధాన్యం ఉత్పత్తి అవుతుందని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా దాదాపు 70.13 ఎల్ఎంటి ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంటుందని అన్నారు.రాష్ట్రంలో ఇప్పటి వరకు 2.55 లక్షల రైతుల నుంచి 19.60 ఎల్ఎంటి ధాన్యం కొనుగోలు చేశామని అన్నారు. మే నెలలో కొనుగోలు కేంద్రాలకు అధికంగా ధాన్యం రానున్న నేపథ్యంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అకాల వర్షాలు కారణంగా రైతులు నష్టపోకుండా నాణ్యమైన ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేయాలని మంత్రి సూచించారు.రానున్న 15 నుంచి 20 రోజుల పాటు సజావుగా ధాన్యం కొనుగోలు చేయడం ప్రభుత్వ అత్యంత ప్రాధాన్యత అంశమని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద ఎటువంటి లోటుపాట్లు ఉండటానికి వీలులేదని అన్నారు. రైస్ మిల్లులకు బ్యాంక్ గ్యారెంటీ అడిగామని, ఏ అంశంలో మినహాయింపులు ఇవ్వడం కుదరదని మంత్రి పేర్కొన్నారు. రైస్ మిల్లర్లతో కలెక్టర్, ఉన్నతాధికారులు చర్చించాలని, జిల్లాలలో అవసరమైతే ఇంటర్మీడియట్ గోదాములకు కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించాలని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 10 లక్షల మెట్రిక్ టన్నుల ఇంటర్మీడియట్ గోదాముల కేటాయింపు జిల్లాల వారీగా అవసరం బట్టి మంజూరు చేయాలని మంత్రి పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులకు సూచించారు. ప్రభుత్వానికి ఆర్థికంగా ఇబ్బంది ఉన్నప్పటికీ రైతులకు సమస్య రాకుండా చూసుకోవాలని అన్నారు.ధాన్యం కొనుగోలుపై వివిధ రాజకీయ పక్షాలు, పత్రికలు, సామాజిక మాధ్యమాల ద్వారా చేస్తున్న దుష్ప్రచారాన్ని అధికారులు తిప్పి కొట్టాలని, ఎక్కడైనా నిజంగానే ఇబ్బందులు ఉంటే వాటిని సత్వరమే పరిష్కరించాలని మంత్రి సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ, హెచ్ఎంటి, ఆర్ఎన్ఆర్, 1638 రకాల ధాన్యంలో నూకలు అధికంగా వస్తాయనే కారణంతో మిల్లర్లు తిరస్కరిస్తున్నట్లు గమనించడం జరిగిందని అన్నారు. రైస్ మిల్లు వద్ద క్వింటాల్ కు 5 కేజీలు తరుగు తీస్తున్నట్లు రైతులు ఆందోళన చెందుతున్నారని, కొనుగోలు కేంద్రాలలో గన్ని బ్యాగుల కొరత కూడా కొంత ఉందని అన్నారు. రాబోయే యాసంగి సీజన్ లో నూకలు అధికంగా వచ్చే వడ్ల విత్తనాలను పంట వేయకుండా రైతులలో అవగాహన కల్పించాలని మంత్రి అన్నారు.వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న పౌరసరఫరాల శాఖ కమీషనర్ డిఎస్ చౌహాన్ మాట్లాడుతూ, జిల్లాలో ఉన్న రైస్ మిల్లర్లు నిబంధనలు ప్రకారంనడుచుకునేలా కలెక్టర్లు పకడ్బందీగా పర్యవేక్షించాలని అన్నారు. ధాన్యం రవాణాకు వాహనాల ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని, రైస్ మిల్లుల వద్ద ధాన్యం బస్తాలు అన్ లోడింగ్ ఆలస్యం కాకుండా చూడాలని, హమాలీల కొరత ఉండకుండా జాగ్రత్త పడాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్దకు పెద్ద ఎత్తున ధాన్యం వస్తున్నప్పటికీ వేగవంతంగా కొనుగోలు చేయడంలో కొంత ఆలస్యం జరుగుతుందని, వీటిని సంపూర్ణంగా నివారించాలని అన్నారు. ధాన్యం కొనుగోలు అంశంపై జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించి ప్రత్యేకంగా మానిటర్ చేయాలని అన్నారు. రైస్ మిల్లర్లు తాలు, తరుగు పేరు మీద ఎటువంటి కోతలు లేకుండా జాగ్రత్తలు పాటించాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద గన్ని బ్యాగులు ఉండాలని రైతులకు నేరుగా ఇవ్వవద్దని, మనం కొనుగోలు చేసిన ధాన్యంనింపేందుకు మాత్రమే వినియోగించాలని అన్నారు.

## సింహాద్రి అప్పన్న చందనోత్సవంలో అపశ్రుతి

**సింహాచలం(జనంసాక్షి):**
విశాఖ జిల్లా సింహాద్రి అప్పన్న స్వామి చందనోత్సవంలో అపశ్రుతి చోటుచేసుకుంది. స్వామివారి నిజరూపాన్ని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులపై గోడ కూలడంతో 8 మంది మృతి చెందారు. నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మృతుల్లో ముగ్గురు మహిళలు, ఐదుగురు పురుషులు ఉన్నారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత సింహాచలంలో భారీ వర్షం కురిసింది. దీంతో సింహగిరి బస్టాండ్ నుంచి ఎగువకు వెళ్లే మార్గంలో షాపింగ్ కాంప్లెక్స్ వద్ద రూ.300 టికెట్ క్యూలైన్‌పై సిమెంట్ గోడ కూలింది. వెంటనే ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది, అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. హోంమంత్రి వంగలపూడి అనిత, విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చీ ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. మృతదేహాలను విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. వరహా లక్ష్మీ నరసింహస్వామి భక్తులకు నిజరూపంలో దర్శనమిస్తున్నారు. స్వామివారిని దర్శించుకునేందుకు ఇప్పటికే భారీ ఎత్తున సింహగిరికి పోటెత్తారు. వేకువజామున ఒంటిగంటకు స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపారు. అనంతరం స్వామివారి దేహంపై ఉన్న చందనాన్ని వెండి బొరిగెలతో అత్యంత సున్నితంగా వేరుచేశారు. నిజరూపంలోకి వచ్చిన స్వామికి విశేష అభిషేకాలు నిర్వహించారు. వైదిక కార్యక్రమాల అనంతరం ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు, ఆయన కుటుంబ సభ్యులకు నిజరూప దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా వారు స్వామివారికి తొలి చందనాన్ని సమర్పించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం తరపున రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, తితిదే పట్టు వస్త్రాలు సమర్పించారు. ఉదయం 3 గంటల నుంచి 6 గంటల వరకు ప్రోటోకాల్, అంతరాలయ దర్శనాలను ఏర్పాటు చేశారు.కాగా సింహాచలం ఆలయం వద్ద జరిగిన ప్రమాద ఘటనపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ప్రధాని నరేంద్ర మోదీ ప్రధాన మంత్రి జాతీయ సహాయనిధి నుంచి పరిహారం ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ.50 వేలు చొప్పున అందజేయనున్నట్లు తెలిపారు. సింహాచలంలో ప్రమాదంపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గోడ కూలి భక్తులు మృతి చెందిన ఘటన తీవ్ర ఆవేదన కలిగించిందన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సింహాచలం ఘటనపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గోడ కూలి ప్రాణ నష్టం జరగడం విచారకరమన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.సింహాచలం ప్రమాద ఘటనపై భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## సమ్మె నిర్ణయంపై పునరాలోచించాలి

**హైదరాబాద్(జనంసాక్షి):** ఆర్టీసీ సమ్మె నోటిసుపై స్పందించిన రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆర్టీసీ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని సమ్మె నిర్ణయంపై పునరాలోచించాలని అన్నారు. మే 7నుంచి తెలంగాణ ఆర్టీసీ సమ్మెకు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. నష్టాల్లో ఉన్న ఆర్టీసీని లాభాల్లోకి తీసుకొచ్చామని.. ప్రస్తుతం సమ్మె చేయాల్సిన పరిస్థితిలో ఆర్టీసీ లేదని పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆర్టీసీ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని స్పష్టం చేశారు. ఆర్టీసీ కార్మికుల పోరాటం వల్లే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని.. ఆర్టీసీ కార్మికుల సంక్షేమం, ప్రయాణికుల సౌకర్యం, ఆర్టీసీ పరిరక్షణ అంశాలపై కట్టుబడి ఉన్నామని అన్నారు. గత పదేళ్ళలో ఆర్టీసీలో పెండింగ్ పీఎఫ్ బకాయిలను తగ్గించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అన్నారు. సమ్మెపై ఇప్పటివరకు శాఖ మంత్రిగా తనను ఎవరూ కలవలేదని.. డైరెక్ట్ గా లేబర్ కమిషన్ ను కలిసి నోటీ-స్ అందజేశారని అన్నారు. ఉద్యమకారుడిగా తనకు ఆర్టీసీతో ప్రత్యేక అనుబంధం ఉందని.. ఆర్టీసీ కార్మికులతో సమాలోచనలు చేసేందుకు సిద్ధంగా ఉన్నానని అన్నారు పొన్నం ప్రభాకర్.

## కర్రెగుట్టలను స్వాధీనం చేసుకున్న బలగాలు

### జాతీయ జెండా ఎగురేసిన జవాన్లు

**ములుగు(జనంసాక్షి):** తెలంగాణ- ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని బీజాపూర్ జిల్లాలోని కర్రెగుట్టల్లో మావోయిస్టు నేతలను లక్ష్యంగా చేసుకొని చేపట్టిన ఆపరేషన్ 9వ రోజుకు చేరుకుంది. ఈ ఆపరేషన్‌లో భాగంగా కర్రెగుట్టలను భద్రతాబలగాలు తమ అధీనంలోకి తెచ్చుకున్నాయి. కర్రెగుట్టపై పూర్తి పట్టును సాధించడంతో ఆపరేషన్ కగార్ సక్సెస్ అయింది. 10 వేలకు పైగా సాయుధ బలగాలలు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నాయి. వేల అడుగుల ఎత్తులోని కర్రెగుట్టల్లో శిఖరం వరకు చేరుకున్న బలగాలు బుధవారం జాతీయ పతాకాన్ని ఎగురవేస్తూ కనిపించాయి. సీఆర్‌పీఎఫ్ నేతృత్వంలో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన డీఆర్‌జీ, బస్తర్ ఫైటర్స్, కోబ్రా బలగాలు పెద్ద సంఖ్యలో తెలంగాణ సరిహద్దులోని కొత్తపల్లి నుంచి ఛత్తీస్‌గఢ్‌లోని పూజారికాంకేరు, నంబి, గల్‌గం, నడిపల్లి ల్లో పెద్ద ఎత్తున ఆపరేషన్ చేపడుతున్నాయి. ఈ ఆపరేషన్ నేరుగా ఐబీ చీఫ్ రాయపూర్ నుంచి పర్యవేక్షించారు. ఇప్పటికే కర్రెగుట్టను పోలీసు భద్రతా బలగాలు అష్టదిగ్బంధనం చేసి ఆ ఏరియాల్లో మావోయిస్టులు అమర్చిన 150కు పైగా ఐఈడీలను స్వాధీనం చేసుకున్నాయి.

# స్థానికేతరుల చేపల దుకాణం తొలగించాలి

### జడ్చర్లలో చేపల మార్కెట్ భవనాలు నిర్మించాలి



**జడ్చర్ల, ఏప్రిల్ 30 జనం సాక్షి):** జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో స్థానికేతరులు ఏర్పాటు చేసిన చేపల దుకాణాలను తొలగించాలని జడ్చర్ల మత్స్యకారులు డిమాండ్ చేశారు. స్థానికేతరులు పట్టణంలో చేపల దుకాణం పెట్టడం వల్ల స్థానిక మత్స్యకారులకు నష్టం వాటిల్లుతుందని వాటిని వెంటనే తొలగించాలని మత్స్యకారుల సంఘం నాయకులు జడ్చర్ల మున్సిపాలిటీ కమిషనర్ కు బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మత్స్యకారుల సంఘం నాయకులు మాట్లాడుతూ జడ్చర్లలో ఎన్నో ఏళ్ళ నుండి చేపల వ్యాపారమే జీవనోపాధిగా బ్రతుకుత ఉండటంతో, ఇక్కడ కర్నూలు నుండి వచ్చిన ఒక వ్యక్తి షాప్ పెట్టి చేపలు అమ్ముతూ తమ పొట్ట కొడుతున్నాడని, వేంటనే అతనిపై చర్యలు తీసుకుని షాప్ బంద్ చేయించాలి. అదేవిధంగా జడ్చర్లలో అన్ని కుల వృత్తుల వారికి వ్యాపార సముదాయాలు ఉన్నాయి కానీ చేపలు అమ్మే మత్స్యకారులకు వ్యాపార సముదాయా భవనాలు లేకపోవడంతో రోడ్డు పైనే దుమ్ము ధూళిలో చేపలు అమ్మాల్సి వస్తుంది. కావున ప్రభుత్వం వెంటనే స్పందించి మాకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో శివ ముదిరాజ్, కృష్ణయ్య, పిట్టల మురళి, మహేష్ బాబు, శ్రీనాథ్, కావలి నర్సంహా, సతీష్ మహిళలు పాల్గొన్నారు.

# పైలట్ ప్రాజెక్టుగా 'సారథి' పోర్టల్

### సారథి పోర్టల్ ప్రారంభించిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
### దేశవ్యాప్తంగా రవాణా సేవల కోసం తెలంగాణలో డిజిటల్ వేదిక ప్రారంభం




**అల్వాల్, ఏప్రిల్ 30 (జనంసాక్షి):** సికింద్రాబాద్ ఆర్టీవో కార్యాలయంలో 'సారథి' పోర్టల్‌ను పైలట్ ప్రాజెక్టుగా రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ అభివృద్ధి చేసిన 'సారథి', 'వాహన్' డిజిటల్ సేవలను తెలంగాణ ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ పోర్టల్‌ల ప్రధాన లక్ష్యం దేశవ్యాప్తంగా రవాణా శాఖ సేవలను ఒకే గొడుగు కిందకు తీసుకురావడం. ఇప్పుడు రాష్ట్రంలోని వాహనదారులు తమ వాహనాలకు సంబంధించిన సమాచారాన్ని, డ్రైవింగ్ లైసెన్స్ సేవలను ఎక్కడి నుంచైనా పొందగలుగుతారు. సారథి అప్లికేషన్ ద్వారా డ్రైవింగ్ లైసెన్స్ పునరుద్ధరణ, చిరునామా మార్పు, కొత్త వాహన కేటగిరి చేర్పు వంటి సేవలు మరింత సులభతరం కానున్నాయి. డీజీ లాకర్ ప్లాట్‌ఫామ్‌తో అనుసంధానమై ఉండటంతో, డ్రైవింగ్ లైసెన్స్‌ను డిజిటల్ ఫార్మాట్‌లో భద్రపర్చుకోవచ్చు. విదేశాలకు వెళ్లినపుడు లైసెన్స్ అసలైనదేనని ఆయా దేశాధికారులు ధృవీకరించుకోవడం కూడా ఇప్పుడు సులభం కానుంది. రాష్ట్రవ్యాప్తంగా 'వాహన్' సేవలను వచ్చే ఆగస్టు నుంచి అమలులోకి తేవాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**ఆర్టీసీ సమ్మె నోటీసుపై స్పందించిన మంత్రి**

ఆర్టీసీ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని సమ్మె నిర్ణయంపై పునరాలోచించాల్సిన అవసరం ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రస్తుతం సమ్మె చేయాల్సిన పరిస్థితి లేదని, ఆర్టీసీ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. ఆర్టీసీ కార్మికుల పోరాటం వల్లే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని గుర్తు చేశారు. గత పదేళ్లలో పెండింగ్ పీఫ్ బకాయిలను తగ్గించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీని లాభాల్లోకి తీసుకురాగలగడం తమ ప్రభుత్వ విజయంగా పేర్కొన్నారు. కార్మికుల సంక్షేమం, ప్రయాణికుల సౌకర్యం, ఆర్టీసీ పరిరక్షణ పట్ల ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు.

# దేశానికి దిక్సూచి.. నాడు బెంగాల్.. నేడు తెలంగాణే

### సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యం
### తెలంగాణ ప్రభుత్వ చర్యల ఒత్తిడితోనే కేంద్రం కులగణనకు అంగీకారం
### ఒక బీసీ బిడ్డగా... మంత్రిగా ఎంతగానో సంతోష పడుతున్న
### కేంద్ర క్యాబినెట్ నిర్ణయంపై రాష్ట్ర మంత్రి కొండా సురేఖ కీలక వ్యాఖ్యలు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** మన దేశానికి దిక్సూచిగా నాడు బెంగాల్ ఉంటే... నేడు తెలంగాణే అని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. సామాజిక దృక్పథం కలిగిన తెలంగాణ ప్రభుత్వం ఒత్తిడితోనే కేంద్ర ప్రభుత్వం కులగణనకు అంగీకారం తెలిపిందని ఆమె అన్నారు. ఇది తమ నాయకుడు రాహుల్ గాంధీ ఆశ, ఆశయమని... తమ రాష్ట్ర ప్రభుత్వ పెద్దల కృషి అని సురేఖ అభిప్రాయపడ్డారు. సామాజిక న్యాయం కాంగ్రెస్ తోనే సాధ్యం అంటూ సురేఖ వ్యాఖ్యానించారు. ఈ పరిణామాల పట్ల ఒక బీసీ బిడ్డగా... బీసీ మంత్రిగా ఎంతగానో సంతోష పడుతున్నట్టు ఆమె వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వ క్యాబినెట్ నిర్ణయంపై రాష్ట్ర మంత్రి కొండా సురేఖ బుధవారం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా చేసే జనాభా లెక్కల్లో కుల గణన చేస్తామనడం తెలంగాణ ప్రభుత్వ సంపూర్ణ విజయమని మంత్రి సురేఖ చెప్పుకొచ్చారు. తమ నాయకుడు, కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర సందర్భంగా సామాజిక అసమానతలు, కుల రుగ్మతలు తొలగించడానికి దేశవ్యాప్తంగా కుల గణన చేయాలని డిమాండ్ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా సురేఖ గుర్తు చేశారు. రాష్ట్రంలో తమ మా ప్రభుత్వం చేపట్టిన కులగణన ఆధారంగా బీసీలకు రాజకీయ, విద్యా, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ చట్టం చేసిందని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం చేసిన కుల గణన ఆధారంగా తీసుకొని కేంద్ర ప్రభుత్వం చేసే జనాభా లెక్కల్లో కుల గణన చేస్తామని పేర్కొనడం సంతోషంగా ఉందన్నారు. ఇది ఒక్క విప్లవాత్మకమైన చర్యగా తాను అభివర్ణిస్తున్నట్టు చెప్పారు. దీని ద్వారా సామాజిక రుగ్మతలు తొలగి అందరికీ సామాజిక న్యాయం జరుగుతుందని ఆకాంక్షిస్తున్నట్టు మంత్రి సురేఖ చెప్పారు.

# సామాజిక ఆధ్యాత్మిక విప్లవకారుడు శ్రీ మహాత్మా బసవేశ్వర్

### పిఎసి చైర్మన్ అరికపూడి



**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 30 (జనంసాక్షి) :** మూఢవిశ్వాసాలు, సాంఘిక దురాచారాలు రాజ్యమేలుతున్న 9 శతాబ్దాల క్రిందటే సమాజ అభ్యున్నతి కోసం అవిశ్రాంతంగా కృషిచేసి సామాజిక ఆధ్యాత్మిక విప్లవకారునిగా చరిత్రలో సుస్థిరంగా నిలిచిపోయిన మహనీయులు శ్రీ మహాత్మా బసవేశ్వరుడు అని రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికపూడి గాంధీ పేర్కొన్నారు. శ్రీ మహాత్మా బసవేశ్వర 892 వ జయంతిని పురస్కరించుకొని హెూప్ ఫౌండేషన్ ఛైర్మెన్ కొండా విజయ్ ఆధ్వర్యంలో హఫీజ్పేట్ డివిజన్ పరిధిలోని హుడా కాలనీలో బుధవారం నిర్వహించిన బసవేశ్వర జయంతి వేడుకలలో మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకులు రఘునాథరెడ్డి తో కలిసి చైర్మన్ అరికపూడి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఇందులో భాగంగా దాదాపు 200 మంది మహిళలకు చైర్మన్ అరికెపూడి, ఓ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్ కుమార్ తదితరులు ఉచితంగా చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముందుగా శేరిలింగంపల్లి ప్రజలకు, లింగాయత్ సమాజానికి మహాత్మ శ్రీ బస్వేశ్వర 892 వ జయంతి శుభాకాంక్షలు తెలియచేసారు. ఎన్నో సామాజిక కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగించే హెూప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్ నేతృత్వంలో శ్రీ మహాత్మ బస్వేశ్వరుడి జయంతి వేడుకలు నిర్వహించుకోవడం సంతోషాన్ని కలిగించిందన్నారు. మహిళల అభ్యున్నతికి, వారి సామాజిక ఎదుగుదలకు శ్రీ మహాత్మా బసవేశ్వరుడు చేపట్టిన సంస్కరణలను దృష్టిలో పెట్టుకొనిబస్వేశ్వరుడి జయంతి సందర్భంగా పేద మహిళలకు హెూప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్ కుమార్ చీరలను అందచేయడం ఎంతో అభినందనీయమన్నారు. విద్య, సమాజం, సమానత్వం గురించి పోరాటంచేసిన మహనీయుడు, సామాజిక ఆధ్యాత్మిక విప్లవకారుడు బసవేశ్వరుని జయంతిని ప్రజలంతా నిర్వహించుకుంటే ఇంకా స్ఫూర్తిదాయకంగా ఉంటుందన్నారు. హైదరాబాద్ నడిబొడ్డున ట్యాంక్‌బండ్‌పై బసవేశ్వరుడి కాంస్య విగ్రహాన్ని ఏర్పాటుచేసి, ఏటా ఆయన జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నారని, లింగాయత్ సమాజ గౌరవాన్ని మరింత ఇనుమడించేలా, లింగాయత్‌ల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలతో పాటు కోకాపేటలో బసవ భవన్ ఏర్పాటు కోసం విలువైన స్థలం కేటాయించి భవన నిర్మాణం కోసం 10 కోట్ల రూపాయలను సైతం కేటాయించడం జరిగిందన్నారు. అపూర్వ ప్రజాస్వామ్య వాది బస వేశ్వరుడని, పాల్కుర్కి సోమనాథుడు తన ఆరాధ్య దైవమైన బస్వేశరుని పై బసవ పురాణం రాశాడని అరికపూడి గుర్తు చేశారు. ఆయన గొప్పతనాన్ని గుర్తించిన భారత ప్రభుత్వం పార్లమెంట్ ప్రాంగణంలో బస వేశ్వరుని విగ్రహాన్ని ఏర్పాటు చేసిందని, అదేవిధంగా లింగాయత్ ధర్మకర్త సృష్టి కర్త మహాత్మ బస్వేశ్వరుడు విశ్వ గురువు, మహా మానవతా వాది, సంఘ సంస్కర్త, కుల, మత, వర్గ, వర్ణ వ్యవస్థను రూపుమాపడనికి 12వ శతాబ్దంలోనే పూనుకున్న మొదటి సాంఘిక విప్లవకారుడని గాంధీ తెలియచేసారు. స్త్రీ, పురుష అసమానతలు తొలగించడానికి కృషి చేసిన అభ్యుదయవాది అని, దళితులకు ఆలయ ప్రవేశం కలిపించిన ప్రగతి శీలి అని, మొట్టమొదటి కులాంతర వివాహం చేసిన గొప్ప సంఘసంస్కర్త అని, తన కాలపు సమాజ జీవితంలో వెలుగులు నింపిన మహనీయుడు బసవన్న అరికపూడి, కొండా విజయ్ కొనియాడారు. ముక్త సమాజ వైతాళికుడు, జగమెరిగిన శ్రేష్ఠ దార్శనికుడు, సామాజిక వ్యవస్థలో సమానత్వం ఉండాలని ఆనాడే ఆకాంక్షించిన దార్శనికుడు బసవేశ్వరుడని, మనుషులు శాంతి, సామరస్యాలతో సహజీవనం జరుపాలని ఉంచడం జరిగిందన్నారు. శ్రీ మహాత్మ బసవేశ్వరుడు స్ఫూర్తిగా సమసమాజ స్థాపనకోసం ప్రతి ఒక్కరూ బసవన్న జీవితంను ఆదర్శంగా తీసుకోవాలని, ఆయన చూపిన బాటలో నడవాలని, యువతకు ఎంతో స్ఫూర్తిదాయకం ఆయన జీవితం అని, బసవన్న ఆశయల సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆరెకపూడి గాంధీ పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, మల్లికార్జున్ శర్మ, నరేందర్ బల్లా, పాత్రికేయులు పుట్టా వినయ్ మరియు మహిళలు పాల్గొన్నారు.

# కర్రెగుట్టలపై జాతీయ పతాకాన్ని ఎగురవేసిన భద్రత బలగాలు

### 9వ రోజు చేరుకున్న ఆపరేషన్

**చర్ల (జనంసాక్షి):** తెలంగాణ ఛత్తీస్గడ్ సరిహద్దులోని బీజాపూర్ జిల్లా ఉసురు పోలీస్ స్టేషన్ పరిధిలోని 5 వేల అడుగుల ఎత్తులోని అత్యంత దుర్భేద్యమైన కర్రెగుటల్లో కీలకమైన మావోయిస్టు నేతల ను లక్ష్యంగా చేసుకొని చేపట్టిన భారీ ఆపరేషన్ బుధవారం నాటికి 9వ రోజుకు చేరుకుంది. ఈ ఆపరేషన్లో అత్యంత అవరోధాలు నడుమ కర్రెగుట్ట లో కొంత భాగాన్ని భద్రతాబల గాలు తమ ఆధీనంలోకి తెచ్చుకున్నాయి. శిఖరం వరకు చేరుకున్న బలగాలు జాతీయ పతాకాన్ని ఎగురవేస్తూ కనిపించారు. సిఆర్పిఎఫ్ నేతృత్వంలో ఛత్తీస్గడ్ కు చెందిన డిఆర్జి, బస్తర్ ఫైటర్స్, కోబ్రా బలగాలు పెద్ద సంఖ్యలో తెలంగాణ సరిహద్దులోని కొత్తపల్లి నుంచి ఛత్తీస్గడ్ లోని పూజారికాంకేరు, నంబి, గల్ గం, నడిపల్లి ప్రధాన ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఆపరేషన్ చేపడుతున్నాయి. ఈ క్రమంలో ఈ నెల 24 తేదీన జరిగిన ఎదురు కాల్పుల్లో పి ఎల్ జి ఏ ( పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ) మొదటి బెటాలియన్‌కు చెందిన ముగ్గురు మహిళా మావోయిస్టులు మృతి చెందారు. మరోపక్క చత్తీస్గడ్ హెూం మంత్రి విజయ్ శర్మ శాంతి చర్చలపై కీలక ప్రకటన చేశారు. మావోయిస్టులు లొంగి పోవాలని కోరారు. శాంతి చర్చల ప్రతిపాదనను తిరస్కరించారు. ఒకపక్క కర్రెగుట్ట ఆపరేషన్ జరుగుతున్న నేపథ్యంలో శాంతి చర్చలు జరపాలని కోరుతూ మావోయిస్టు కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ ఓ ప్రకటనలో కేంద్ర రాష్ట్ర, ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు.

# కేంద్ర కులగణన అత్యంత శాస్త్రీయమైది

### కులాల వారీగా జనాభా ఎంతో తేలిపోతోంది
### జనాభా ఆధారంగా రిజర్వేషన్లలో న్యాయం జరుగుతుంది
### రాజకీయాలకు అతీతంగా అందరూ సహకరించండి
### కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** దేశవ్యాప్తంగా జనాభా లెక్కలతోపాటు కుల గణన నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకం. సాహసోపేత నిర్ణయం తీసుకున్న ప్రియతమ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ ప్రజల పక్షాన ధన్యవాదాలు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయంతో దేశవ్యాప్తంగా ప్రజలకు ఎంతో ప్రయోజనం కలగబోతోంది. అత్యంత శాస్త్రీయంగా కేంద్రం నిర్వహించే ఈ సర్వేలో కులాల వారీగా ఎంత జనాభా ఉందో నిక్కచ్చిగా తెలుతుంది. తద్వారా ఏ కులానికి నష్టం వాటిల్లకుండా రిజర్వేషన్ల అమలులో న్యాయం జరిగే అవకాశముంది. శ్రీ నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కాంగ్రెస్ విజయమంటూ ఆ పార్టీ నేతలు ప్రచారం చేసుకోవడం సిగ్గు చేటు. జాతీయ కాంగ్రెస్ పార్టీ కుల గణనకు వ్యతిరేకి. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి ఏనాడూ దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించకపోవడమే ఇందుకు నిదర్శనం. జనగణన సమయంలో కూడా కులాన్ని చేర్చలేదు. కులగణన చేపట్టాలంటూ 2010లో దేశవ్యాప్తంగా చాలా రాజకీయ పార్టీలు డిమాండ్ చేస్తే ఈ అంశంపై మంత్రుల బృందాన్ని నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నియమించింది. కానీ కుల గణనకు బదులుగా సర్వే మాత్రమే నిర్వహించాలని నిర్ణయించిందే తప్ప శాస్త్రీయ పద్ధతిలో కులగణన నిర్వహించనే లేదు. కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే కులగణన అంశాన్ని కాంగ్రెస్ లెవనెత్తుతుందే తప్ప ఆ పార్టీకి ఏమాత్రం చిత్తశుద్ధి లేదు. మోదీ సర్కార్ నిర్ణయం కాంగ్రెస్ ఘనతే అయితే డూప్లికేట్ గాంధీల ఏలుబడిలో కులగణన ఎందుకు చేయలేదో సమాధానం రాహుల్ గాంధీ దేశ ప్రజలకు సమాధానం చెప్పాలి. తెలంగాణసహా కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించిన కులగణన సర్వేలో పారదర్శకత లేనేలేదు. రాజకీయ లబ్ది కోసమే సర్వేలు నిర్వహిస్తూ తమకు అనుకూలమైన కులాల జనాభా పెంచుతూ, ఇతర కులాల జనాభాను తగ్గించే చూపే ప్రయత్నం చేశాయి. తద్వారా సమాజంలో కులాల మధ్య కుమ్ములాటలు, అస్థిర పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ రాబోయే జనాభా లెక్కింపులో కుల గణనను చేర్చాలని ఈరోజు నిర్ణయం తీసుకోవడం చారిత్రాత్మక నిర్ణయం. కేంద్ర నిర్ణయాన్ని రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు, కుల సంఘాలు, మేధావులు, విద్యావేత్తలు స్వాగతిస్తూ సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నా.



# పొన్నాల గ్రామాన్ని అలియాబాద్ మున్సిపాలిటీలో కలపాలి

### మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జి వజ్రేష్ యాదవ్

**శామీర్ పేట్ ( జనం సాక్షి) :** మేడ్చల్ జిల్లా శామీర్ పేట మండలం పొన్నాల గ్రామాన్ని అలియాబాద్ మున్సిపాలిటీలో కలపా లని పొన్నల గ్రామస్తులు మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ ని కోరగా వెంటనే ఆయన స్పందించి జిల్లా ఇన్చార్జి మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు కి వినతి పత్రం అందజేయగా వెంటనే స్పందించిన మంత్రి పొన్నాల గ్రామాన్ని అలియాబాద్ మున్సిపాలిలో కలపడానికి కృషి చేయ్యాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ కి ఆ యొక్క పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నరసింహులు యాదవ్, శామీర్ పేట్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గడ్డం రమేష్, రఘు రెడ్డి నర్సింగరావు, కృష్ణ, స్వామి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# కుల గణనపై కేంద్ర కేబినెట్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

### మాజీ బీసీ కమిషన్ సభ్యులు ఉపేంద్ర



**హైదరాబాద్ (జనంసాక్షి) :** భారత ప్రభుత్వంలో బీసీ సంక్షేమం కోసం అభివృద్ధి కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని నాటి ప్రధానమంత్రికి మన్మోహన్ సింగ్ గారికి స్వయంగా కేంద్ర మంత్రిగా ఉన్న కేసీఆర్ గారు ఆంధ్రప్రదేశ్ బీసీ నాయకులైన ఆర్ కృష్ణయ్య గారి బృందాన్ని ప్రధానమంత్రిని కలిసి వినతి పత్రం అందజేసినారు ఉద్యోగస్తులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని కూడా అనేక సందర్భాలలో టిఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రానికి ఉత్తరాలు రాసింది ఏది ఏమైనా 1931లో దేశంలో నాటి బ్రిటిష్ ప్రభుత్వం కులగనన చేసిందని ఆ తర్వాత స్వతంత్ర భారతంలో కాకాలేల్కర్ కమిషన్ మండల కమిషన్ రిపోర్ట్ లల్లో కులగనన చేయాలని చెప్పారని అయినా పాలకులు పెడచెవిన పెట్టారని అనేక సందర్భాలలో సుప్రీంకోర్టు ఆయా రాష్ట్రాల హైకోర్టులు ఆయా రాష్ట్రాల కమిషన్లు జనగణనలో కులగనన చేయాలని దేశంలో మెజార్టీ ప్రజల లెక్కలు తెలవకుండా సంక్షేమ పథకాలు కానీ అభివృద్ధిలో గానీ సమ పంపకాలు జరగవని చెప్పినా కూడా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోలేదని ఆయన అన్నారు 2011లో కాంగ్రెస్ పార్టీ సోషియో ఎకనామిక్ సర్వేతో కొంత చేసినప్పటికీ కొంత చేసినప్పటికీ లెక్కలు బయట పెట్టలేదని దేశంలో రాష్ట్రాలలో బీసీ సంఘాల నాయకులు పోరాటాలతో న్యాయబద్ధమైన ధర్మమైన డిమాండ్కు కేంద్రం ఇప్పటికైనా దిగివచ్చి జనగణనలో కులగనన చేస్తామని కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకోవడం శుభపరిణామమని నిర్ణయం ద్వారా దేశంలోని మెజారిటీ ప్రజలకు తమకు న్యాయం జరుగుతుంది అనే నమ్మకం కలిగిందని ఆయన అన్నారు రాబోయే కాలంలో ప్రజలందరూ చట్టసభలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు పొందటానికి ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు

# ఎన్‌హెచ్ 44కు దారి దొరికింది

### రహదారిపై ఆటంకాలను తొలగించిన హైడ్రా




**హైదరాబాద్, ఏప్రిల్ 30 (జనంసాక్షి) :** దేవరయాంజల్, కండ్లకోయ ప్రజలు సులభంగా జాతీయ రహదారి 44కు చేరుకునే అవకాశం హైడ్రా కల్పించింది. ఈ రెండు గ్రామాల మధ్య ఉన్న రహదారిని బండకుంట నరసింహారెడ్డి గేట్లు పెట్టి, రోడ్డును కొంత మేర తవ్వేసి ఆటంకాలు సృష్టించగా.. బుధవారం హైడ్రా వాటిని తొలగించింది. మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా షామీర్‌పేట మండలం దేవరయాంజల్ విలేజికి ఉండే ప్రధాన రహదారిని మూసేశారంటూ స్థానికులు ఫిర్యాదు చేయడంతో హైడ్రా క్షేత్రస్థాయిలో పరిశీలించింది. రోడ్డుకు అడ్డంగా గేట్లు పెట్టి రాకపోకలకు ఆటంకాలు కలిగిస్తున్నారని నిర్ధారించుకుంది. కండ్లకోయ 135, 136 సర్వే నంబర్లలో జిల్లా న్యాయస్థాన సముదాయానికి కొంత స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది. అలాగే ఇవే సర్వే నంబర్లలో మేడ్చల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, మేడ్చల్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ నిర్మాణానికి కూడా కొంత స్థలాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. వీటి నిర్మాణం జరగాల్సి ఉండగా.. ఇప్పటికే ఈ మార్గంలో కొన్ని పరిశ్రమలు కూడా ఉన్నాయి. వీటితో పాటు కండ్లకోయ - దేవరయాంజల్ నివాసితులు కూడా ఇదే రోడ్డును వినియోగిస్తున్నారు. ప్రస్తుతం మట్టి రోడ్డు ఉండగా.. త్వరలో 40 అడుగుల విస్తీర్ణంలో దాంబరు రోడ్డు నిర్మించేందుకు కూడా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో రహదారిపై ఆటంకాలు సృష్టించడం ఏంటని స్థానికులు హైడ్రాను ఆశ్రయించారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించాక అక్కడ నిర్మించిన గేట్లతో పాటు.. మరోవైపు రోడ్డుమీద అడ్డంగా వేసిన బండరాళ్లను హైడ్రా తొలగించింది. కందకం మాదిరి తవ్విన చోట మట్టిని నింపి రాకపోకలను పునరుద్ధరించింది. గూండాగిరితో రాకపోకలకు అంతరాయం కలిగించిన వారిపై చర్యలు తీసుకోవాలని.. హైడ్రాను స్థానికులు కోరారు. ఫిర్యాదుచేసిన వారం రోజుల్లోనే ఆటంకాలను తొలగించిన హైడ్రాకు ధన్యవాదాలు తెలిపారు.

# చిన్న సాయంతో సమాజంలో పెద్ద మార్పులు

### జాతీయ బీసీ దళ్ అధ్యక్షులు దుండ్ర కుమారస్వామి
### చలివేంద్రం, ఉచిత మెడికల్ క్యాంపు ఏర్పాటు




**హైదరాబాద్ (జనంసాక్షి) :** చిన్న సహాయం కూడా సమాజంలో పెద్ద మార్పులు తెస్తుందని ,సమాజ సేవ నిజమైన సేవగా భావించి నేడు చలివేంద్ర కేంద్రం మరియు ఉచిత మెడికల్ క్యాంపు ఏర్పాటు అని జాతీయ బీసీ దళ్ అధ్యక్షులు దుండ్ర కుమారస్వామి అన్నారు. ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ సంస్థ బ్లిస్ బర్గ్ ఫ్యూచర్ ఆఫ్ హెూప్, శ్రీ సిగ్మా హాస్పిటల్‌తో సంయుక్తంగా శేరిలింగంపల్లిలోని మాదాపూర్‌లో చలివేంద్ర కేంద్రాన్ని ,ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాన్ని రాజ్ న్యూస్ ఛానల్ చైర్మన్ లక్ష్మీ రావు బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి, ప్రముఖ యాక్టర్ రాజా రవీందర్ అతిథిలుగా పాల్గొని ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. వేసవి కాలంలో పాటించవలసిన నియమ నిబంధనలతో కూడిన బ్రోచర్లను ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాజ్ న్యూస్ ఛానల్ చైర్మన్ చైర్మన్ లక్ష్మీ రావు, ప్రముఖ సామాజికవేత్త, జాతీయ బీసీ దళ్ అధ్యక్షులు దుండ్ర కుమారస్వామి,ప్రముఖ దర్శకుడు శ్రీ వాసు, జెనిసిస్ ఇన్ఫో ఎక్స్ అధినేత డాక్టర్ సరికొండ వినయ్,ప్రముఖ నటుడు రాజా రవీంద్ర, కార్డియాలజిస్ట్ విశ్వనాథ్, (సీఈవో) సిగ్మా హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్‌తో పాటు పలువురు మేధావులు, ఐటీ నిపుణులు, స్థానిక ప్రజాప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మీ రావు మాట్లాడుతూ, సమాజంలోని నిరుపేదలకు ఆరోగ్య సేవలు, ఉచిత వైద్య పరీక్షలు అందించడం ద్వారా సామాజిక బాధ్యతను నెరవేర్చడం గొప్ప విషయమని అన్నారు. జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి మాట్లాడుతూ, బ్లిస్ బర్గ్ ఫ్యూచర్ ఆఫ్ హెూప్ సంస్థ సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా పేదలకు, అణగారిన వర్గాలకు, వెనుకబడిన వర్గాల ఉన్నతికి చేస్తున్న కృషి ప్రశంసనీయమని కొనియాడారు. వేసవి కాలంలో సామాన్యులకు, కార్మికులకు ,నిరుపేదలకు ఉపశమనం కల్పించేందుకు ఈ చలివేంద్రం ద్వారా ఉచిత శీతల పానీయాలు అందించడం లక్ష్యమని తెలిపారు. సమాజ శ్రేయస్సుకు ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. బ్లిస్ బర్గ్ ఫ్యూచర్ ఆఫ్ హెూప్ సంస్థ విద్య, ఆరోగ్యం, సామాజిక సంక్షేమ రంగాల్లో చేస్తున్న కృషిని పలువురు ప్రశంసించారు. ఈ చలివేంద్రం ద్వారా స్థానికంగా అవసరమైన వారికి సేవలు అందించడం ద్వారా సంస్థ తన లక్ష్యాలను మరింత విస్తరించిందని తెలిపారు. శ్రీ సిగ్మా హాస్పిటల్ ఎండి శ్రీనివాస్ మాట్లాడుతూ, ఆరోగ్య సేవలతో పాటు ఇలాంటి సామాజిక కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం తమ సంస్థ బాధ్యతగా భావిస్తున్నామని, వేసవిలో సామాన్యులకు ఉపశమనం కల్పించడంతో పాటు ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. స్థానిక ప్రజలు ఈ చలివేంద్రం ఏర్పాటును హర్షించి, బ్లిస్ బర్గ్ ఫ్యూచర్ ఆఫ్ హెూప్, శ్రీ సిగ్మా హాస్పిటల్‌ల సంయుక్త కృషిని అభినందించారు. ఈ కార్యక్రమం స్థానికంగా సామాజిక సేవలకు ఒక ఆదర్శంగా నిలిచింది. ఇలాంటి కార్యక్రమాలు ఇతర సంస్థలకు స్ఫూర్తినిస్తాయని, సమాజంలో సానుకూల మార్పులకు దోహదపడతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా, బ్లిస్ బర్గ్ ఫ్యూచర్ ఆఫ్ హెూప్ ప్రతినిధులు భవిష్యత్తులో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ప్రజలకు ఆరోగ్యం, విద్య, సామాజిక సంక్షేమం వంటి రంగాల్లో సేవలు అందించడం ద్వారా సమాజంలో సమగ్ర అభివృద్ధిని సాధించే లక్ష్యంతో పనిచేస్తామని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడంతో, ఇలాంటి సేవలను మరింత విస్తరించేందుకు సంస్థలు కట్టుబడి ఉన్నాయని తెలిపారు.



## శాంతి చర్చలు మావోయిస్టుల కోసం కాదు

# ప్రజాస్వామ్య స్థాపన కొరకు

మావోయిస్టుల పేరుతో దేశ వ్యాప్తంగా సాగుతున్న ఎన్‌కౌంటర్‌ల హత్యా కాండ పతాకస్థాయికి చేరి ఏ రాష్ట్రంలోనైనా ఎక్కడైనా ఎవరినైనా కాల్చి చంపి ఎన్‌కౌంటర్‌గా ప్రకటించే ఆనవాయితీని అన్ని రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వాలు కొనసాగిస్తున్నాయి. ఎన్‌కౌంటర్ అనేది ఎదురు కాల్పుల విషయంలో ఒకరినొకరు కాల్చుకొని చనిపోవడమనే విషయం నుంచి పట్టుకొని బంధించి కాల్చి చంపి ఎన్‌కౌంటర్‌గా ప్రకటించే ఆనవాయితీగా వస్తున్నది. ఇలా ఎన్‌కౌంటర్ పేరిట హత్య చేయడమనేది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1924 నుంచి ప్రారంభమైంది. అది మన్యంలో అల్లూరి సీతారామ రాజుతో 1922 లో రంపా తిరుగుబాటు ద్వారా విశాఖపట్నంలో కొనసాగిన ఉద్యమంపై బ్రిటీష్ వలసవాదుల ఎన్‌కౌంటర్ హత్య కొనసాగింది. ఆ తరువాత 1946 నుంచి 51 వరకు తెలంగాణ సాయుధ పోరాటంలో 3000 మంది రైతాంగ కార్యకర్తలను ఎన్‌కౌంటర్ పేరుతో అప్పటి ప్రభుత్వం కాల్చి చంపింది. ఇదంతా కూడా 1947 ముందు జరిగిన ఘటనలుగానే మనం చూస్తు న్నాం. కానీ 1975 ఎమర్జెన్సీ కాలంలో జలగం వెంగళ రావు కొనసాగించిన ఎన్‌కౌంటర్ హత్యాకాండతో శ్రీకాకుళ సాయుధ రైతాంగ పోరాటం పూర్తి అణచివేతకు గురైంది. అక్కడి నుండి జగిత్యాల, సిరిసిల్లా జైత్రయాత్రలు అణచివేయడానికి తెలంగాణలోనికొన్ని ప్రాంతాలను కల్లోలిత ప్రాంతాలుగా ప్రకటించి 127 సాయుధ క్యాంపులతో అణచివేతను కొనసాగించారు. ఆ తరువాత వచ్చిన పీపుల్స్‌వార్ ఉద్యమంపైన చివరికి నల్లమలలో కొనసాగిన ఉద్యమాలపై ఎన్‌కౌంటర్ హత్యా కాండ కొనసాగుతూ ఉద్యమాలను ఆంధ్ర తెలంగాణ ప్రాంతాలలోనే ఉనికిలో లేకుండా చేసింది. ఆ క్రమంలోనే 1980ల ప్రాంతంలో దండకారణ్యంలో ప్రవేశించిన పీపుల్స్ వార్ అది 2004లో మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్‌తో కలిసి మావోయిస్టు పార్టీగా అవతరించిన తరువాత జార్ఖండ్, బీహార్, వెస్ట్ బెంగాల్ ప్రాంతాలలో బలమైన ఉద్యమ ప్రాంతాలను నెలకొల్పు కున్నది. ఆ నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వ నివేదిక ప్రకారము 185 జిల్లాలలో మావోయిస్టు ఉద్యమ ప్రభావం ఉందని ప్రభుత్వ లెక్కలే ప్రజల ముందు పెట్టాయి. కానీ 90ల నుంచి ప్రారంభమైన దండ కారణ్యంలోని ఉద్యమ అణచివేత సల్వాజుడుం గ్రీన్ హంట్ ఆపరేషన్ సమాధాన్‌లను దాటుకొని నేడు ఆపరేషన్ కగార్‌లో వేలాది బలగాలు చుట్టుముట్టి కాల్చివేసి ఎన్‌కౌంటర్‌గా ప్రకటిస్తున్న అత్యంత కడుహీన స్థితికి ప్రభుత్వాలు దిగజారిపోయాయి.




ప్రజాస్వామ్యంలో రాజ్యంగం ద్వారా ప్రజలకు ప్రాథమిక హక్కులను హామీ పడ్డ ప్రభుత్వాలు ఆచరణలో ఏమీ లేకుండా చేస్తున్నాయి. చివరికి ఆర్టికల్ 21 జీవించే హక్కు కూడా ఎన్‌కౌంటర్ పేరుతో వేటాడబడు తున్నది. ఇప్పటికి రెండున్నర దశాబ్దాలలో 16 వేలకు పైగా ఎన్‌కౌంటర్ పేరుతో ప్రభుత్వాలు కాల్చి చంపాయి. ఏ ఎన్‌కౌంటర్‌పై కూడా ఏ రాష్ట్రంలో కూడా సరియైన న్యాయ విచారణ జరగకుండానే కేసులు మూతబడిపోతున్నా యి. దీనితో ప్రభుత్వాలు యదేచ్ఛగా పోలీసు బలగాలతో కాల్చి చంపించి ఎన్‌కౌంటర్‌గా ప్రకటిస్తున్నాయి. అందుకు అనేక మిలిట్రీ ఆపరేషన్ల పేర్లను సాకుగా వాడుతున్నాయి. కానీ ఇదే ఎన్‌కౌంటర్ హత్యా కాండకు వ్యతిరేకంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1997లో కన్నాభిరాన్ ఆధ్వర్యంలో న్యాయస్థానంలో పోరాటం ప్రారంభించారు. దాని తీర్పులో భాగంగా 6 ఫిబ్రవరి 2009లో భాగంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విస్తృత ధర్మాసనం ఒక బలమైన తీర్పును ప్రకటించింది. ఆ తీర్పు వెలువడిన 6 నెలల కాలం అంటే ఆ తీర్పుపై సుప్రీం కోర్టు స్టే ఇచ్చేంత వరకు ఎన్‌కౌంటర్లు జరగలేదు.

ఆ తరువాత 2014లో పియుసిఎల్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర కేస్‌లో 16 గైడ్‌లైన్స్‌లో ఇచ్చిన తీర్పును సుప్రీం కోర్టు కూడా ఖరారు చేసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తీర్పును వెనక్కి నెట్టేసింది. ఈ ఎన్‌కౌంటర్ల నేపథ్యం లోనే ఎన్‌టి రామారావు కాలంలో 1989లో ఆ ఏడాదే అత్యంత ఎక్కువ 275 ఎన్‌కౌంటర్ హత్యలు జరిగాయి. ఆ నేపథ్యంలోనే తెలంగాణలోని యువత ఎన్‌కౌంటర్ పేరుతో కాల్చి చంపబడుతున్న స్థితిలోనే ఎస్ఆర్ శంకరన్ రిటైర్డ్ ఐఎఎస్ ఆఫీసర్ చేసిన దశాబ్దకాల కృషిలో భాగంగానే 2004లో వైఎస్ఆర్ ప్రభుత్వానికి పీపుల్స్ వార్ పార్టీకి మధ్య శాంతి చర్చలు జరిగాయి. కానీ ఆ చర్చల్లో కీలక భూమికను పోషించిన భూమి విషయం వచ్చేసరికి రెండవ దఫా చర్చల్లో పరిష్కరించుకుందామని మొదటి దఫా చర్చలను ముగించడం జరిగింది. రెండవ దఫా చర్చలేమో కానీ మళ్ళీ నల్లమల అంతా రక్తం ఏరులై పారి చర్చల వాతావరణమే లేకుండా పోయింది. మొత్తంగా ప్రభుత్వాలు ఎవరినైనా చంపాలనుకుంటూ ఎన్‌కౌంటర్ ఆయుధాన్ని చాలా బలంగా ఉపయోగించుకుంటాయి. ఇప్పుడు 2024లో ప్రారంభమైన ఆపరేషన్ కగార్ ఒక ఏడాదిలోనే 350కి పైగా ఆదివాసీల హత్యలు, 45 ఎన్‌కౌంటర్లతో మేధావులను, ప్రజా సంఘాలను, ప్రతిపక్ష పార్టీలను ఆందోళను గురిచేయడం సహజమైన విషయం. దానికన్నా ముఖ్యంగా మధ్య భారతంలో ఒక బలమైన ఉద్యమాన్ని కొనసాగి స్తున్న మావోయిస్ట పార్టీ కూడా తన పేరుతో ఆదివాసీల నరసంహారాన్ని కొనసాగించడాన్ని చూడలేక, సహించలేక చర్చల ప్రక్రియలో తానే ముందుగా కాల్పుల విరమణ ప్రకటించి నెల రోజులుగా శాంతి కోసం ప్రయత్నిస్తున్నారు. కానీ కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ఆ శాంతి ప్రక్రియపై ఎటువంటి స్పందన వెలువరించలేదు. ఈ స్థితిలోనే అఖిల భారత స్థాయిలో రెండు తెలుగు రాష్ట్రాలలో కూడా శాంతి చర్చలపై ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో 26 ఏప్రిల్ 2025న తెలంగాణలోని ప్రతిపక్ష బిఆర్ఎస్ పార్టీ స్పష్టంగా ఆపరేషన్ కగార్‌ను ఆపాలని మావోయిస్టు పార్టీ చర్చలకు సిద్ధమని ప్రకటించిన నేపథ్యంలో చర్చలు కూడా కొనసాగించాలని లక్షలాది జనం ముందు కెసిఆర్ ప్రకటించడం జరిగింది. అంతేకాక సుమారుగా అన్ని వామపక్ష పార్టీలు కూడా చర్చలకే సిద్ధమని తమ అభిప్రాయాన్ని ఒక పక్క ప్రకటిస్తూనే ఉన్నారు. అలా కాక కేంద్ర ప్రభుత్వం చత్తీస్‌ఘడ్ ప్రభుత్వం అంటే డబుల్ ఇంజన్ సర్కార్‌లు హత్యాకాండకే ప్రాధాన్యతనిస్తూ నెలకు జరుగుతున్న రెండు మూడు ఎన్‌కౌంటర్లలో 100ల కొద్ది ఆదివాసీలను చంపేసి ఎన్‌కౌంటర్‌గా ప్రకటిస్తున్నారు. నిన్నటి వరకు జరిగిన కర్రెగుట్ట ఎపిసోడ్‌లో సుమారు 15 వేల మూడు రాష్ట్రాల సాయుధ బలగాలు కర్రెగుట్టను చుట్టుముట్టాయిన ఒకటి రెండు రోజులలో కర్రెగుట్ట శవాల గుట్టగా మారుతుందని వీపరీతమైన ప్రచారం ప్రభుత్వం ద్వారా మీడియా చేయగలిగింది. ఇది నిజంగా ఒక ప్రజాస్వామ్య దేశంలో మనుషులన ఎన్‌కౌంటర్ పేరుతో వేటాడి హత్య చేయడమనేది సరియైనది కాదు. అది మన రాజ్యాంగం కూడా ఒప్పుకోదు. కానీ రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్య విలువలను తొక్కేసి హత్యాకాండను కొనసాగిస్తానని ప్రకటించడ మంటేనే కార్పొరేట్ల కోసం తన సొంత ప్రజలను కూడా శతృదేశ ప్రజలుగా చిత్రించి యుద్ధం చేస్తున్న బిజెపి ప్రభుత్వ హత్యాకాండను మనందరం ప్రశ్నించడంలో భాగంగా ప్రతిపక్ష పార్టీలు కూడా ముందుకు రావాల్సిన అవసరం ఉంది. ఈ రోజు మావోయిస్టులను ఎన్‌కౌంటర్ పేరుతో చంపొచ్చు, రేపు ప్రతిపక్ష పార్టీ నేతలను కూడా ఎన్‌కౌంటర్ పేరుతో చంపవచ్చు. ఎన్‌కౌంటర్‌లకు పరిధులు, పరిమితులు ఉండవు. అందులో భాగంగానే దిశ అత్యాచార నిందితులకు కేస్-రీకన్‌స్ట్రక్షన్ పేరుతో క్షేత్రస్థాయికి తీసుకెళ్ళి కాల్చి చంపి ఎన్‌కౌంటర్‌గా ప్రకటించారు. ఆ నేపథ్యం నుంచే దేశంలోని బుద్ధి జీవులు ప్రజాస్వామిక వాదులు ప్రతిపక్ష పార్టీలు విశ్వ విద్యాలయ ప్రొఫెసర్లు, విద్యార్థులు చర్చలు జరపాలని ఆపరేషన్ కగార్‌ను ఆపివేయాలని పెద్ద ఎత్తున ఉద్యమిస్తున్నారు. అందులో భాగంగానే నిన్న ఉస్మానియా యూనివర్సిటిలో కూడా విద్యార్థులు శాంతి చర్చల ప్రక్రియను కొనసాగించాలని, ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని నినదించారు. పౌరహక్కుల సంఘంగా మేము ఒక అడుగు ముందుకు వేసి ఇప్పటికే మధ్యభారతంలో 600 క్యాంపులతో 7 లక్షల పారా మిలిట్రీ బలగాలను ఆ ప్రాంతం నుంచి వెనక్కి తీసుకోవడం ద్వారానే చర్చల ప్రక్రియకు మధ్య భారతంతో శాంతిని నెలకొల్పడానికి అవకాశం ఉంటుంది. ఆ వైపుగా ప్రభుత్వం ఆలోచించకపోతే ప్రజాస్వామ్యమని రాజ్యాంగమని చెబుతూ అధికారంలోకి రావడం వచ్చాక వాటిని ఖాతరు చేయకుండా కేవలం కార్పొరేట్లకు ఖనిజ సంపదను అందించడం కోసం మధ్యభారతంలో ఆదివాసీ జాతిని నిర్మూలించాలనే బలమైన ప్రణాళికతో ఆపరేషన్ కగార్‌ను ప్రకటించి ఇప్పటికే నాలుగైదు సార్లుగా మావోయిస్టులను పూర్తి స్థాయిలో నిర్మూలిస్తానని 26 మార్చి 2025న కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ప్రకటించడం ప్రజాస్వామిక వ్యవస్థలో న్యాయవ్యవస్థ కూడా కీలకంగా ఉంటుందనే ప్రధాన విషయాన్ని పక్కకు నెట్టేసి మేము ఎవరినైనా చంపుతాం అని స్పష్టంగా ప్రకటిస్తే ఇక రాజ్యానికి విలువ లేని స్థితిలో ప్రజాస్వామ్యం గురించి ఎవరు మాట్లాడతారు. ప్రజాస్వామ్యము రాజ్యాంగం లేకపోతే బిజెపి ప్రభుత్వానికి మూడుసార్లు అధికారంలోకి రావడానికి అవకాశాలే లేవు. కాబట్టి రాజ్యాంగాన్ని విశ్వసించి పరిపాలన చేస్తున్న ప్రభుత్వాలుగా ప్రజాస్వామ్య బద్ధంగా మీ పరిపాలన లేకపోతే ప్రజలు తిరుగుబాటు చేయడం ఖాయం. అది సాయుధ పోరాటంగా వస్తుందా ప్రజాస్వామ్య పోరాటంగా వస్తుందా ఎవరూ ఊహించలేము. ఆ స్థితికి దేశ ఆర్థిక సామాజిక పరిస్థితులను ప్రభుత్వాలు నెట్టకుండా ఉంటే బాగుంటుంది. ఇప్పటికైనా బుద్ధిజీవుల మరియు మేధావులు కోరిక మేరకు అన్ని ప్రతిపక్ష పార్టీల ఒత్తిడి మేరకు శాంతి చర్చలు జరిపి ప్రజాస్వామిక వాతావరణాన్ని నెలకొల్పాలి. ఈ శాంతి చర్చలు మావోయిస్టుల ప్రాణ రక్షణ కోసంకాదు. వారి పేరుతో కొనసాగిస్తున్న నరసంహారాన్ని నిరోధించడం కోసం అన్నది సత్యం.



ఎన్. నారాయణ రావు
ప్రధాన కార్యదర్శి
పౌరహక్కుల సంఘం



## మేడే స్ఫూర్తితో

# ఉద్యమించాలి

మేడే, ప్రతి సంవత్సరం మే 1వ తేదీన జరుపుకునే ఒక ముఖ్యమైన రోజు, ప్రపంచవ్యాప్తంగా కార్మికుల హక్కులను మరియు సామాజిక న్యాయాన్ని సూచిస్తుంది. ఈ రోజు అంతర్జాతీయ కార్మిక దినోత్సవంగా (ఇంటర్నేషనల్ వర్కర్స్ డే)గుర్తించబడుతుంది. కార్మికుల సమస్యలపై అవగాహన కల్పించడానికి, వారి హక్కుల కోసం పోరాటాన్ని గౌరవించడానికి ఉద్దేశించబడింది.

'మే' , డే యొక్క మూలాలు 19వ శతాబ్దంలో అమెరికాలోని కార్మిక ఉద్యమాలకు సంబంధించినవి. 1886లో, అమెరికాలోని చికాగో నగరంలో కార్మికులు 8 గంటల పని రోజు కోసం ఉద్యమం చేశారు. ఆ రోజుల్లో, కార్మికులు 12-16 గంటల పాటు కఠిన పరిస్థితుల్లో పనిచేసేవారు. ఈ డిమాండ్‌తో, మే 1, 1886న లక్షలాది కార్మికులు సమ్మెలు , ర్యాలీలు నిర్వహించారు. ఈ ఉద్యమం మే 4వ తేదీన "హేమార్కెట్ " ఘటనకు దారితీసింది, ఈ ర్యాలీలో బాంబు పేలుడు మరియు తదనంతర హింసాకాండకు గురైంది. ఈ సంఘటన కార్మిక ఉద్యమానికి ఒక మలుపు తిప్పింది. కార్మికుల హక్కుల కోసం పోరాటానికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపును తెచ్చింది.

1889లో, సెకండ్ ఇంటర్నేషనల్ అనే సోషలిస్ట్ సంస్థ, మే 1ని అంతర్జాతీయ కార్మిక దినోత్సవంగా జరుపుకోవాలని నిర్ణయించింది. అప్పటి నుండి, "మే" డే కార్మికుల సమైక్యత, సంఘీభావం, హక్కుల కోసం ఒక చిహ్నంగా మారింది. ఇప్పటి తరం భావిస్తున్నట్లు ... 'మే' డే కేవలం ఒక సెలవు దినం కాదు. ఇది కార్మికుల సాధించిన పోరాటాలను, త్యాగాలను, విజయాలను స్మరించుకోవడానికి వారు ఎదుర్కొంటున్న సవాళ్లను హైలైట్ చేయడానికి ఒక అవకాశం. 8 గంటల పని రోజు, కనీస వేతనం, సురక్షితమైన పని పరిస్థితులు, మరియు కార్మిక సంఘాల హక్కు వంటి అనేక సంస్కరణలు మే డే ఉద్యమాల ఫలితంగా సాధ్యమయ్యాయి.

మే డే అనేది కార్మికుల సంఘీభావాన్ని బలోపేతం చేయడానికి మరియు సామాజిక, ఆర్థిక అసమానతలపై పోరాటం చేయటానికి ఒక వేదికగా ఉపయోగపడుతుంది. ప్రపంచవ్యాప్తంగా, ఈ రోజున ర్యాలీలు, సమావేశాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడతాయి. ఇవి కార్మికుల సమస్యలను చర్చించడానికి, వారి హక్కుల కోసం ఒక ఐక్య గొంతును ఏర్పరచడానికి దోహదపడతాయి. ఆధునిక కాలంలో, మే డే యొక్క ప్రాముఖ్యత మరింత విస్తృతమైంది. ఆర్థిక గ్లోబలైజేషన్, ఆటోమేషన్, మరియు గిగ్ ఎకానమీ వంటి కొత్త సవాళ్లు కార్మికుల ముందు ఉన్నాయి. అసమాన వేతనాలు, ఉపాధి అసురక్షితం, మరియు కార్మిక హక్కుల ఉల్లంఘనలు ఇప్పటికీ అనేక దేశాల్లో సమస్యలుగా ఉన్నాయి. మేడే ఈ సమస్యలను పరిష్కరించడానికి ఒక వేదికగా కొనసాగుతోంది. భారతదేశంలో, మేడే కార్మిక సంఘాలు మరియు రాజకీయ పార్టీల ద్వారా ర్యాలీలు, సమావేశాల రూపంలో జరుపుకుంటారు. ఈ రోజు కార్మికుల హక్కులను రక్షించడానికి మరియు కార్మిక చట్టాలను బలోపేతం చేయడానికి ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చే అవకాశంగా ఉపయోగపడుతుంది. 'మే' డే అనేది కార్మికుల పోరాట స్ఫూర్తిని మరియు వారి హక్కుల కోసం నిరంతరం జరిగే సమరాన్ని సూచిస్తుంది. ఇది చరిత్రలో ఒక ముఖ్యమైన రోజుగా మాత్రమే కాక, ఆధునిక సమాజంలో సామాజిక న్యాయం, ఆర్థిక సమానత్వం కోసం పోరాడే ఒక స్ఫూర్తిగా కొనసాగుతోంది. కార్మికుల గౌరవం, హక్కులను కాపాడటానికి మనమందరం ఈ రోజున ఒక నిబద్ధతను పునరుద్ఘాటించాలి.




దండెబోయిన అశోక్ యాదవ్,
గెజిటెడ్ హెడ్మాస్టర్, పెద్దమదూర్,జనగాం.
9440521990.

## ఎన్టీపీసీ వెలుగుల్లో కాంట్రాక్టు కార్మికుల

# చీకటి బతుకులు

కూటికోసం కూలీ కోసం బతుకు కోసం దూరం ప్రాంతాల నుండి వచ్చిన వారికి ఎన్ని కష్టాలో ఎన్ని సంవత్సరాలైనా మారని జీవితాలు ఎన్టిపిసి కాంట్రాక్టు కార్మికులవి. నాడు ఈ ఎన్టిపిసి ప్లాంట్ కోసం ఎన్నో గ్రామాలు వాళ్ల విలువైన అమూల్యమైన భూములను అంద చేసినారు. బుచ్చయ్య పల్లె, జంగాలపల్లి, మారేడుపాక, లక్ష్మీపురం, ఎలుకలపల్లి గ్రామాల కు సంబంధించిన వందలాదిఎకరాల భూములను ఈ యొక్క ప్లాంట్ కోసం ఇవ్వడం జరిగినది.



అప్పుడు ఉన్న పరిస్థితుల్లో అతి తక్కువ ధరలకే ప్రజల వద్ద నుండి భూములను తీసుకున్నారు. ఇంటికో ఉద్యోగం ఇస్తామ ని భూములు ఇచ్చిన ప్రజలందరికీ ఎన్టిపిసి యజమా న్యం ప్రజలందరికీ ఉద్యోగంతో సకల సహకారాలు అందిస్తా మని చెప్పి చివరకు ప్రజలకు మొండి చేయి చూపినారు. ఎన్టిపిసి పవర్ ప్లాంట్ లో కాంట్రాక్టు కార్మికులకు పని చేస్తున్న నాటి నుండి నేటి వరకు అనేక ఇబ్బందులకు గురి చేస్తూ ఎన్టిపిసి యజమాన్యం ముందుకు సాగుతున్నది. ఎన్‌టిపిసి యజమా న్యం ప్లాంట్ కోసం భూములు ఇచ్చిన ప్రజల అవసరాల కోసం నూతన గృహ నిర్మాణం విద్యా వైద్యము అనేకమైన సౌకర్యాలు కల్పిస్తామని హామీలు ఇచ్చినప్పటికీ . ఆచరణలో అది ఎక్కడ కనబడక పోవడం ఇది ఎన్టిపిసి యొక్క నిజస్వరూపం.

ఇక కాంట్రాక్టు కార్మికులు రోడ్డున పడి దినదినం గండంతో బతుకులు ఎల్ల తీసుకోవడం కోసం పడరాన్ని పాట్లు పడుతూ నిత్యం అనేక ఇబ్బందులను గురవుతూ చాలు చాలని జీతాలతో అర్ద ఆకలితో నిత్యం పెరుగుతున్న ధరలను తట్టుకో లేక మానసిక ఒత్తిడిలకు గురి అవుతూ కొందరి కార్మికుల జీవితాలు అర్ధకలి ఆకలి చావులతో అర్ధాంతంగా చనిపోతు న్న సంఘటనలున్న కనకరించే వారు కరువైయారు.

ఈ ఎన్‌టిపిసి ప్లాంట్లో పనిచేస్తున్న క్రమంలో 18 ఏళ్ల నూతన యవ్వనంతో వచ్చిన కార్మికుడు ఇప్పుడు బతుకు జీవుడా అని 60 సంవత్సరాలు నిండినయని బయటకు పంపించే స్థాయికి ఎదిగిపోయినాడు.ప్లాంట్ మొదలుపెట్టి నుండి, యజమాన్యం కాంట్రాక్టు కార్మిక సంఘాలతో అగ్రిమెంట్ చేసుకోవడం సకాలంలో వాటిని అమలు చేయకపోవడం కార్మికులను అవమానాలకు బాధలకు గురి చేస్తూనే ఉన్నది.

1985 నుండి మొదలు 2025 వరకు పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల స్థానంలో ఎలాంటి మార్పు రాలేదు. కానీ కాళీ నడకన పాత సైకిళ్లతో వచ్చిన కాంట్రాక్టులు అందరూ ఈరోజు కోట్లకు పడగలెత్తినారు, నాడు నేడు కార్మికుని యొక్క దీన పరిస్థితి అదే విధంగా ఉన్నది. నాటి నుండి నేటి వరకు ఎంతోమంది కార్మికుల జీవితాలు ఈ ప్లాంట్ కోసం వాళ్ళ అమూల్యమైన ప్రాణాలు దార పోసినారు. ఈ ప్లాంట్లో పనిచేస్తున్న కార్మిక సంఘాలు గతంలో కొంతో గొప్ప కార్మికుల కోసం పని చేసినారు. 2019 నుండి నేటి వరకు సంఘాలలో చాలా మార్పులు కనిపిస్తున్నాయి. మేనేజ్మెంట్‌కు అనుకూలంగా మారడం. కార్మికుల హక్కులను కాల రాస్తున్న యజమాన్యం పట్ల పూర్తిస్థాయిలో స్పందించకపోవడం ఎన్నో అనుమానాలకు దారితీస్తున్నాయి. కార్మిక సంఘాలు వాళ్ల స్వార్థ రాజకీయాల ప్రజల ప్రయోజనాల కోసం కార్మికులను అడ్డుపెట్టుకొని వాళ్ల యొక్క స్వంత పనులు చేసుకుంటున్నారు. అంతేకాక ఈ ప్రాంతంలోని ఏ రాజకీయ పార్టీ నాయకుని ఎమ్మెల్యే, ఎంపీగా గెలిపించిన నాటు నుండి నేటి వరకు ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయినది.కాంట్రాక్టు కార్మికుల కనీస వేతనాలు పెంచకుండా దాదాపు 12 సంవత్సరాలు గడుస్తున్నాయి.

ప్రభుత్వాలు ఎన్ని మారినా మారని కాంట్రాక్టు కార్మికుల జీవితాలు అట్లాగే ఉన్నాయి.చట్టాలు ఎన్ని వచ్చిన ఉన్నోని చుట్టాలుగా మారినాయి. కాంట్రాక్టు కార్మికుల కోసం ఉన్న చట్టాలన్నీ కార్పొరేట్ల సంస్థలకు దాహంగా మారుతున్నాయి. రాష్ట్రంలో దేశంలో అత్యధికంగా మోసాలకు గురి అవుతున్న వాళ్లు కాంట్రాక్టు కార్మికులే. నాడు పర్మెంటు ఉద్యోగం కోసం ఎంప్లాయిమెంట్ ఆఫీసు చుట్టూ తిరిగి నాలుగు ఐదు లక్షలు ఖర్చుపెడితే ఉద్యోగం వచ్చేది. నేడు అదే కాంట్రాక్టు ఉద్యోగం కోసం ఈ రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో 5 నుండి 10 లక్షలు తీసుకొని ఉద్యోగాలు ఇస్తున్నారు. రామగుండం ఫెర్టిలైజర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఆర్ ఎఫ్ సి ఎల్) ఈ దేశంలో నిరుద్యోగం ఎంత తీవ్రంగా ఉన్నది అర్థం అవుతు న్నది. రాజకీయ నాయకుల స్వార్థ ప్రయోజనాల కోసం ఓటు బ్యాంకు కోసం ప్రజలకు అనేక వాగ్దానాలు చేసి వాళ్లు గెలిచిన తర్వాత ప్రజలను ప్రజా సమస్యలను రాజకీయ లభ్యం కోసం వాడు కుంటున్నారు.ఇలాంటి పరిస్థితుల్లో కార్మికులకు న్యాయ నాయకత్వం వహిస్తున్న సంఘాలు కూడా రాజకీయ నాయకు లను మించిన విధంగా మోసాలకు తెగబడినారు.

రోజురోజు పనులు దొరకక ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక కొందరు చెడు వ్యసనాలకు మధ్యానికి బానిసలుగా మారి కుటుంబాలకు దూరమవుతు మానసికంగా కుంగి పోతు మరణిస్తున్న సంఘటనలకు, నాయకులు, ప్రభుత్వాలే ఈ దోపిడీ, మోసం వ్యవస్థ మారనంత కాలం మనిషి జీవితానికి మనుగడలేదన్నది నగ్న సత్యం.



బాలసాని రాజయ్య
ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ పెద్దపల్లి
9441970025

## దశాబ్ద కాలంగా భారత్‌లో కార్మికుల స్థితిగతులపై విశ్లేషణ

'మేడే' సందర్భంగా ప్రపంచమంతా కార్మికుల హక్కులు, గౌరవం కోసం పోరాటం గుర్తుచేసుకుంటున్న రోజుల్లో, భారతదేశపు పారిశ్రామిక, వ్యవసాయ కార్మికుల పరిస్థితులు మాత్రం రోజు రోజుకూ మరింత దిగజారుతున్నాయి. గత దశాబ్దంలో ఆర్థిక వృద్ధి, విధాన సంస్కరణలు జరిగినప్పటికీ, కోట్లాది కార్మికుల జీవితాల్లో మార్పు రాలేదు. బదులుగా, నిరుద్యోగం, అనధికారిక ఉద్యోగాల వృద్ధి, వ్యవసాయ సంక్షోభం వల్ల అసమానతలు విపరీతంగా పెరిగాయి. ప్రభుత్వ నిర్లక్ష్యం, ఆర్థిక సవాళ్లు కార్మికులను మరింత అసహాయ స్థితిలోకి నెట్టివేశాయి.



**పారిశ్రామిక కార్మికులు-అస్థిర ఉద్యోగాలు, హక్కుల కోల్పోవడం :**

ఉపాధిని ఇచ్చే ప్రధాన వనరుగా భావించబడే పారిశ్రామిక రంగం కూడా ఇప్పుడు సురక్షితమైన జీవనోపాధిని అందించడంలో విఫలమైంది. 2022-23లో జరిగిన 'పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే' (పీఎల్ఎఫ్ఎస్) ప్రకారం, దేశంలో 90 శాతం కార్మికులు అనధికారిక రంగంలో పనిచేస్తున్నారు. వీరికి ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత లేదు. ఇంకా, అనేక కంపెనీలు శాశ్వత ఉద్యోగాలకు బదులు కాంట్రాక్ట్ కార్మికులను నియమించి, కార్మిక చట్టాలలోని రక్షణలు, హక్కులు వారికి దక్కకుండా అణచి వేస్తూన్నాయి. 2020లో ప్రవేశపెట్టిన కొత్త లేబర్ సంబంధిత చట్టాలు కార్మికుల రక్షణను మరింత బలహీన పరిచాయి. 44 శ్రమ చట్టాలను నాలుగు కోడ్లలో కలిపినందున, ఉద్యోగ దాతలకు కార్మికులను సులభంగా పని నుండి తొలగించడానికి అవకాశం కల్పించారు. ఇది యూనియన్ల ఐక్యతా శక్తిని తగ్గించింది. 2020లో విశాఖపట్నంలోని "ఎల్జి పాలిమర్స్" వద్ద జరిగిన గ్యాస్ లీక్ ప్రమాదంలో 12 మంది కార్మికులు మరణించారు. ఇది కర్మాగారాలలో భద్రతా ప్రమాణాలు ఎంత తక్కువగా పాటించ బడుతున్నాయో బహిర్గతం చేసింది. ప్రభుత్వ డేటా ప్రకారం, 2017 నుండి 2021 మధ్య కర్మాగార ప్రమాదాల్లో 1,100 కంటే ఎక్కువ మంది మరణించారు.

కార్మికుల వేతనాలు కూడా చాలా నెమ్మదిగా పెరిగాయి. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) 2023లో వెల్లడించిన నివేదిక ప్రకారం, 2015 నుండి 2022 మధ్య భారతదేశంలో నిజమైన వేతనాలు సంవత్సరానికి కేవలం 1.5 శాతం మాత్రమే పెరిగాయి. ఇది ఉత్పాదకత పెరుగుదల కంటే చాలా తక్కువ. ద్రవ్యోల్బణం కారణంగా కొనుగోలు శక్తి తగ్గింది. కోవిడ్-19 సమయంలో లాక్డౌన్ ప్రకటించిన తర్వాత, లక్షలాది మంది వలస కార్మికులు ఉద్యోగాలు కోల్పోయి, నిరాశ్రయులై తమ గ్రామాలకు వెళ్లడానికి కాలినడకన నానా కష్టాలు పడ్డారు. కేంద్ర ప్రభుత్వం చెవులు ముడుచుకొని చోద్యం చూసింది.

**వ్యవసాయ కార్మికుల్లో నిరంతర సంక్షోభం, విధాన పరమైన నిర్లక్ష్యం :**

భారతదేశంలో 45 శాతం కార్మికులు వ్యవసాయ రంగంపై ఆధారపడి ఉన్నారు. కానీ ఈ రంగం నిరంతర సంక్షోభంలో మునిగిపోయింది. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్.సీ.ఆర్.బీ) డేటా ప్రకారం, 2014 నుండి ప్రతి సంవత్సరం 10,000 కంటే ఎక్కువ రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని ఎన్నికల వాగ్దానాలు చేసినప్పటికీ, గ్రామీణ వేతనాలు స్థిరంగా ఉన్నాయి. రైతులకు ముఖ్యమైన 'మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం' (ఎం.జీ.ఎన్.ఆర్.ఇ.జీ.ఏ)కు నిధులు గణనీయంగా తగ్గించారు.వేతనాలు ఆలస్యంగా చెల్లించడం, పని రోజులు తగ్గించడం వంటి సమస్యలు అనేకం ఉన్నాయి. 2020-21లో మూడు ప్రాణాంతక వ్యవసాయ చట్టాలు కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తే వాటికి వ్యతిరేకంగా రైతులు సుధీర్ఘ కాలం ఉద్యమించి ప్రపంచ రికార్డును సాధించారు. అతి కష్టమ్మీద కేంద్రం పార్లమెంటులో రైతులకు క్షమాపణలు చెప్పి, ఈ చట్టాలను రద్దు చేసింది. కానీ, చిత్తశుద్ధితో చేసింది కాదు. ప్రధాన సమస్యలు పరిష్కారం కాకుండా అలాగే ఉన్నాయి. తక్కువ ధరలు, పెరిగిన పెట్టుబడి ఖర్చులు, రైతుల రుణ భారం ఇంకా పరిష్కరించ లేదు. వాతావరణ మార్పులు కూడా రైతుల పరిస్థితిని మరింత దిగజార్చాయి. 2022లో వచ్చిన వేడి తరంగం వల్ల గోధుమ దిగుబడి 15 శాతం తగ్గింది.

భూమిలేని వ్యవసాయ కార్మికులు అత్యంత బీదలుగా మిగిలిపోయారు. కుల, మత, జాతి ఆధారిత వివక్షత కూడా వారి పరిస్థితిని మరింత ఘోరంగా మార్చింది. దళిత, ఆదివాసీ కార్మికులకు తక్కువ వేతనాలు ఇవ్వడం, బంధన కూలీ వ్యవస్థ వంటి అన్యాయాలు కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ కార్మిక సంస్థ చట్టాల ప్రకారం, 65 శాతం వ్యవసాయ కార్మికులు కనీస వేతనం కంటే తక్కువ సంపాదిస్తున్నారు.

**ప్రభుత్వ వైఫల్యాలు.పరిష్కార మార్గం:**

గత దశాబ్దంలో, ఆర్థిక వృద్ధి పేరుతో కార్మికుల హక్కులను బలహీన పరిచే వ్యూహం కనిపిస్తోంది. కార్పొరేట్ స్నేహపూర్వక విధానాలు కార్మికుల శ్రేయస్సును త్యాగం చేస్తున్నాయి. 'ఎంప్లాయీస్ స్టేట్ ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్' (ఇ.ఎస్.ఐ.సీ), 'ప్రధానమంత్రి శ్రమ యోగిమాన్ ధాన్' (పీ.ఎం.ఎస్.వై.ఎం.) వంటి సామాజిక భద్రతా పథకాలు చాలా మంది అనధికారిక కార్మికులకు చేరుకోవడంలో విఫలమయ్యాయి.

'మే' డే యొక్క నిజమైన ఆత్మను గౌరవించాలంటే, భారతదేశం కార్మికుల హక్కులపై దృష్టి పెట్టాలి. 'మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని' బలోపేతం చేయాలి. వేతనాలను సకాలంలో చెల్లించడం, కార్మికుల భద్రతా చట్టాలను కఠినంగా అమలు చేయడం అత్యవసరం. అనధికారిక రంగాన్ని శ్రమ రక్షణలోకి సమగ్రపరచాలి. వ్యవసాయ రంగంలో, న్యాయమైన ధరలు, బలమైన పంట భీమా, వాతావరణ సవాళ్లను ఎదుర్కొగల పద్ధతులు అవసరం.కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన "నాలుగు నూతన కార్మిక కోట్ల"ను రద్దు చేయాలి. కార్మికులు భారతదేశ ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభాలు. కానీ వారు అత్యంత నిర్లక్ష్యానికి గురైన వర్గం. తక్షణమే సంస్కరణలు చేపట్టకపోతే, ఆర్థిక వృద్ధి, కార్మికుల శ్రేయస్సు మధ్య వ్యత్యాసం మరింత పెరుగుతుంది. ఈ" మే డే", వారి పోరాటాలకు కేవలం సాంకేతిక గౌరవాలు కాకుండా, న్యాయం చేయటం అవసరం.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

# అక్రమ గంజాయి రవాణాపై పోలీసులు ఉక్కుపాదం

**జహీరాబాద్, ఏప్రిల్ 30 (జనం సాక్షి) :** జిల్లాలో గంజాయి అక్రమ రవాణాపై సంగారెడ్డి జిల్లా పోలీసులు ఉక్కుపాదం మోపారు. సిసియస్, జహీరాబాద్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో సుమారు రూ.20 లక్షల విలువ గల 80 కిలోల ఎండు గంజాయి పట్టుబడింది. ఈ మేరకు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ సోమవారం వివరాలు వెల్లడించారు. పక్క సమాచారం మేరకు, సోమవారం సాయంత్రం 6 గంటల సమయంలో సిసియస్ టీమ్, చిరాగ్‌పల్లి ఎస్ఐ కె. రాజేందర్ రెడ్డి నేతృత్వంలోని బృందం మాడ్గి టి-రోడ్డు వద్ద జాతీయ రహదారి-65 పక్కన వాహనాలను తనిఖీ చేసారు. ఈ క్రమంలో హైదరాబాద్ వైపు నుంచి కర్ణాటక దిశగా అనుమానాస్పదంగా వస్తున్న టాటా ఇండిగో సియస్ కారును ఏపీ 28 డిఈ 3257 ఆపి తనిఖీ చేయగా, డిక్కీలో గోదుమరంగు కవర్లలో 40 ఎండు గంజాయి ప్యాకెట్లు బయటపడ్డాయి.

### డ్రైవర్ అరెస్టు..

కారు డ్రైవర్ జి. తిరుమలేష్ (25), గోవింద్‌పూర్ గ్రామానికి చెందినవాడిగా గుర్తించారు. అతడు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తుండగా, బీదర్‌కు చెందిన బంధువైన గుండప్ప సూచనపై రూ.50 వేల ఆశతో ఈ గంజాయి సరఫరాకు ఒప్పుకున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడయ్యింది. బాగ్దాల్‌లోని వినోద్‌కు గంజాయి ఇవ్వడానికి వెళ్తుండగా, చిరాగ్‌పల్లి శివారులో సహారా ధాబా వద్ద తనిఖీల్లో పట్టుబడ్డాడు.తరువాత గంజాయి



ప్యాకెట్లను తూకం వేసినపుడు మొత్తం 79.75 కిలోలుగా నమోదైంది. దీని విలువ సుమారు రూ.20 లక్షలుగా ఉంటుందని ఎస్పీ తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి, అతని వద్ద నుండి 40 ఎండు గంజాయి ప్యాకెట్లు, వినియోగించిన కారు, సెల్‌ఫోన్ సీజ్ చేశారు.

### సమాచారం ఇవ్వండి..

మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగంపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నట్టు ఎస్పీ స్పష్టం చేశారు. ఎవరైనా గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాల సరఫరా చేస్తున్నట్లు సమాచారం ఉంటే, జిల్లా యస్-న్యాబ్ నంబర్ 8712656777కు తెలియజేయాలని, సమాచారదాత వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ ఆపరేషన్‌లో కీలకంగా వ్యవహరించిన అధికారులకు, సిబ్బందికి ఎస్పీ అభినందనలు తెలిపారు.

# దాసరపల్లిలో బాల్య వివాహానికి అడ్డుకట్ట

- సకాలంలో స్పందించిన అధికారులు

**మక్తల్, ఏప్రిల్ 30 (జనంసాక్షి) :** నారాయణపేట జిల్లాలో బాల్య వివాహాల నిరోధానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో మక్తల్ మండలం దాసరపల్లి గ్రామ సమీపంలో బుధవారం ఉదయం ఒక బాల్య వివాహం జరుగుతోందని చైల్డ్ హెల్ప్ లైన్ 1098కు విశ్వసనీయ సమాచారం అందడంతో వెంటనే నారాయణపేట జిల్లా డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ (డిసిపియు) అధికారులు అప్రమత్తమయ్యారు. చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బందితో పాటు, స్థానిక ఐసిడిఎస్ సూపర్వైజర్, పోలీస్ సిబ్బందితో కలిసి దాసర్ పల్లి గ్రామ సమీపంలో ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయానికి చేరుకున్నారు. అక్కడ వివాహానికి సిద్ధమవుతున్న బాలిక, బాలుడి కుటుంబ సభ్యులతో అధికారులు మాట్లాడారు. బాల్య వివాహం చేయడం చట్టరీత్యా నేరమని, దీని వల్ల కలిగే అనర్థాల గురించి వారికి వివరించారు. బాల్య వివాహ నిషేధ చట్టంలోని నిబంధనలను వారికి స్పష్టంగా తెలియజేశారు. అనంతరం అధికారులు మైనర్ బాలికను రక్షించి నారాయణపేటలోని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సిడబ్ల్యుసి) ముందు హాజరుపరిచారు. సిడబ్ల్యుసి సభ్యులు బాలిక పరిస్థితిని పరిశీలించి ఆమెకు తగిన పునరావాసం కల్పించాలని ఆదేశించారు. వారి ఆదేశాల మేరకు బాలికను నారాయణపేటలోని బాలసదనంలో సురక్షితంగా ఉంచారు. ఈ సందర్భంగా డిసిపియు అధికారులు మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడైనా



బాల్య వివాహాలు జరుగుతున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1098 కి ఫోన్ చేసి తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బాల్య వివాహాలను అరికట్టడంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని వారు కోరారు. ఈ రెస్క్యూ ఆపరేషన్‌లో డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ కౌన్సిలర్ విజయ్ కుమార్ కీలక పాత్ర పోషించారు. అలాగే చైల్డ్ హెల్ప్ లైన్ కౌన్సిలర్ విద్య, ఐసిడిఎస్ సూపర్వైజర్ అమ్మక్క, పోలీస్ సిబ్బంది మహేష్ తమవంతు సహకారం అందించారు.

## హైకోర్టు జడ్జిని కలిసిన పేట బార్ సభ్యులు



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఏప్రిల్ 30 (జనం సాక్షి) :** హై కోర్టు పోర్ట్ జడ్జి మధుసూదన్ రావును బుధవారం నారాయణపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్ గౌడ్,ఉపాధ్యక్షుడు నందు నామాజీ,ప్రధాన కార్యదర్శి చెన్నారెడ్డి,జాయింట్ సెక్రటరీ అమిరొద్దిన్ కలిసి వేసవి విందుకు ఆహ్వానించారు. అలాగే నారాయణపేట కోర్టులో ఎస్సీ,ఎస్టీ,వినియోగదారుల, ఇడిజే కోర్టులు రావాల్సి ఉందని వాటిని ఏర్పాటు చేయాలని కోరారు.అందుకు మధుసూదన్ రావు సానుకూలంగా స్పందించారని తెలిపారు.

# జిల్లాలో నెల రోజులు 30, 30(ఎ) పోలీసు యాక్ట్


- జిల్లా యస్.పి. శ్రీ పరితోష్ పంకజ్



**సంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 30 (జనం సాక్షి) :** జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని నెల రోజుల పాటు (మే 1వ తేది నుండి 31 వరకు) జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీసు యాక్ట్-1861 అమలులో ఉంటుందని జిల్లా యస్.పి. పరితోష్ పంకజ్ ఐపియస్. గారు ఒక ప్రకటనలో తెలియజేశారు. కావున పోలీసుల ముందస్తు అనుమతి లేనిది సంగారెడ్డి జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్స్, సభలు, సమావేశాలు నిర్వహించరాదని, శాంతి భద్రతలకు భంగం కలిగే విధంగా, ప్రజాధనానికి నష్టం కల్గించే, ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టకూడదన్నారు. జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు ఇట్టి విషయంలో పోలీసు వారికి సహకరించవలసిందిగా సూచించారు. అనుమతి లేకుండా పై చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్టరిత్య కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

- వంగ రాజేశ్వర్ రెడ్డి, యువ పారిశ్రామికవేత్త



**నంగునూరు, ఏప్రిల్ 30 (జనం సాక్షి) :** ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ప్రముఖ యువ పారిశ్రామిక వేత్త వంగ రాజేశ్వర రెడ్డి అన్నారు.నంగునూరు మండలం జేపీ తండా గ్రామంలో శ్రీ దుర్గాదేవి, శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయ మొదటి వార్షికోత్సవం, నవగ్రహ విగ్రహాల యంత్ర ప్రతిష్టాపన మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ యువ పారిశ్రామికవేత్త వంగ రాజేశ్వర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ భూక్య బిక్షపతి నాయక్, బీఆర్ఎస్ నాయకులు భూక్యా లక్ష్మణ్, గౌరబోయిన రాజు, మలోత్ రమేశ్, మల్లం రమేశ్, లావుడ్య రవి, మలోతు జానీ, శంకర్, చంద్రభాను,స్వామి తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

- ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

**మక్తల్, ఏప్రిల్ 30 (జనంసాక్షి) :** బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. బుధవారం మక్తల్ బస్టాండ్ ప్రాంగణంలో ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో బాల్యవివాహాలను అరికట్టేందుకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నేను ప్రజాప్రతినిధిని అయినప్పటికీ బాల్యవివాహాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సహించను అన్నారు. పిల్లలకు పెళ్లిళ్లు చేస్తూ, చట్టాన్ని అతిక్రమించే వారికి నేను అండగా ఉండను. అధికారుల పని అధికారులే చేసుకోవాలి అని స్పష్టంగా చెప్పారు. లీగల్ అడ్వకేట్ కవిత మాట్లాడుతూ చిన్న వయస్సులో పెళ్లిళు చేయడం వల్ల బాలికలు తమ బాల్యాన్ని కోల్పోయి శారీరకంగా, మానసికంగా హింసకు గురవుతారని అన్నారు. చైల్డ్ మ్యారేజ్ ప్రొహిబిషన్ యాక్ట్ %-% 2006 ప్రకారం 18 సంవత్సరాలకు లోపు అమ్మాయిని, 21 సంవత్సరాలకు లోపు అబ్బాయిని వివాహం చేయడం చట్టవిరుద్ధం అన్నారు. ఈ యాక్ట్ లోపల సెక్షన్స్ 9, 10, 11 ప్రకారం



వివాహం చేసేవారే కాకుండా, పెద్దలు, తల్లిదండ్రులు, పూజారులు, సంబంధిత వ్యక్తులు అందరూ శిక్షార్హులవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ సరోజినీ, డిప్యూటీ ఎమ్మార్వో , చైల్డ్ లైన్ ప్రతినిధులు విద్యారాణి, విజయ్ కుమార్, కాంగ్రెస్ నాయకులు చంద్రకాంత్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు రవికుమార్, అశోక్ గౌడ్, ఎస్సై టు ఆచారి, డిపో మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

# మేడే స్ఫూర్తితో ఉద్యమాలు

**పటాన్‌చెరు, ఏప్రిల్ 30 (జనం సాక్షి) :** మేడే స్ఫూర్తితో భవిష్యత్తులో కార్మికులందరూ ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు కరిక రాజయ్య పిలుపునిచ్చారు. బుధవారం నాడు పటాన్చెరులోని స్థానిక శ్రామిక భవన్లో నీహఫ్ కార్మికుల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడే స్ఫూర్తితో భవిష్యత్తులో కార్మికులందరూ పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. పోరాడకపోతే కార్మికుల హక్కులు ఉండవని, చట్టాలు కూడా ఉండవని ఆయన అన్నారు, హక్కుల కోసం, చట్టాల రక్షణ కోసం ఐక్య ఉద్యమాలకు కార్మికులందరు సిద్ధపడాలని, భవిష్యత్తులో ఐక్య ఉద్యమాలు చేయాలని ఆయన కోరారు. కార్మికులందరూ ఐక్య ఉద్యమం చేస్తేనే పాలకులు దిగి వస్తారని అన్నారు, కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానలను అమ్మలు చేస్తుందని, పచ్చి కార్మిక వ్యతిరేకని ఆయన అన్నారు, లేబర్ కోడులు తేవడం ద్వారా పెట్టుబడుదరులకు మేలు చేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. లేబర్ కోడిలు వస్తే కార్మికులకు భవిష్యత్తు ఉండదని ఆయన అన్నారు, ఎనిమిది గంటల పని దినం కోసం, కార్మికుల హక్కుల కోసం




చికాగో నగరంలో పోరాటం జరిగిందని, రక్తం చెందిందని ఆయన అన్నారు, ఆరోజు పాలకులు పోరాడే వాళ్లపైన కాల్పులు జరిపారని ఆ కాల్పులులో అనేక మంది చనిపోయారని, అక్కడినుండి ఎర్రజెండ పుట్టిందని ఆయన అన్నారు. కార్మికులు పోరాడకపోతే కట్టు బానిసల్లాగా తయారయ్యే పరిస్థితులు వస్తున్నాయని ఆయన అన్నారు, కార్మికులంతా పోరాటాలకు సిద్ధంగా ఉండాలని, పోరాడితేనే భవిష్యత్తు అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు మూర్తి, సురేష్, మదన్ రెడ్డి,రాజు, తదితరులు పాల్గొన్నారు.

# నీలకంఠం సేవలు అభినందనీయం

- విద్యా శాఖకి వన్నెతెచ్చిన ఎంఈఓ
- జిల్లా అదనపు కలెక్టర్ నగేష్

**మెదక్ జిల్లా బ్యూరో, ఏప్రిల్ 30 (జనం సాక్షి) :** విద్యా శాఖకు వన్నెతెచ్చిన ఎంఈఓ నీలకంఠం... నీలకంఠం సేవలు అభినందనీయం అని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. మెదక్ కలెక్టరేట్ కార్యాలయంలో బుధవారం మెదక్ మండల విద్యాశాఖ అధికారిగా పనిచేసి పదవీ విరమణ పొందుతున్న ఎంఈఓ నీలకంఠం ను అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా విద్యాశాఖ అధికారి రాధా కిషన్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి ఇతర సిబ్బంది సన్మానించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 37సంవత్సరాల 5 నెలలు పాటు విద్యాశాఖలో వివిధ హెూదాలలో పనిచేసి వృత్తికి వన్నె తెచ్చిన వ్యక్తి నీలకంఠం అన్నారు మండల విద్యాధికారిగా పనిచేస్తూ జిల్లా కేంద్రంలోఏర్పాటు చేసిన ప్రభుత్వ కార్యక్రమాలలో ఏ బాధ్యత అప్పజెప్పిన సమర్థవంతంగా విధులు నిర్వహించిన వ్యక్తి నీలకంఠం అన్నారు మెదక్ మండలం తో పాటు జిల్లాలోని 9 మండలాలకు



మండల విద్యాధికారిగా సమర్థవంతంగా విధులు నిర్వహించారన్నారు , అంతకుముందు మండల వనరుల కేంద్రంలో జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు సభ్యులు నీలకంఠను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ నవీన్, విద్యాశాఖ కార్యాలయ సూపరిండెంట్ లక్ష్మీకాంత రాజ్, అసిస్టెంట్ సెక్రటరీ సదన్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# బసవేశ్వరుడితోనే సమాజంలో మార్పు

- అదనపు కలెక్టర్ నగేష్

**మెదక్ జిల్లా బ్యూరో, ఏప్రిల్ 30 (జనం సాక్షి) :** బసవేశ్వరుడితోనే సమాజంలో మార్పు వచ్చిందనిజిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అడిషనల్ కలెక్టర్ నగేష్, ముఖ్య అతిథిగా పాల్గొని బసవేశ్వరుడి చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. బసవేశ్వర జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక మార్పులకు శ్రీకారం చుట్టిన గొప్ప సంస్కర్త మహాత్మా బసవేశ్వరుడని పేర్కొన్నారు. ఆయన బోధించిన అభ్యుదయవాద సంప్రదాయమే నేడు లింగాయత్ ధర్మంగా మారిందన్నారు. 12వ శతాబ్దంలోనే మహిళలకు సముచిన స్థానం కల్పించారని చెప్పారు.బసవేశ్వరుని సేవలను కొనియాడారు సమాజ స్థాపన కోసం కృషి చేసిన గొప్ప వ్యక్తి బసవేశ్వరుని మరి ఆయన చూపిన మార్గంలో మనమందరం నడవాలని కోరారు. మహాత్మ బసవేశ్వరుని జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం



అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో లింగాయత్ సమాజం ప్రధాన కార్యదర్శి వీరేశం, గౌరవాధ్యక్షులు ఆనందం ,కోశాధికారి ప్రభు, సలహాదారు సిద్దన్న, సంగమేశ్వర్, జంగమ సమాజం గౌరవ అధ్యక్షులు బసవలింగం కోశాధికారి పరమేశ్వర్ ,పట్టణ అధ్యక్షులు భీమప్ప ,సలహాదారులు బసవరాజ్, మహలింగం, మహేష్ సతీష్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## కుల, వర్ణ, లింగ వివక్షతను వ్యతిరేకించిన గొప్ప అభ్యుదయవాది బసవేశ్వరుడు

- జిల్లా కలెక్టర్ సంతోష్



**గద్వాల నడిగడ్డ, ఏప్రిల్ 30 (జనం సాక్షి) :** సమాజంలో కుల,వర్ణ, లింగ వివక్షతను వ్యతిరేకించిన గొప్ప అభ్యుదయవాది మహాత్మా బసవేశ్వరుడని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ తెలిపారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయం ఆవరణంలో బీసీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బసవేశ్వర జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని, బసవేశ్వర చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహాత్మా బసవేశ్వరుడు కుల, వర్ణ, లింగ భేదాలు లేని సమసమాజ నిర్మాణం కోసం గళం విప్పి సమానత్వాన్ని ప్రబోధించి సమాజంలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికారని పేర్కొన్నారు. మహిళలకు గౌరవస్థానం ఇవ్వడం, సాధికారత కల్పించడంలో ఆయన చేసిన కృషి స్ఫూర్తిదాయకమని అన్నారు. శ్రమకు గౌరవం, నీతి, నిష్ఠా,సత్యాన్ని బసవేశ్వరుడు తన జీవిత విధానంగా మార్చుకున్నారని అన్నారు. ప్రతి ఒక్కరూ బసవేశ్వరుని ఆదర్శాలను అనుసరించి, సమాజంలో మంచి మార్పుకు భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఆయన వచనాలు నేటి యువతకు మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీ నారాయణ,ఆర్డీవో శ్రీనివాసరావు,బిసి సంక్షేమ అధికారి రమేష్ బాబు, ఏఓ నరేందర్, అధికారులు, సంఘం సభ్యులు, కలెక్టరేట్ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో మహాత్మ బసవేశ్వర విగ్రహ ఆవిష్కరణ

- హాజరైన శివయోగి శివాచార్య మహాస్వామి



**సంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 30 (జనం సాక్షి) :** సదాశివ పట్టణంలోని కశెట్టి వెంచర్స్ సిద్ధాపూర్ లో బుధవారం మహాత్మ బసవేశ్వర జయంతి పురస్కరించుకొని లింగైక్య క శెట్టి విశ్వనాథం దంపతుల జ్ఞాపకార్థం నూతన విగ్రహ ఆవిష్కరణ మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సదాశివపేట మండలంలోని తంగడపల్లి కోటి బిల్వ లింగేశ్వర మఠం శివయోగి శివాచార్య మహా స్వామి హాజరైనారు. ఈ సందర్భంగా మహాస్వామి మాట్లాడుతూ సమ సమాజం కోసం పాటుపడిన మహనీయుడు బసవేశ్వరుడని కొనియాడారు. ప్రతి ఒక్కరూ బసవేశ్వరుని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కశెట్టి లలిత రమేష్, రంజిత రాజు, డాక్టర్ శ్రావణి సృజన్ , అధిరా సాయి అనురాగ్, కశెట్టి స్వరూప సంగమేశ్వర్, శశికళ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం



**అల్లాదుర్గం, ఏప్రిల్ 30 (జనంసాక్షి) :** ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం లాంటిదని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొప్పుల శేశారేడ్డి అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద మండలంలోని వివిధ గ్రామాల లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను వారికి అందజేశారు కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సుభాష్ రావు,మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బాలకిషన్, యువజన కాంగ్రెస్ నాయకులు మహేష్,కిసాన్ సెల్ నాయకులు బేతయ్య, మాజీ సర్పంచ్ రంజిత్,కొంక శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
01 మే 2025

# కార్మికులకు తోడుగా జనంసాక్షి..

- కార్మిక రథచక్రాలకు దిక్కెవరు..
- తరచుగా పరిశ్రమల్లో ప్రమాదాలు
- తెగిపడ్డ వలస కార్మికుల శరీర భాగాలు
- రంగారెడ్డి జిల్లాలో సంచలనం సృష్టించిన జనంసాక్షి కథనాలు..
- కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం
- కార్మికుల రక్షణ కొరకై ఉన్న 40 చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్ లకే పరిమితం చేశారు
- కేంద్ర ప్రభుత్వ తీరుపై కార్మిక సంఘాల నాయకుల ఆగ్రహం..
- మేడే స్ఫూర్తితో కార్మికుల హక్కులకై ఉధృతమైన పోరాటాలు..

పొట్టచేత పట్టుకొని ఇతర రాష్ట్రాల నుండి కూలి పనులకు వచ్చిన వలస కార్మికులు పరిశ్రమల్లో పని చేస్తూ ప్రమాదాలకు గురై అనంత లోకాలకు వెళ్లిపోతుంటారు. వారి శరీర భాగాలు సైతం గుర్తుపట్టలేనంత దీనస్థితిలో భయాందోళనకరణ వాతావరణం నెలకొని ప్రమాద ఘంటికలు రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ లోని బూర్గుల శివారులోని సౌత్ గ్లాస్ పరిశ్రమలో గత ఆరు నెలల క్రితం ఈఘోర ప్రమాదం చోటుచేసుకుని ఐదుగురు మృతి చెందగా అడుగడుగున మాంసపు ముద్దలే రక్తసిక్తమైన దృశ్యాలు దర్శనమిచ్చాయి. ఒళ్ళు జలదరించే బయానక దృశ్యాల అక్కడ కనిపించాయి శరీర భాగాలు చెల్లా చేదురుగా గుర్తుపట్టలేని స్థితిలో కనిపించాయి. ఈ వాస్తవాలను జనంసాక్షి ప్రచురించి సంచలనాలను సృష్టించింది. అయినా కార్మికులకు మాత్రం అంతంతమాత్రంగానే న్యాయం చేశారనే విమర్శలు వినిపించాయి.

**రంగారెడ్డి / షాద్‌నగర్, ఏప్రిల్ 30 (జనంసాక్షి)**
ఇలా రంగారెడ్డి జిల్లాలోని కాటేదాన్ రాజేంద్రనగర్ షాద్‌నగర్ కొత్తూరు ఫరూక్‌నగర్ కొందుర్గు కేశంపేట నందిగామ ప్రాంతాలలో ఇతర రాష్ట్రాల కార్మికులతో నిబంధనలను తుంగలో తొక్కివెట్టి చాకిరి చేయించుకుంటాయి. పరిశ్రమ యాజమాన్యాలు అయినా సంబంధిత అధికారులకు చీమకుట్టినట్టు కూడా ఉండదనే విమర్శలు పెద్ద ఎత్తున వినిపిస్తూ ఉంటాయి....



ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న కార్మికుల హక్కులను కేంద్రంలో ఉన్న నరేంద్రమోడీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తుందని కార్మిక సంఘాల నాయకులు కేంద్ర ప్రభుత్వం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న 40 చట్టాలను నాలుగు లేబర్ కోడ్ లుగా విభజించి కనీసం కార్మిక సంఘాలు పెట్టుకోకుండా హక్కులకై పోరాడకుండా చేస్తుందని కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని ఈ మేడే స్ఫూర్తితో కార్మికుల హక్కులకై బలమైన పోరాటాలు నిర్వహిస్తామని కార్మిక సంఘాల నాయకులు కేంద్ర ప్రభుత్వం తీరుపై మండిపడుతున్నారు. రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా కొన్ని వందల పరిశ్రమలు విచ్చలవిడిగా నెలకోన్నాయి. అందులో కొన్ని పరిశ్రమలకు అనుమతులు ఉంటే మరికొన్ని పరిశ్రమలకు అనుమతులు లేకుండానే కొనసాగుతుంటాయి ఇక్కడ కార్మిక చట్టాలు అనేటివి కార్మికులకు వర్తించవు రాత్రి పగలు తేడా లేకుండా కార్మికులతో పరిశ్రమ యాజమాన్యాలు వెట్టిచాకిరి చేయించుకుంటాయి ప్రమాదవశాత్తు కార్మికుడు చనిపోయిన గుట్టు చప్పుడు కాకుండా శవాన్ని తరలించేస్తారు. పరిశ్రమ యాజమాన్యాలు పొట్టచేత పట్టుకొని బ్రతుకుతెరువు కోసం ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన కార్మికులె ఎక్కువ సంఖ్యలో ఉంటారు వారికి కార్మిక చట్టం ప్రకారం వేతనాలు చెల్లించారు. పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు కనీసం రక్షణ పరికరాలు లేకపోవడంతో పరిశ్రమల్లో పనిచేస్తూ ప్రాణాలు కోల్పోతుంటారు ఆయిన సంబంధిత అధికారులను మేనేజ్ చేస్తూ పరిశ్రమ యాజమాన్యాలు కార్మిక చట్టాలను తుంగలో తొక్కుతుంటాయని కార్మిక సంఘాల నాయకులు అధికారుల తీరుపై కూడా విమర్శలు గుప్పిస్తున్నారు. కార్మికులకు పీఎఫ్ ఈఎస్ఐ ఇన్సూరెన్స్ అనేవి లేకుండా చేస్తున్నారని కార్మికుడిని కేవలం రోజువారి కూలీగానే పరిశ్రమ యాజమాన్యాలు చూస్తున్నాయని కార్మిక సంఘాల నాయకులు మండిపడుతున్నారు. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నీరుగార్చి 86 వేల కోట్ల రూపాయలను కేటాయించి కేటాయించిన నిధులను కూడా డైవర్ట్ చేస్తూ ఉపాధి కూలీలకు నోట్లో మట్టి కొడుతుందని కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం వ్యవహార శైలిపై కార్మిక సంఘాల నాయకులు మడిపడుతున్నారు నేటికీ కూడా సమాన






పనికి సమాన వేతన కార్మికులకు అందడం లేదని కేంద్ర ప్రభుత్వ విధానాలపై విమర్శలు గుప్పిస్తున్నారు కార్మిక సంఘాల నాయకులు.

### కార్మికుల హక్కులకై బలమైన ఉద్యమాలు నిర్వహిస్తాం



కార్మిక హక్కులను కాల రాస్తున్న కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వంపై మేడే స్ఫూర్తితో పెద్ద ఎత్తున కార్మికుల పక్షాన కార్మికులకు అండగా ఉంటూ బలమైన పోరాటాలు నిర్వహిస్తాం..

**ఈశ్వర్ నాయక్, సిఐటీయూ నాయకులు...**

### పేద ప్రజలకు అండగా ఉంటాం..



ఎన్నో పోరాటాల తర్వాత వచ్చిన ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేస్తుందని మేడే స్ఫూర్తితో పేద ప్రజలకు అండగా బలమైన ఉద్యమాలు నిర్వహిస్తాం...

**బుద్దుల జంగయ్య, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి..**

## మావోయిస్టులతో శాంతి చర్చలు జరపండి

- జస్టిస్ చంద్రకుమార్




**ఓయూ, ఏప్రిల్ 30 (జనం సాక్షి) :** ఆపరేషన్ కగార్‌ను ఆపి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని పీస్ కమిటీ ఛైర్మన్ జస్టిస్ చంద్రకుమార్ డిమాండ్ చేశారు. ఆర్ట్స్ కాలేజీ వద్ద నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాంతి చర్చలు జరపకుండా ఆదివాసీల పై దమనకాండకు పాల్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసుల సంక్షేమం దృష్ట్యా ఇరుపక్షాలు శాంతిని పాటించాలని ఉపాధ్యక్షుడు జంపన్న సూచించారు.

## యువత అన్ని రంగాల్లో రాణించాలి

- శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



**వికారాబాద్, ఏప్రిల్ 30 (జనం సాక్షి) :** సమాజంలో యువకులు అన్ని వ్యాపార రంగాల్లో రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉందని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పేర్కొన్నారు బుధవారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని ఎన్నేపల్లి చౌరస్తా దగ్గర హెచ్ పి పెట్రోల్ పంపు ను ఆయన ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో యువత తెలుగు వ్యసనాలకు అలవాటు పడకుండా స్వయం శక్తితో ఏదో ఒక వ్యాపారం చేసుకుంటూ జీవించాలని ఆయన అన్నారు యువత అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని నవ భారత నిర్మాణానికి యువకులే ముందంజలో ఉండాలన్నారు ఈ కార్యక్రమంలో హెచ్ పి రీజినల్ మేనేజర్ సెల్ ఆఫీసర్ కునాల్ పెట్రోల్ పంపు అధినేత శరత్ కుమార్ డిసిసిబి డైరెక్టర్ కిషన్ నాయక్ బికృష్ణయ్య పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ కార్యాలయం ఎదుట నర్సింగ్ విద్యార్థుల నిరసన



**గద్వాల్ రూరల్, ఏప్రిల్ 30 (జనంసాక్షి) :** కలెక్టర్ కార్యాలయం ముందు నర్సింగ్ విద్యార్థులు నిరసన. జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో నిన్న జరిగిన సంఘటనలో అతివేగంగా వచ్చి ఇద్దరు నర్సింగ్ కాలేజీ విద్యార్థులను బలిగొన్న దుర్ఘటనలో నర్సింగ్ విద్యార్థులు మృతి చెందిన వారి కుటుంబాలకు గాయపడిన వారికి న్యాయం జరగాలని అదేవిధంగా నర్సింగ్ కళాశాలలో వసతులు లేకపోవడం,మొదటి సంవత్సరం ఒక చోట,రెండు ముడు,నాల్గు సంవత్సరం విద్యార్థులకు మరోచోట వసతులు కల్పిస్తూ వసతి గృహం మరోచోట ఉండటం రవాణా చేసే క్రమంలో ఈలాంటి సమస్యలు తలెత్తడం జరుగుతున్నాయి అన్ని కాలేజీ అనంతరం సాయంకాల సమయంలో కాలేజ్ నుండి గద్వాల్ పట్టణంలోని వసతి గృహం వెళ్లడానికి ఆర్టీసీ బస్సులు ఆపట్లేదు అని నిన్న జరిగిన సంఘటన ముందు ఆర్టీసీ బస్సును ఆపగా వారు ఆపకుండా వెళ్లిపోయారని మరో బస్సు కోసం వేచి ఉన్న సమయంలో ప్రమాదం ఏర్పడి తమ తోటి విద్యార్థినులను,మిత్రులను కోల్పోయామని నర్సింగ్ విద్యార్థులకు ఒక ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసి వారిని వారి గమ్య స్థానం చేర్చే విధంగా చర్యలు చేపట్టాలని ఇప్పటికైనా త్వరగా అన్ని వసతులు ఒకచోట కల్పించే విధంగా కలెక్టర్,ఉన్నత అధికారులు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలంటూ కలెక్టర్ కార్యాలయం ముందు నర్సింగ్ విద్యార్థులు నిరసన చేపట్టారు.

## అరోరా డీమ్డ్ విశ్వవిద్యాలయ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

- బలవంతపు పరీక్షలు, ఫీజు వసూలు విరమించుకోవాలి
- విశ్వవిద్యాలయ యాజమాన్యం మొండి వైఖరి విడనాడి విద్యార్థులకు న్యాయం చేయాలి
- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్



**బోడుప్పల్, ఏప్రిల్ 30 (జనంసాక్షి) :** మేడ్చల్ జిల్లా, మేడిపల్లి మండలం, పర్వతాపూర్ శివారు ప్రాంతంలో ఉన్న అరోరా డీమ్డ్ విశ్వవిద్యాలయ ఎంబీఏ,ఎంసీఏ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పదిరోజులుగా విశ్వవిద్యాలయం మధ్యంతరంగా తీసుకొచ్చిన పరీక్ష షెడ్యూల్ ని వెంటనే వెనక్కి తీసుకోవాలని, ఆందోళన నిర్వహిస్తున్నారు. విద్యార్థుల ఆందోళనకు మద్దతుతెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ.. అరోరా విశ్వవిద్యాలయంలో 2023 వ సంవత్సరం ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులు దాదాపు 240 మంది విద్యార్థులు అడ్మిషన్ తీసుకోవడం జరిగింది. అడ్మిషన్ తీసుకునే ముందు కేవలం కోర్స్ కి సంబంధించిన పరీక్షలు మాత్రమే నిర్వహిస్తాం. ఇతర ఎటువంటి పరీక్షలు కానీ ఫీజులు కానీ ఉండవు అని విశ్వవిద్యాలయ యాజమాన్యం తెలియజేయడం జరిగింది. కానీ ఇంకో 4 నెలల వ్యవధిలో కోర్స్ పూర్తి కావస్తున్న తరుణంలో అర్ధాంతరంగా ఇతర పరీక్షలు రాయాలని, విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. మేము విధించిన పరీక్షలు రాయకపోతే మిమ్మల్ని ఫెయిల్ చేస్తామని విశ్వవిద్యాలయ యాజమాన్యం విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఈ విషయంలో విశ్వవిద్యాలయ యాజమాన్యం మొండి వైఖరికి పోకుండా విద్యార్థులకు న్యాయం చేసే విధంగా చర్యలు తెసుకోవాలని, అడ్మిషన్ తీసుకునే ముందు మీరు చెప్పిన మాట ప్రకారం పరీక్షలు నిర్వహించి, విద్యార్థులు విలువైన భవిష్యత్తు కాపాడాలని, వారికి న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయడం జరిగింది. లేని యెడల విద్యార్థులను న్యాయం జరిగేంతవరకు వారికి అండగా ఉంటూ.. పోరాటాలు కొనసాగిస్తామని తెలియాజేయడం జరిగింది. ఈ ధర్నాలో ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఎండీ అన్వర్, ఉపాధ్యక్షులు హరీష్, నాయకులు ఆదిత్య, జెక్క సాయి, ఆకాష్, వందలాదిమంది విద్యార్థులు పాల్గొన్నారు.

## తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ రావు



**గద్వాల నడిగడ్డ, ఏప్రిల్ 30 (జనం సాక్షి) :** గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ రావు అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీవోసీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాస్థాయి తాగు నీరు, పారిశుధ్య కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో బహిరంగ మల విసర్జన పూర్తిగా నిర్మూలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి గ్రామంలో నీటి నాణ్యతను క్రమం తప్పకుండా పరీక్షించి అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని అన్నారు. ఇంకొక గుంతల వల్ల భూగర్భ జలాలు పెరుగుతాయని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులు, ఇతర ప్రభుత్వ భవనాల్లో రూఫ్ టాఫ్ హార్వెస్టింగ్ ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించాలని అన్నారు.పాత బోర్ల రీచార్జింగ్ ద్వారా భూగర్భ జలాలను పెంపొందించే విధంగా వ్యవసాయ అధికారులు పని చేయాలన్నారు. బహిరంగ మలవిసర్జన నివారణపై ఆరోగ్య విభాగం ప్రత్యేక దృష్టి సారించాలని, కెనాల్స్, చెరువుల పునరుద్ధరణపై దృష్టి పెట్టాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. అన్ని గ్రామ పంచాయతీలలోని పాఠశాలలు,హెల్త్ సెంటర్లు,అంగన్‌వాడీ కేంద్రాల్లో పంచాయతీ భవనాల్లో,గ్రామ మురుగు నీరు,కాలువ చివరలో కమ్యూనిటీ ఇంకుడు గుంతలు నిర్మించాలన్నారు. తద్వారా నీరు భూమిలో చేరి భూగర్భ జలాలు పెంచేందుకు దోహదపడుతుందని తెలిపారు. ప్లాస్టిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో మిషన్ భగీరథ ఇంట్రా ఈ.ఈ శ్రీధర్ రెడ్డి, నీటి పారుదల శాఖ ఈ.ఈ శ్రీనివాస రావు, వైద్య శాఖ ప్రోగ్రాం ఆఫీసర్ డా. సంధ్య కిరణ్ మయి, కమిటీ సభ్యులు తదితరులు,పాల్గొన్నారు.

## మిల్లర్లు లోడింగ్, అన్‌లోడింగ్‌లో నిబంధనలు పాటించాలి

- గన్ని సంచుల కొరత లేకుండా చూడాలి
- జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు



**సంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 30 (జనం సాక్షి) :** మిల్లర్లు లోడింగ్, అన్లోడింగ్ విషయంలో ప్రభుత్వ నిబంధనలు పాటించాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరి పేర్కొన్నారు. బుధవారం జిన్నారం మండల కేంద్రంలోని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, సెర్ఫ్, ఐ కె పి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంను జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలన్నారు. గన్ని సంచుల కొరత, హమాలీల కొరత లేకుండా చూడాలని ,ధాన్యం కొనుగోళ్లను సజావుగా నిర్వహించాలని, మిల్లర్లు లోడింగ్ అన్లోడింగ్ విషయంలో ప్రభుత్వ నిబంధనలు పాటించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కేంద్రంలో రైతులు ఆరబోసిన ధాన్యం తేమ శాతాన్ని, ధాన్యం కొనుగోళ్ల రిజిస్టర్లలో ఓపీఎంఎస్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. రైతులు కేంద్రంలో ఆరబోసిన ధాన్యం తేమ శాతాన్ని ప్రతిరోజూ పరిశీలించి, సకాలంలో ధాన్యాన్ని మిల్లులకు తరలించలన్నారు. రైతులు ఆరబోసిన ధాన్యం కుప్పల గురించి పలు వివరాలను కేంద్ర నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.ధాన్యం కొనుగోళ్లలో రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తప్పవని కేంద్ర నిర్వాహకులను హెచ్చరించారు. తాలు లేకుండా సరి చూసుకోవాలని, తేదీ, రైతు పేరు, ఫోన్ నంబర్, ధాన్యం కొనుగోళ్ళ పూర్తి వివరాలతో రిజిస్టర్లలో సక్రమంగా నమోదు చేయాలని, తేమ శాతం వచ్చిన వెంటనే ధాన్యం కొనుగోలు పూర్తిచేసి, అదే రోజు సంబంధిత మిల్లులకు తరలించాలని, కేంద్రాల్లో ఎక్కువ రోజుల వరకు నిల్వ చేయకూడదని కేంద్ర నిర్వాహకులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, జిల్లా వ్యవసాయ అధికారి శివ ప్రసాద్, పఠాన్‌చెర్వు నియోజకవర్గం ప్రత్యేఅధికారి, దేవుజా, ఆర్డిఓ రవీంధర్ రెడ్డి, తహసిల్దార్, బిక్షపతి, రెవెన్యూ అధికారులు, కొనుగోలు కేంద్ర నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల హిల్స్ ఖాళీ స్థలంలో యథేచ్ఛగా నిర్మాణ పనులు

- కాలనీవాసుల ఫిర్యాదుతో అడ్డుకున్న మున్సిపల్ అధికారులు



**రాజేంద్రనగర్, ఏప్రిల్ 30 (జనం సాక్షి) :** భూముల ధరలు అమాంతం పెరిగిపోవడంతో కాలనీకి సంబంధించిన ఖాళీ స్థలంలో కొందరు కబ్జాదారులు నిర్మాణాలను అధికారులు అడ్డుకున్నారు. వివరాల ప్రకారం మణికొండ మున్సిపాలిటీ పుప్పాలగూడ పరిధిలోని సర్వే నెంబర్ 87, 119 తిరుమల హిల్స్ కాలనీకి సంబంధించిన ఖాళీ స్థలంలో కొందరు జెసిబి తో పనులు ప్రారంభిస్తున్న సమయంలో కాలనీవాసులు అడ్డుకొని మున్సిపల్ కమిషనర్ ప్రదీప్ కుమార్ కు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన కమిషనర్ అధికారి సంతోష్ సింగ్ కు పనులు నిలిపివేయాలని ఆదేశించడంతో అక్కడ చేరుకున్న టిపిఓ నిర్మాణ పనులను నిలిపివేశారు. కాలనీకి సంబంధించిన స్థలం కోర్టులో పెండింగ్లో ఉండడంతో దీన్ని చుట్టూ ఫెన్సింగ్ వేసి సూచిక బోర్డు ఏర్పాటు చేయాలని గతంలో కూడా అధికారులకు విన్నవించామని, ఇప్పటికైనా అధికారులు స్పందించి తిరుమల హిల్స్ కాలనీ వాసులకి సంబంధించిన ఖాళీ స్థలంలో సూచిక బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

### హెచ్ఎండిఏ పొరపాటుతో...

గత కొన్ని సంవత్సరాల క్రితం హెచ్ఎండిఏ ఈ స్థలం లేఔట్ పై, లేఅవుట్ ఇవ్వడంతో స్థిరాస్తి వ్యాపారి రిజిస్ట్రేషన్ తో వేరే వారికి విక్రయించారు. ఆ తర్వాత కాలనీ స్థలం హుడా లేఅవుట్ గా రికార్డులో ఉండడంతో ,పొరపాటు తెలుసుకున్న హెచ్ఎండిఏ అధికారులు అనుమతులు రద్దు చేయడంతో కోర్టులో లో పెండింగ్లో ఉంది.

# కరీంనగర్‌లో ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేయండి

**అంబేద్కర్ స్టేడియంలో సింథటిక్ ట్రాక్ మంజూరు చేయండి**

**ఖేలో ఇండియా కింద శాతవాహన వర్శిటీలో మల్టీపర్పస్ హాల్ మంజూరు చేయండి**

**కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్సూక్ మాండవీయను కలిసిన బండి సంజయ్**



**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ (జనంసాక్షి)**

: కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని కోరుతూ కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ బుధవారం రోజు కేంద్ర కార్మిక శాఖ మంత్రి డాక్టర్ మన్సూక్ మాండవీయకు మరోమారు విజప్తి చేశారు. దీంతోపాటు కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో రూ.10 కోట్ల వ్యయంతో సింథటిక్ ట్రాక్ ను ఏర్పాటు చేయాలని కోరారు. అట్లాగే శాతవాహన వర్శిటీలో "ఖేలో ఇండియా" కింద మల్టీపర్పస్ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విజప్తి చేశారు. న్యూఢిల్లీలో మన్సూక్ మాండవీయను కలిసిన బండి సంజయ్ పై మూడు అంశాలకు సంబంధించి చర్చించారు. కరీంనగర్ జిల్లాలో ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటుపై గతంలోనే కేంద్ర కార్మిక మంత్రిని బండి సంజయ్ కలిసిన విషయం తెలిసిందే. బుధవారం రోజు మరోసారి ఈ అంశంపై చర్చించారు. కరీంనగర్ లో ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని వివరించారు. కరీంనగర్ జిల్లా కేంద్రం మెడికల్ హబ్ గా మారిందన్నారు. ఉత్తర తెలంగాణ జిల్లాల నుండి అత్యధిక మంది ప్రజలు వైద్యం కోసం కరీంనగర్ కు విచ్చేస్తున్నారని తెలిపారు. ఉత్తర తెలంగాణలో బీడీ కార్మికులు, నేత కార్మికులుసహా వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల సంఖ్య అధికంగా ఉందన్నారు. ఈ నేపథ్యంలో కరీంనగర్ జిల్లాలో ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేయడంవల్ల తమ ప్రాంత ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతోందన్నారు. ప్రస్తుతం ఈ సౌకర్యం అందుబాటులో లేకపోవడంతో ఎంతో మంది కార్మికులు వైద్య చికిత్సకు నోచుకోకుండా ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. అనంతరం అంబేద్కర్ స్టేడియంలో రూ.10 కోట్ల వ్యయంతో సింథటిక్ ట్రాక్ ను ఏర్పాటు చేయాలని కోరారు. నిత్యం అంబేద్కర్ స్టేడియంకు వేలాది మంది వస్తుంటారని, వారి సౌకర్యార్థం సింథటిక్ ట్రాక్ ను ఏర్పాటు చేయాలని విజప్తి చేశారు. "ఖేలో ఇండియా" పథకం కింద కరీంనగర్ లోని శాతవాహన వర్శిటీలో రూ.16 కోట్ల వ్యయంతో మల్టీ పర్పస్ హాల్ ఏర్పాటుకు సంబంధిత అధికారులు ప్రతిపాదనలు రూపొందించి కేంద్రానికి పంపారని చెప్పారు. దీనిపై స్పందించిన స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు ఇటీవల శాతవాహన వర్శిటీని సందర్శించి మల్టీపర్పస్ హాలు ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై నివేదికను రూపొందించి కేంద్రానికి పంపిన విషయాన్ని కేంద్ర మంత్రికి
గుర్తు చేశారు. బండి సంజయ్ విజప్తికి సానుకూలంగా స్పందించిన కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్సూక్ మాండవీయ కరీంనగర్ లో ఈఎస్ఐ ఏర్పాటు ప్రతిపాదనలను ప్రధానమంత్రి కార్యాలయానికి పంపామని, ఆమోదం లభించిన వెంటనే ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అంబేద్కర్ స్టేడియంలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటు, శాతవాహన వర్శిటీలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటు అంశాలను త్వరితగతిన పరిశీలించి సానుకూల నిర్ణయం తీసుకోవాలని సంబంధిత అధికారులను కేంద్ర మంత్రి మన్సూక్ మాండవీయ ఆదేశించారు.

# లక్ష్యం మేరకు ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపిక పూర్తి చేయాలి

**రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 30 (జనంసాక్షి)**



రాజన్న సిరిసిల్ల జిల్లాలో లక్ష్యం మేరకు ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపిక పూర్తి చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంపై జిల్లాలోని ఆయా మండలాలు, మున్సిపాలిటీల ప్రత్యేక అధికారులతో కలెక్టర్ బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, ఎన్ని సర్వే చేశారు, ఎన్ని దరఖాస్తులు ఆన్లైన్ చేశారో హౌసింగ్ పీడీ శంకర్ ను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయా మున్సిపాలిటీలు, మండలాల వారిగా లక్ష్యం మేరకు ఎంత పూర్తి చేశారో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ అర్హులైన పేదల సొంత ఇంటి కల సాకారం చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రవేశపెట్టిందని వివరించారు. ఇప్పటికే వచ్చిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో సర్వే చేశారని, అర్హులకే అందేలా చూడాలని స్పష్టం చేశారు. జిల్లాలోని ఆయా మున్సిపాలిటీలు, మండలాల్లో మొత్తం 7690 దరఖాస్తులు అధికారులు క్షేత్ర స్థాయిలో సర్వే చేశారని, వీటిలో ఇప్పటిదాకా 5776 వారి వివరాలు ఆన్లైన్ చేశారని వెల్లడించారు. మిగతా వివరాలు పరిశీలిస్తున్నారన్నారు. అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు అందించాలని సూచించారు. వచ్చే నెల 2 న ఆయా గ్రామాలు, మున్సిపాలిటీల వార్డుల్లో దరఖాస్తుదారు జాబితా ప్రదర్శిస్తారని, 5 న తుది జాబితా ప్రదర్శిస్తారని కలెక్టర్ తెలిపారు. అధికారులు సమన్వయంతో పని చేసి లక్ష్యాన్ని పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సిరిసిల్ల ఆర్డీవో రాధాబాయి, డీఆర్డీఓ శేషాద్రి, ఆయా మండలాల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

# 4న చలో కరీంనగర్




**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 30 (జనంసాక్షి)**

ఉత్తర తెలంగాణ ఉద్యమకారుల రౌండ్ టేబుల్ సమావేశం మే 4 ఆదివారం కరీంనగర్ లో నిర్వహిస్తున్నట్లు ఉద్యమ కళాకారుల విభాగం రాష్ట్ర కన్వీనర్ యెల్ల పోశెట్టి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు కరీంనగర్లో తారక్ హెూటల్ బస్టాండ్ పక్కన జరుగు ఉత్తర తెలంగాణ ఉద్యమకారుల రౌండ్ టేబుల్ సమావేశనికి కరీంనగర్, పెద్దపెల్లి ,రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, నిజామాబాద్, నిర్మల్, మంచిర్యాల, ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాలోని ఉద్యమకారులు,ఉద్యమ కళాకారులు, కవులు, రచయితలు, సాహితీ వేత్తలు, వివిధ జిల్లాల అధ్యక్షులు, కన్వీనర్లు, మండలాల అధ్యక్షులు,మహిళా కళాబృందాల అధ్యక్షురాలు, మహిళా కళాకారిణీలు, గాయకులు రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తర తెలంగాణ కళాకారుల విభాగం కోఆర్డినేటర్ బొడ్డు రాములు,రాజన్న సిరిసిల్ల ఉద్యమకారుల జిల్లా అధ్యక్షులు బొజ్జ కనకయ్య, ఉద్యమ కళాకారుల రాజన్న జిల్లా అధ్యక్షులు వారాల దేవయ్య, తెలంగాణ ఉద్యమ కళాకారుల విభాగం రాజన్న సిరిసిల్ల జిల్లా ఉపాధ్యక్షులు కనపర్తి హనుమాన్, ప్రధాన కార్యదర్శి మనవాడ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

# సామాజిక సంస్కర్త, బసవేశ్వరుడు



**మంచిర్యాల ప్రతినిధి , ఏప్రిల్ 30 (జనంసాక్షి)**

: సమాజంలో కుల వ్యవస్థను వ్యతిరేకించి ఆధ్యాత్మికతను ప్రేరేపించిన మహనీయుడు బసవేశ్వరుడు అని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం మంచిర్యాల జిల్లా నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బసవేశ్వరుడి జయంతి వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పురుషోత్తం, జిల్లా అధికారులు, కుల సంఘాల ప్రతినిధులతో కలిసి హాజరై విశ్వగురు బసవేశ్వరుని చిత్రపటం వద్ద జ్యోతిని వెలిగించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 12వ శతాబ్దపు సాధువు, సామాజిక సంస్కర్త, బసవేశ్వరుడు పుట్టినరోజును బసవ జయంతిగా జరుపుకుంటున్నామని, బసవేశ్వరుడు కుల వ్యవస్థను వ్యతిరేకించడమే కాకుండా పనిని ఆరాధించమని, ఏమీ ఆశించకుండా సమాజానికి సేవ చేయాలని తెలపడం జరిగిందని, అనుభవ మంటపం అనే ఆధ్యాత్మిక వేదికను స్థాపించి సమానత్వం, సామాజిక న్యాయం అందరికీ అందేలా కృషి చేశారని తెలిపారు.

# ఆపరేషన్ కగార్‌ను ఆపివేసి శాంతి చర్చలు జరపాలి

**ఖమ్మం (జనంసాక్షి)**




**కర్రిగుట్టల నుండి కేంద్ర బలగాలను వెనక్కి పంపాలి**

**రౌండ్ టేబుల్ సమావేశంలో రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, ప్రజాస్వామిక హక్కుల సంఘాలు డిమాండ్**

ఆపరేషన్ కగార్ ను వెంటనే ఆపేయాలని, ఆదివాసులపై జరుగుతున్న దాడిని నిలిపివేసి శాంతి చర్చలు జరపాలని మంచికంటి భవన్లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆపరేషన్ కర్రిగుట్టలు పేరుతో కొనసాగిస్తున్న కేంద్ర బలగాలను వెంటనే వెనక్కి తీసుకురావాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు – మావోయిస్టు పార్టీ కాల్పుల విరమణ పాటించి శాంతి చర్చలు జరపాలని కోరారు. శాంతియుత వాతావరణం నెలకొల్పడమే ప్రభుత్వాల లక్ష్యంగా ఉండాలనీ, ప్రభుత్వాలు రాజ్యాంగ బద్దంగా వ్యవహరించి శాంతియుత వాతావరణం నెలకొల్పి ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలి. రాజ్యాంగానికి లోబడి వ్యవహరించాలి. పారా మిలిటరీ బలగాలతో బల ప్రయోగంతో కాకుండా శాంతి చర్చల ద్వారా సమస్య పరిష్కారం జరిగేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించాలని కోరుతున్నాం. ఈ రౌండ్ సమావేశంలో మే 2న ఉదయం 9 గంటలకు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద మానవహారం నిర్వహించాలని, అన్ని మండల కేంద్రాలలో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానించడం జరిగింది. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి ప్రముఖ విద్యావేత్త రవి మారుత్,కాకి భాస్కర్,కిషన్ నాయక్ అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సీఐటీయూ జాతీయ నాయకులు,సాయిబాబా, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పొన్నవెంకటేశ్వర్లు, సీపీఐ జిల్లా నాయకులు సింగు నరసింహారావు, సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు అవునూరి మధు, జిల్లా కార్యదర్శి రాజేంద్రప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పోట్ల నాగేశ్వర్ రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, బిచ్చల తిరుమలరావు, మేకల సుగుణ రావు,పాషా టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్రావు, ఖమ్మం బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ తొండపు వెంకటేశ్వర్లు, ప్రముఖ విద్యావేత్త ఐవి రమణ రావు,లక్ష్మయ్య, సమతా శ్రీధర్, తెలంగాణ పీపుల్స్ జేఏసీ జిల్లా కన్వీనర్ దేవిరెడ్డి విజయ్ జర్నలిస్ట్ యూనియన్ జిల్లా కార్యదర్శి చిర్రా రవి, పౌర హక్కుల సంఘం రాష్ట్ర నాయకులు విప్లవ కుమార్, హెచ్ఆర్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఖాదర్ బాబు, బీసీ సంఘం నాయకులు పెరుగు
వెంకటరమణ, ముస్లిం
జేఏసీ నాయకులు అబ్దుల్ రెహమాన్, తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా ఉపాధ్యక్షులు నరేందర్, మోడం వెంకన్న, పిడిఎస్ జిల్లా కార్యదర్శి మస్తాన్, టీఎంఆర్పీఎస్ రాష్ట్ర నాయకులు పేర్ల మధు, ఎర్ర శ్రీను, బండారు రమేష్, లక్ష్మీనారాయణ, లక్ష్మక్క, తలారి శ్రీను, దాసరి శ్రీను, పాల్గొన్నారు.

# భూభారతి చట్టంపై ప్రతి మండల కేంద్రంలో అవగాహన

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 30 (జనం సాక్షి)**




భూ భారతి చట్టం పై జిల్లాలోని ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రతీ మండల కేంద్రంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. భూ భారతి చట్టం పై అవగాహన సదస్సులను జిల్లాలో ప్రారంభించ డం జరిగిందని, అందులో భాగంగా బుధవారం కామారెడ్డి మండలం చిన్న మల్లారెడ్డి, రాజం పేట, తాడ్వాయి రైతువేదికలో నిర్వహించిన అవగాహన సదస్సులలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సెక్షన్ 4 ప్రకారం హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు, భూమి హక్కులు ఉండి రికార్డుల్లో లేని వారు హక్కుల రికార్డులో నమోదు చేయించుకోవ డానికి కొత్త చట్టం వచ్చిన సంవత్సరంలో గా దరఖాస్తు చేసుకో వచ్చుని. సెక్షన్ 5 ప్రకారం వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేసుకోవచ్చని తెలిపారు. అంతకుముందు చట్టం పై రూపొందించిన వివరాలను ఆయా తహసీల్దార్లు వివరించారు. కార్యక్రమం ప్రారం భానికి ముందు భూ భారతి పై రూపొందించిన వీడియో ప్రదర్శించారు. ఈ సదస్సులో వ్యవసా య మార్కెట్ కమిటీ చైర్మన్ లు, పాక్స్ చైర్మన్లు, ఆయా మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓ లు, రెవిన్యూ సిబ్బంది, గ్రామస్తులు, రైతులు, పలువురు ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## భూసేకరణ ప్రక్రియ సత్వరమే పూర్తిచేయాలి

**జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి కర్ణన్**



**హైదరాబాద్, ఏప్రిల్ 30 (జనంసాక్షి) :**

ఆరాంఘర్ ఫ్లైఓవర్ అప్ డౌన్ ర్యాంప్ ల నిర్మాణానికి కావాల్సిన భూసేకరణ ప్రక్రియ సత్వరమే పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ అధికారులను ఆదేశించారు. ఆరాంఘర్ నుండి జూ పార్క్ వరకు చేపట్టిన ఫ్లై ఓవర్, శాస్త్రి పురం ఆర్.ఓ.బి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్.ఓ.బి రైల్వే పోర్షన్ పెండింగ్ లో ఉందని ప్రాజెక్టు ఈ ఈ శ్రీనివాస్ కమిషనర్ కు వివరించారు. రైల్వే పోర్షన్ ఎన్ని రోజుల్లో పూర్తవుతుందని, రైల్వే పోర్షన్ పూర్తయిన తర్వాత పూర్తి పని ఎన్ని రోజుల్లో పూర్తవుతుందని ప్రాజెక్ట్ అధికారులను అడిగారు. రైల్వే పోర్షన్ పనులు పూర్తయిన తర్వాత 30 నుండి 45 రోజుల్లో ప్రాజెక్ట్ మొత్తం పనులు పూర్తవుతుందని ఇంజనీరింగ్ అధికారులు కమిషనర్ కు వివరించారు. రైల్వే సిఈ తో సమన్వయం చేసుకుని వీలైనంత తొందరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధికారులను
ఆదేశించారు. అంతకు ముందు కమీషనర్ ప్రపంచ అందాల పోటీల నేపథ్యంలో చార్మినార్ ను పర్యాటకులు సందర్శించే అవకాశం ఉన్న నేపథ్యంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని జోనల్ కమీషనర్ ను ఆదేశించారు. కమిషనర్ వెంట చార్మినార్ జోనల్ కమీషనర్ వెంకన్న, ప్రాజెక్టు ఈ ఈ బిఎల్ శ్రీనివాస్, డిప్యూటీ కమీషనర్ తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**కాళేశ్వరం, ఏప్రిల్ 30 (జనంసాక్షి) :**



రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీదర్ బాబు బుధవారం మహాదేవపూర్ మండలం ఎల్కేశ్వరంలో ఇందిర మ్మ ఇండ్ల నిర్మాణానికి శంకుసా పన కార్యక్రమానికి వెళ్తున్న క్రమంలో మహాదేవపూర్ ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న వేల్పుల మౌనిక, బొగ్గుల శైలజ, సుజాతలను కారు ఢీకొన్న ఘటనలో గాయపడిన మహిళలను స్వయంగా తన ఎస్కార్ట్ వాహనంలో హుటాహుటిన మహాదేవపూర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తరలించారు. గాయపడిన యువతులకు మెరుగైన వైద్య సేవలు అందేలా వైద్యాధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ప్రమాదితులకు మెరుగైన చికిత్స అందించాలని, వారి ఆరోగ్య పరిస్థితిపై పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి పై స్థానిక ప్రజలు ప్రశంసల వర్షం కురిపిస్తూ మానవత్వం చాటుకున్నందుకు కృతజ్ఞతలు తెలియచేశారు.

## పది"లో రాష్ట్రంలో 8వ స్థానంలో ములుగు జిల్లా డీఈఓ జి పాణిని

**ములుగు ప్రతినిధి, ఏప్రిల్ 30(జనంసాక్షి)**

: బుధవారం రోజున తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసినటువంటి పదవ తరగతి ఫలితాలలో ములుగు జిల్లా రాష్ట్రంలో 8వ స్థానం సాధించినట్లుగా జిల్లా విద్యాశాఖ అధికారి జి పాణిని తెలిపారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరం మార్చి వార్షిక పరీక్షలలో ములుగు జిల్లా నుండి 3134 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 3060 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి 97.64% ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 8వ స్థానంలో నిలవడం అభినందనీయం అని వారు అన్నారు. గత సంవత్సరంతో పోల్చుకుంటే ఈ సంవత్సరం ఉత్తీర్ణత శాతం 3.19% అధికం.
జిల్లాలో 1608 మంది బాలురు పరీక్షకు హాజరుకాగా 1560 మంది బాలురు ఉత్తీర్ణతతో 97.01% ఉత్తీర్ణత సాధించగా, 1526 మంది బాలికలు పరీక్షకు హాజరుకాగా 1500 మంది బాలికల ఉత్తీర్ణతతో 98.30% ఉత్తీర్ణత సాధించారు. గత విద్యా సంవత్సరం 10వ తరగతి ఫలితాలలో రాష్ట్ర వ్యాప్తంగా 13వ స్థానంలో ఉండగా ఈ విద్యా సంవత్సరం ములుగు జిల్లా ఎనిమిదో స్థానంలో నిలవడం పట్ల జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని హర్షం వ్యక్తం చేస్తూనే, ఉత్తమ ఫలితాల సాధన కోసం కృషి చేసినటువంటి డీసీఈబి కార్యదర్శి, ఏసిజిఈ, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లు, మండల విద్యాశాఖ అధికారులు మరియు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను వారు అభినందించడం జరిగింది. ఉత్తీర్ణత సాధించినటువంటి విద్యార్థులకు జిల్లా విద్యాశాఖ అధికారి జి పాణిని తో పాటుగా డిసిఇబి కార్యదర్శి ఈ సూర్యనారాయణ, ఏసీజీఈ అప్పని జయదేవ్ మరియు సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లు అభినందనలు తెలియజేయడం జరిగింది. ఏసీజీఈ అప్పని జయదేవ్ మాట్లాడుతూ ఫెయిల్ అయినటువంటి విద్యార్థులు నిరుత్సాహపడకుండా జూన్ మూడవ తేదీ నుండి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించబడతాయని దానికి మే 16వ తేదీలోగా ఫీజు చెల్లించాలని విద్యార్థులను మరియు ప్రధానోపాధ్యాయులను కోరారు. ఫెయిల్ అయినటువంటి విద్యార్థులు రీ వెరిఫికేషన్ మరియు రీ కౌంటింగ్ కోసం అప్లై చేసినప్పటికీ వాటిపై ఆధారపడకుండా విధిగా సప్లమెంటరీ ఫీజు చెల్లించి పరీక్షలకు సిద్ధం అవ్వాలని అన్నారు.

# తెలంగాణను అగ్రగామిగా నిలిపిన కేసీఆర్

**మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**

**వనపర్తి,ఏప్రిల్30 (జనంసాక్షి):**



ఫామ్ హౌస్ లో ఉంటూనే కేసీఆర్ పదేళ్లలో తెలంగాణను దేశంలో అగ్రగామిగా నిలిపారని మాజీ వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి కొనియాడారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ ప్రజలు అడగని పథకాలను అమలు చేశారని ,ప్రజలకు అవసరమైన పథకాలను ప్రవేశపెట్టారని అన్నారు. పదేళ్ల వరకు కేసీఆర్ అధికారంలోకి రారని అంటున్న రేవంత్ రెడ్డికి దమ్ముంటే ఇప్పుడు రాజీనామా చేసి ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు. పదేళ్లు రేవంత్ రెడ్డి అధికారంలో ఉండే సంగతి తర్వాత ఉన్న ఐదేళ్లు తెలంగాణను ఆగం చేయకుండా పాలిస్తే చాలని హితవు పలికారు. కొడంగల్ లో ఓడిపోతే రాజకీయ సన్యాసం చేస్తానని సవాల్ విసిరి, మల్కాజ్ గిరి పారిపోయిన చరిత్ర రేవంత్ రెడ్డిదని దుయ్యబట్టారు. హామీ ఇచ్చిన పథకాలు అమలు చేయకుండా ప్రగల్భాలు పలుకుతు న్నాడని ధ్వజమెత్తారు. రైతుబంధు, రుణమాఫీ, రైతుబీమా పథకాలు అమలు చేయకుండా రైతులను వేధించి, వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వకుండా రేవంత్ రెడ్డిని ఎవరు అడ్డుకున్నారని అన్నారు. అమ్మఒడి ఎందుకు ఆగింది, గర్భవతులకు న్యూట్రిషన్ కిట్ ఎక్కడికి పోయింది, ఆడబిడ్డ పుడితే 13 వేలు, మగబిడ్డ పుడితే రూ.12 వేలు ఎందుకు ఆగా యి ,ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో అల్పాహారం ఆపింది ఎవరు ? కిశోర బాలికలకు హెల్త్ కిట్ ఎవరు మాయం చేశారు ? కేసీఆర్ కిట్ ఎవరు ఎత్తుకెళ్లారని ప్రశ్నించారు. అధికారం కోసం అరచేతిలో వైకుంఠం చూపిన రేవంత్ రెడ్డి ,హామీల అమలును ప్రశ్నిస్తే ప్రతిపక్ష నేతల మీద కేసులు, జైళ్లు, చావులు కోరుకుంటున్నాడని ఎద్దేవా చేశారు. ఈ ప్రభుత్వాన్ని ఎప్పుడు శిక్షించాలి అన్న విషయంలో ప్రజలకు సంపూర్ణ అవగాహన
ఉందని, సమయం వచ్చినప్పుడు కర్రు కాల్చి వాత పెడుతారని హెచ్చరించారు.

# గ్రామీణ స్వర్ణకారుల ఉపాధిని పరిరక్షించాలి

**ముస్తాబాద్, ఏప్రిల్ 30 (జనం సాక్షి )**



: గ్రామీణ స్వర్ణకారుల ఉపాధిని పరిరక్షించాలని కోరుతూ రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో మహిళలు (స్వర్ణకారుల సతీమణులు) ఒక రోజు రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. బుధవారంతో రిలే దీక్షలు ఏడవ రోజుకు చేరాయి. ఇతర రాష్ట్రాల జ్యువలరీ దుకాణాల ఏర్పాటును అనుమతించవద్దని డిమాండ్ చేస్తూ రిలే దీక్షలు చేపట్టారు.

## భూ భారతి చట్టం అవగాహన సదస్సులో పాల్గొన్న జిల్లా కలెక్టర్



**చింతలపాలెం, ఏప్రిల్ 30 (జనంసాక్షి) :** సూర్యాపేట జిల్లా,చింతలపాలెం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన భూభారతి చట్టం అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ పాల్గొన్నారు.కలెక్టర్ మాట్లాడుతూ ఈ చట్టం,భూరికార్డుల నిర్వహణ మరియు భూ సంబంధిత వివాదాల పరిష్కారానికి సంబంధించిన నిబంధనలను కలిగి ఉంటుంది,భూ రికార్డులలోని లోపాలను సరిదిద్దడానికి అవకాశం కల్పించడం, భూములను సర్వే చేసి మ్యాప్‌లను సిద్ధం చేయడం ద్వారా భూ సంబంధిత వ్యాజ్యాలను తగ్గించడం,భూ రికార్డుల నిర్వహణను పకడ్బందీగా చేయడం, రిజిస్ట్రేషన్ మరియు మ్యుటేషన్ ప్రక్రియలను సులభతరం చేయడం, భూ సంబంధిత వివాదాలను పరిష్కరించడం కోసం తయారు చేయబడింది అని చెప్పారు,సభ జరుగుతుండగానే దొంగరి నాగరాజు అనే రైతు అత్మహత్యయత్నానికి పాల్పడ్డారు,ఈ విషయం తెలుసుకున్న కలెక్టర్ వెంటనే తనతో మాట్లాడి తన సమస్యను ఎంక్వయిరీ చేసి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ రాంబాబు,ఆర్డీవో శ్రీనివాసులు,ప్రత్యేక అధికారి శ్రీనివాస్ రెడ్డి,ఏడి రవీందర్ నాయక్,తహశీల్దార్ సురేందర్ రెడ్డి,ఎంపీడీవో భూపాల్ రెడ్డి,హుజూర్ నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రాధిక అరుణ్ కుమార్ దేశముఖ్,డిసిసిబి డైరెక్టర్ వేమూలూరి రంగాచారి,ప్రాధమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ కలగొట్ల కోటిరెడ్డి మరియు మాజీ ప్రజా ప్రతినిధులు,నాయకులు,రైతులు, అధికారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సన్న, చిన్న కారు రైతులకు ఉచిత భూ భారతితో న్యాయ సహాయం

- భూ భారతి చట్టం ద్వారా అధికార వికేంద్రికరణ
- తప్పుల సవరణకి రెండు అంచేలా అప్పీల్ వ్యవస్థ
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**మేళ్లచెరువు, ఏప్రిల్ 30 (జనం సాక్షి) :** సన్న, చిన్నకారు, బడుగు బలహీన వర్గాలకి చెందిన రైతులకి ఉచితంగా న్యాయ సహాయం ప్రభుత్వం చేస్తుందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. బుధవారం మేళ్లచెర్వు మండల కేంద్రంలో శ్రీ కస్తూరి వెంకటేశ్వర పంక్షన్ హాల్ లో నిర్వహించిన భూ భారతి -2025 చట్టం పై అవగాహన కార్యక్రమాన్ని జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబుతో కలిసి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధరణిలోని లోపాలను గుర్తించి ఎలా పరిష్కారం చేయాలో కమిటీ ద్వారా ప్రజల, మేధావులు, నిపుణులు ద్వారా అభిప్రాయాలు సేకరించి ముసాయిదాను పబ్లిక్ డోమైన్ లో పెట్టి ప్రజల నుండి అభిప్రాయాలు, సూచనలు సేకరించి భూ భారతి చట్టం రూపొంధించి డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ జయంతి ఏప్రియల్ 14 రోజున భూ భారతి చట్టం గౌరవ ముఖ్యమంత్రి చేతులమీదుగా ప్రారంభించి 4 మండలాలో పైలెట్ ప్రాజెక్ట్ చేపట్టడం జరిగిందని, తదుపరి జిల్లాకి ఒక్క మండలం లో అమలు చేసి ఇంకా ఏమైనా సమస్యలు పరిష్కరించలేనివి ఉన్నాయో గుర్తించి భూ భారతి పోర్టల్ లో తగు మార్పులు చేసి తర్వాత జూన్ 2 నుండి రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి గ్రామంలో అమలు చేయటం జరుగుతుందని తెలిపారు. గతంలో గ్రామ స్థాయి లో భూ సమస్యలను పరిష్కరించేందుకు వి ఆర్ ఓ, వి ఆర్ ఎలు ఉండే వారని ధరణి చట్టం అమలులోనికి వచ్చిన తర్వాత వి ఆర్ ఓ వ్యవస్థ రద్దు కావటంతో రైతులు భూ సమస్యలకి ఎవరికీ చెప్పాలో తెలియక తహసీల్దార్ కార్యాలయం, ఆర్డీఓ కార్యాలయాల చుట్టూ తిరిగితే మా దగ్గర అధికారాలు లేవని కలెక్టర్ దగ్గరికి వెళ్ళాలి అని చెప్పేవారని మారుమూల ప్రాంతం నుండి సూర్యాపేటకి రావాలంటే చాలా ఇబ్బంది పడ్డారని తెలియజేశారు. భూ భారతి చట్టం అమలులోకి రాగానే వెంటనే భూ సమస్యలు పరిష్కరించుకునేందుకు రూల్స్ తయారు చేసారని రెవిన్యూ వ్యవస్థ బలపర్చేందుకు త హసీల్దార్ లకి, ఆర్డీఓ లకి వారి స్థాయి ని బట్టి అధికారాలు ఇవ్వటం జరుగుతుందని, ముఖ్యమైన అధికారాలు మాత్రమే కలెక్టర్ కి ఇస్తు అలాగే ప్రతి గ్రామానికి గ్రామ పాలనాధికారులను నియమించి అధికారాలు వికేంద్రికరణ చేయటం జరుగుతుందని తెలిపారు.ధరణిలో పట్టా అమలులో ఏమైనా తప్పులు దొర్లితే సవరణ కి అవకాశం లేకుండా కోర్ట్ ల ద్వారానే పరిష్కరించాలసి ఉండేదని తెలిపారు.కానీ భూ భారతి ద్వారా తహసీల్దర్ వద్ద పొరపాటు జరిగితే ఆర్డీఓ కి, ఆర్డీఓ వద్ద పొరపాటు జరిగితే కలెక్టర్ కి అప్పీల్ చేయవచ్చు అని తెలిపారు. పాత పాస్ పుస్తకం లో భూమి ఉన్నవారికి, విస్తీర్ణం మొత్తం నమోదు కానీ వారు,సర్వే నెంబర్ లో ఉన్న విస్తీర్ణం కంటే ఎక్కువ నమోదు అయిన భూముల తొలగింపు, కబ్జా లో ఉండి పాత పాస్ పుస్తకం ఉండి ప్రస్తుతం ఆన్ లైన్ లో లేకపోవటం లాంటివి భూ భారతి ద్వారా సమస్యలకి శాశ్వత పరిష్కారం చూపి వారికి భూ హక్కులు కల్పించి పాస్ పుస్తకాలు జారీ చేస్తామని తెలిపారు. సాగు చేస్తూ ఇనాం, సీలింగ్, 13 బి, 38 ఈ, ఓ ఆర్ సి లాంటి పట్టాలున్న వారి పేర్లు రికార్డులు నందు నమోదు చేసి నూతన పాస్ పుస్తకాలు ఇవ్వటం జరుగుతుందని తెలిపారు. ఒక తెల్ల కాగితం ద్వారా పెద్ద మనుషుల మధ్య కొనుగోలు చేసిన భూముల క్రమబద్ధికరణ చేయుటకి సాదాబైనామా ద్వారా 2020 లో దరఖాస్తులు స్వీకరించారు కానీ ధరణి చట్టం వల్ల అమలు కాలేదు.ఇప్పుడు భూ భారతి ద్వారా సాదాబైనామా ధరఖాస్తులు ఆర్డీఓ క్షేత్ర స్థాయి లో పరిశీలించి న్యాయమైన వాటిని క్రమబద్ధికరించి పట్టాదార్ పాస్ పుస్తకాలు జారీ చేస్తారని, అలాగే గతంలో 13 బి సర్టిఫికెట్ పొంది సాగు చేస్తున్న రైతులకి పట్టాదార్ పాస్ బుక్ ఇవ్వటం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా అసైన్మెంట్ కమిటీ లు వేసి రక్షించటం జరుగుతుందని తెలిపారు. రెవిన్యూ బృందాలు గ్రామాల వారీగా భూ సమస్యలు పరిశీలించి రైతులకి మేలు జరిగేలా పాస్ పుస్తకాలు జారీ చేయటం జరుగుతుందని తెలిపారు. సమావేశంకి వచ్చిన ప్రతి ఒక్కరు భూ భారతి చట్టం



గురించి తెలియని ప్రజలకి చెప్పాలని సూచించారు. తదుపరి జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు మాట్లాడుతూ భూ సమస్యలు పరిష్కరించేందుకు భూ భారతి చట్టం రూపొదించారాని తెలిపారు. ధరణి అమలు తర్వాత విఆర్ఓ, విఆర్ఎలు రద్దు కావటం, తహసీల్దార్ లకి అధికారాలు లేకపోవటంతో చిన్న చిన్న సమస్యలు ఎవరికీ చెప్పాలో తెలియక రైతులు చాలా ఇబ్బంది పడ్డారని తెలిపారు.ధరణిలో చిన్న చిన్న సమస్య లకి కోర్టుల చుట్టూ రైతులు తిరిగినారని భూ భారతిలో అప్పీల్ వ్యవస్థ చేర్చారని తెలిపారు. మేళ్లచెర్వు మండలంలో 1620 సాదాభైనామా ధరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని వాటిని క్రమబద్ధికరించి రికార్డులలో నమోదు చేసి వారికి పాస్ పుస్తకాలు జారీ చేస్తామని తెలిపారు. త్వరలో రెవిన్యూ వ్యవస్థ బలపర్చేందుకు గ్రామపాలనాధికారులు రాబోతున్నారని జూన్ 2 తరువాత భూ సమస్యలు గ్రామ స్థాయి లోనే పరిష్కరించటం జరుగుతుందని తదుపరి మేళ్లచెర్వు తహసీల్దార్ జ్యోతి పిపిటి ద్వారా భూ భారతి చట్టంను రైతులకి క్లుప్తంగా సెక్షన్‌ల వారీగా వివరించారు. ఈ కార్యక్రమం లో ఆర్డీఓ శ్రీనివాసులు, మండల స్పెషల్ అధికారి పద్మ,ఎంపిడిఓ ఖాజా ఆజగర్ అలీ,మార్కెట్ కమిటీ చైర్మన్ రాధిక దేశ్ ముఖ్,పి ఎ సి ఎస్ చైర్మన్లు శంబిరెడ్డి, రవీందర్ రెడ్డి, కోటిరెడ్డి, దేవాలయ కమిటీ చైర్మన్ శంబిరెడ్డి రెవిన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఇబ్రహీంపట్నం లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంపై అక్రమ నిర్మాణాలు వెంటనే ఆపాలి

- ఆగమ శాస్త్రానికి,వాస్తు శాస్త్రానికి విరుద్ధమైన నిర్మాణాలు
- ఆలయ అభివృద్ధిని ఎల్లప్పుడూ స్వాగతిస్తాం
- టిటిడిపి రాష్ట్ర కార్యదర్శి జలమోని రవీందర్ ముదిరాజ్

**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 30 (జనం సాక్షి) :** ఇబ్రహీంపట్నం నియోజవర్గం కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం( గుట్ట) పై ఇబ్రహీంపట్నం నందు జరుగుతున్న అక్రమ కట్టడాలను వెంటనే ఆపాలని టీటీడీ రాష్ట్ర కార్యదర్శి జెలమోని రవీందర్ డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ వాస్తు శాస్త్రానికి,ఆగమ శాస్త్రానికి విరుద్ధంగా ఇబ్రహీంపట్నం లక్ష్మీనరసింహ దేవస్థానం ద్వాజ స్తంభం ప్రక్కన ఈశాన్య భాగంలో బరువును పెంచుతూ మట్టి పోసి నింపడం గ్రానైట్ కట్టడాలను కట్టడం జరుగుతుందని,ఈ విషయంపై బుధవారం తాను తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ రంగారెడ్డి జిల్లా అసిస్టెంట్ కమిషనర్, రాష్ట్ర డిప్యూటీ కమిషనర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అయితే గతంలో కూడా కొందరు వ్యక్తులు అనాలోచితంగా గుడి పైన నిర్మాణాలు జరిపితే స్వర్గీయ లక్ష్మణాచారి కొందరు భక్తులతో కలిసి ఎండోమెంట్ దృష్టికి తీసుకుపోవడం జరిగిందని దీంతో అప్పుడు అక్రమ నిర్మాణాలు ఆపారని తెలిపారు.తిరిగి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి కళ్యాణోత్సవం దగ్గర పడుతున్న తరుణంలో అభివృద్ధి పేరు చెబుతూ ఇష్టం వచ్చిన రీతిలో అక్రమ నిర్మాణాలు జరుగుతుండడం దారుణమన్నారు. ఎండోమెంట్ శాఖ నుండి ఎటువంటి అనుమతులు లేకుండా,సపతి నిర్ణయానికి వాస్తు



శాస్త్రానికి వ్యతిరేకంగా అక్కడ ఉన్న అధికారుల సైతం బెదిరిస్తూ కొందరు వ్యక్తులు చేరి అక్రమ నిర్మాణ సాగిస్తున్నారు.దేవాలయంపై ఇంత తంతు జరుగుతున్న సంబంధిత ఆలయ కార్యనిర్వాహధికారి అధికారి ఫోన్ స్విచ్ ఆఫ్ ఉండడం గమనార్హం. వెంటనే దేవాదాయ ధర్మాచాయ శాఖ అధికారులు అక్రమ కట్టడాలను నిలువరించి , దేవాలయ విశిష్టత పాడవకుండా ఆగమ శాస్త్రం, నియమ, నిబంధనల ప్రకారం ఎండోమెంట్ సపతి సూచనల మేరకు నిర్మాణం జరపాలన్నారు. తాము అభివృద్ధికి అడ్డం కాదని, దేవాలయ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని సరైన రీతిలో నిర్మాణాలు జరిపాలని కోరారు. నిత్యం వందలాదిమంది భక్తులు సందర్శించే దేవాలయం నిర్మాణం వాస్తు ప్రకారం ఉంటేనే ప్రజలకు కూడా మంచి జరుగుతుందని, ఇక్కడ స్వామివారి స్వయంభుగా వెలిశారని ఆలయ విశిష్టతను పాడాలని విజ్ఞప్తి చేశారు.

## 71 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

**కూసుమంచి, ఏప్రిల్ 30 (జనం సాక్షి) :** రాష్ట్రంలోని నిరుపేదలకు వైద్య సహాయం నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ క్రింద ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డ ఏడాదిలో 1070 కోట్ల రూపాయల ఆర్థిక సహాయం అందించామని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. బుధవారం మంత్రి, కూసుమంచి క్యాంపు కార్యాలయంలో 71 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ క్రింద 23 లక్షల 33 వేల రూపాయలు, 35 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి లక్షా 116 రూపాయల చొప్పున కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూపేదవాడికి అన్ని సౌకర్యాలు కల్పించాలని ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని అన్నారు. ఆనాడు పాలించిన పాలకులు 10 సంవత్సరాలలో వైద్యం పట్ల ఎప్పుడూ మనం ఇచ్చిన నిధులు ఇవ్వలేదని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సంవత్సర కాలంలోనే ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ క్రింద సుమారు 1070 కోట్ల రూపాయలను పేదల వైద్య ఖర్చుల నిమిత్తం పంపిణీ చేశామని అన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇంత పెద్ద ఎత్తున రిలీఫ్ ఫండ్ ఇవ్వడం ఇదే మొదటిసారి అని అన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ క్రింద పేద కుటుంబానికి కార్పోరేట్ ఆసుపత్రిలో వైద్యం అందించేందుకు పరిమితిని 10 లక్షలకు పెంచామని అన్నారు. పేదల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయలకే గ్యాస్



సిలిండర్ సరఫరా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల ద్వారా సన్న బియ్యం సరఫరా, సన్న వడ్లకు 500 రూపాయల బోనస్ వంటి అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. లబ్ధిదారులకుసీఎం రిలీఫ్ ఫండ్ క్రింద 71 మంది లబ్ధిదారులకు 23 లక్షల 33 వేల రూపాయల ఆర్థిక సహాయం చెక్కులను, కళ్యాణలక్ష్మి పథకం క్రింద 35 మంది లబ్ధిదారులకు లక్ష 116 రూపాయల చొప్పున చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఆర్డీవో జి. నర్సింహారావు, కూసుమంచి మండల ఇంచార్జ్ తహసీల్దార్ కరుణశ్రీ, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## భూసేకరణ ప్రక్రియ సత్వరమే పూర్తి చేయాలి

- జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్‌వి కర్ణన్

**హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 30 (జనంసాక్షి) :** ఆరాంఘర్ ఫ్లైఓవర్ అప్ డౌన్ ర్యాంప్‌ల నిర్మాణానికి కావాల్సిన భూసేకరణ ప్రక్రియ సత్వరమే పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ కమీషనర్ ఆర్ వి కర్ణన్ అధికారులను ఆదేశించారు. ఆరాంఘర్ నుండి జూ పార్క్ వరకు చేపట్టిన ఫ్లై ఓవర్, శాస్త్రి పురం ఆర్‌ఓబి పనులను బుధవారం ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆర్‌ఓబి రైల్వే పోర్షన్ పెండింగ్ లో ఉందని ప్రాజెక్టు ఈ ఈ శ్రీనివాస్ కమిషనర్ కు వివరించారు. రైల్వే పోర్షన్ ఎన్ని రోజుల్లో పూర్తవుతుందని, రైల్వే పోర్షన్ పూర్తయిన తర్వాత పూర్తి పని ఎన్ని రోజుల్లో పూర్తవుతుందని ప్రాజెక్ట్ అధికారులను అడిగారు. రైల్వే పోర్షన్ పనులు పూర్తయిన తర్వాత 30 నుండి 45 రోజుల్లో ప్రాజెక్ట్ మొత్తం పనులు పూర్తవుతుందని ఇంజనీరింగ్ అధికారులు కమిషనర్ కు వివరించారు. రైల్వే సిఈ తో సమన్వయం చేసుకుని వీలైనంత తొందరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు.అంతకు ముందు కమీషనర్ ప్రపంచ అందాల పోటీల నేపథ్యంలో చార్మినార్‌ను పర్యాటకులు సందర్శించే



అవకాశం ఉన్న నేపథ్యంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్ కు తెలిపారు. కమిషనర్ వెంట చార్మినార్ జోనల్ కమీషనర్ వెంకన్న, ప్రాజెక్టు ఈ ఈ బిఎల్ శ్రీనివాస్, డిప్యూటీ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.

## గజ్జల శ్రీనివాసులకు శ్రీకాంతాచారి మెమోరియల్ అవార్డు

**హయత్‌నగర్, ఏప్రిల్ 30 (జనం సాక్షి) :** రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం బడంగ్ పేట్ పెద్ద బావి మల్లారెడ్డి గార్డెన్స్‌లో తెలంగాణ రాష్ట్ర భాషా సంస్కృతి శాఖ వారి సౌజన్యంతో, నింగి నేల- మేము సైతం మీ ఆత్మీయ నేస్తం ఆధ్వర్యంలో తెలంగాణ మలిదశ ఉద్యమానికి తన ప్రాణ త్యాగంతో ఊపిరి పోసిన నల్లగొండ జిల్లా ముద్దుబిడ్డ అమరుడు శ్రీకాంత్ చారి మెమోరియల్ అవార్డు ను వారి తల్లి శంకరమ్మ, ఓయూ జేఏసీ చైర్మన్ దరువు అంజన్న చేతుల మీదుగా గజ్జల శ్రీనివాసులు అందుకున్నారు. ఈ సందర్భంగా గజ్జల శ్రీనివాసులు మాట్లాడుతూ అవార్డును తీసుకోవడం ఎంతో సంతోషంగా, గర్వంగా ఉందని అన్నారు.



తెలంగాణ ఉద్యమంలో నిబద్దత, నిస్వార్థంగా పని చేసిన నాలాంటి ఉద్యమ కారులను గుర్తించి, సత్కరించిన శ్రీకాంత్ చారి మెమోరియల్ సభ్యులకు, నింగి నేల- మేము సైతం మీ ఆత్మీయ నేస్తం వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. అవార్డు అందుకున్న గజ్జల శ్రీనివాసులు కు గడ్డం సత్యనారాయణ, గిలకత్తుల శ్రీనివాసు, బంధు, మిత్రులు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర తొలి శాసన సభ స్పీకర్ మధుసూదనాచారి, తెలంగాణ ఉద్యమకారులు, ప్రజా సంఘాల నేతలు, తదితరు పాల్గొన్నారు.

## భూ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం భూ భారతి ఒక మంచి వేదిక


- జిల్లా కలెక్టర్ నరసింహారెడ్డి

**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 30 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో రెవెన్యూ, భూ సంబంధిత సమస్యల పరిష్కారంకోసం భూ భారతి ఒక మంచి వేదికగా మారనుందని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి. నరసింహారెడ్డి పేర్కొన్నారు. శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ కార్యాలయం ఆవరణలో బుధవారం భూ భారతి పై నిర్వహించిన రెవెన్యూ సదస్సు కు రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికపూడి గాంధీ, శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వాలిదాసు జగదీశ్వర్ గౌడ్ తో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను దృష్టిలో ఉంచుకొని ధరణిని మార్పులు చేర్పులతో భూ భారతి చట్టాన్ని ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం తీసుకురావడం జరిగిందన్నారు. ప్రజలందరూ “భూభారతి” చట్టంపై అవగాహన పెంచుకోవాలని, అప్పుడే భూ సమస్యలకు పరి ష్కారం లభిస్తుందని జిల్లా కలెక్టర్ నర్సింహా రెడ్డి సూచించారు. భూ సమస్యలన్నీ డివిజన్, మండల స్థాయిలోనే పూర్తిస్థాయి పరిష్కారం లభించనుందని, ప్రస్తుత ప్రభుత్వం నిరుపేద ప్రజలను దృష్టిలో పెట్టుకొని వారి సమస్యలను సులువుగా అధిగమించడానికి భూ భారతి పోర్టల్ ను




అందుబాటులోకి తేవడంవల్ల ప్రధానంగా కాలయాపన, అనవసరమైన వృధా ఖర్చు తగ్గి వీలైనంత త్వరగా పరిష్కారం లభించడం ఖాయమన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలు భూ భారతి చట్టాన్ని పూర్తిగా అవగాహన చేసుకోవాలని, రెవెన్యూ అధికారులు విషయ విజ్ఞానాన్ని అందించనున్నందున ఎవరు అపోహలకు పోకుండా చట్టంపై అవగాహన పెంచుకుంటే ఒక్క రూపాయి కూడా అనవసరమైన అధిక చెల్లింపులు చేయకుండా సులువుగా సమస్యను పరిష్కరించుకోవచ్చు అన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న ఈ చక్కటి అవకాశాన్ని భూ యజమానులు అంతా వినియోగించుకొని లబ్ధిని పొందాలని కలెక్టర్ నరసింహారెడ్డి తదితరులు సూచించారు. భూ భారతి చట్టాన్ని ప్రవేశపెట్టడంలో కీలక భూమిక పోషించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి కలెక్టర్ నరసింహారెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం నుండి ప్రతి డివిజన్ పరిధిలో తహసిల్దార్ కార్యాలయం నుండి రెవెన్యూ అధికారులంతా రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేసి భూ భారతి చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. భూ భారతి చట్టంలో సాదా బైనామాలకు సైతం పరిష్కారం లభించనుందని, సుదీర్ఘకాలంగా సాదా బైనామా అర్జిదారులకు కొరకరాని కొయ్యగా మారిన ఈ సమస్య భూ భారతితో తీరినట్టేనన్నారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధి కార్పొరేటర్లు, నియోజకవర్గ కోఆర్డినేటర్ రఘునందన్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు అలీ, జాంగిర్, నాయకులు కట్ల శేఖర్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు సునీత ప్రభాకర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు సౌందర్య రాజన్, నాయకులు జావీద్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మానసహిల్స్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేత



**రాజేంద్రనగర్, ఏప్రిల్ 30 (జనం సాక్షి) :** ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపడితే ఎంతటి వారలైనా ఉపేక్షించేది లేదని రాజేంద్రనగర్ తహసీల్దార్ బొమ్మ రాములు పేర్కొన్నారు.బుధవారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బుద్వేల్ ప్రాంతంలోని మానస హిల్స్ లో అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు కూల్చివేశారు.




## రెస్టరంట్ రంగంలో ఉద్యోగాలు వెల్లువ

ప్రభుత్వం 'పరిశ్రమ' హోదా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను మంజూరు చేస్తే, రెస్టరంట్ రంగం..2028 నాటికి 1.50 కోట్ల ఉద్యోగాలను సృష్టించగలదని అంచనా..ప్రస్తుతం ఈ రంగంలో 85 లక్షల మంది పనిచేస్తున్నారు. ఈ విషయాన్ని నేషనల్ రెస్టరంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు 'జోరావర్ కల్రా' బుధవారం తెలిపారు. దేశవ్యాప్తంగా 5 లక్షల రెస్టరంట్లకు ప్రాతినిధ్యం వహిస్తుందని ఆయన అన్నారు. స్విగ్గీ, జొమాటో వంటి ఫుడ్ డెలివరీ అగ్రిగేటర్లు వారి సొంత ప్రైవేట్-లేబుల్ బ్రాండ్‌లతో త్వరిత-వాణిజ్య రంగంలోకి ప్రవేశించడంపై రెస్టరంట్ల పరిశ్రమ విభేదిస్తోందని ఆయన తెలిపారు. ఈ చర్య న్యాయమైన పోటీని దెబ్బతీస్తుందని, స్వతంత్ర రెస్టరంట్లకు హాని కలిగిస్తుందని వాదిస్తోంది. ఆహార బిల్లులపై తప్పనిసరిగా సర్వీస్ ఛార్జీని విధించడాన్ని వ్యతిరేకిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ ఫెడరేషన్ ఆఫ్ హోటల్ అండ్ రెస్టరంట్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియాతో సహా రెస్టరంట్ సంస్థల పిటిషన్లను మే 9న విచారించడానికి దిల్లీ హైకోర్టు నిర్ణయించింది.

## మైక్రోసాఫ్ట్‌లో కోడింగ్ ఏఐ 30%

**• సత్య నాదెళ్ల**

ప్రముఖ టెక్ సంస్థ మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్యనాదెళ్ల కృత్రిమ మేధ వినియోగంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తమ కంపెనీకి సంబంధించి 30 శాతం కోడింగ్‌ను కృత్రిమ మేధ సాయంతోనే రాస్తున్నట్లు వెల్లడించారు.తాజాగా మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్‌తో జరిపిన సంభాషణలో ఈ విషయాన్ని వెల్లడించారు.మంగళవారం కాలిఫోర్నియాలోని మెన్లో పార్క్‌లో నిర్వహించిన మెటా లామా ఏఐ డెవలపర్ కార్యక్రమంలో పాల్గొన్న నాదెళ్ల ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ గురించి మాట్లాడారు. కంపెనీకి సంబంధించి 20 నుంచి 30 శాతం కోడ్‌ను కృత్రిమ మేధతోనే రూపొందిస్తున్నట్లు తెలిపారు. నాణ్యత కోసం ఏఐ ఆధారిత టూల్స్‌పై ఆధారపడటం పెరుగుతోందన్నారు. క్రమంగా వీటి వినియోగం అధికమవుతోందన్నారు. మెటా లామా మోడల్‌పై మాట్లాడిన జుకర్‌బర్గ్.. త్వరలో మరిన్ని ఏఐ మోడళ్లను అందుబాటులోకి తేనున్నట్లు తెలిపారు.ఇదిలాఉండగా.. గూగుల్ తన సాఫ్ట్‌వేర్ కోడ్‌ను రూపొందించడానికి కృత్రిమ మేధపై ఎక్కువగా ఆధారపడుతోందని కంపెనీ సీఈఓ సుందర్ పిచాయ్ ఇప్పటికే వెల్లడించారు. జనరేట్ చేసిన కోడ్‌ను ఇంజినీర్లు రివ్యూ చేస్తున్నప్పటికీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం పెరిగిందన్నారు. ఏఐ సాయంతో కోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయడం ద్వారా.. సమయాన్ని తగ్గించి, ఆవిష్కరణల విషయంలో వేగం పెంచడమే సంస్థ లక్ష్యమని వెల్లడించారు.

## స్వల్ప నష్టాల్లో మార్కెట్లు



**ముంబయి:** దేశీయ మార్కెట్లు బుధవారం స్వల్ప నష్టాలను చవిచూశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు ఉన్నప్పటికీ.. భారత్-పాక్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు సూచీలపై ప్రభావం చూపించాయి. మదుపర్లు ఆచితూచి వ్యవహరించడంతో ట్రేడింగ్ ఆద్యంతం సూచీలు తీవ్ర ఊగిసలాటకు గురై చివరకు స్వల్పంగా నష్టపోయాయి.ఈ ఉదయం 80,370 పాయింట్ల వద్ద ఉత్సాహంగానే ప్రారంభమైన సెన్సెక్స్ ఆరంభంలో కాసేపు లాభాల్లో పయనించింది. ఇంట్రాడేలో 80,525.61 గరిష్ఠ స్థాయిని తాకింది. అయితే, ఆ జోరు ఎంతో సేపు కొనసాగలేదు. మదుపర్ల లాభాల స్వీకరణతో ఒత్తిడికి గురైన సూచీ.. ఒక దశలో 79,879 కనిష్ఠ స్థాయికి పడిపోయింది. చివరకు కాస్త తేరుకుని 46.14 పాయింట్ల స్వల్ప నష్టంతో 80,242.24 వద్ద ముగిసింది. అటు నిఫ్టీ కూడా అత్యల్పంగా 1.75 పాయింట్లు తగ్గి 24,334.20 వద్ద స్థిరపడింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 47 పైసలు పెరిగి 84.49గా కొనసాగుతోంది. నిఫ్టీలో మారుతి సుజుకీ, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, భారతీ ఎయిర్‌టెల్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు రాణించగా.. బజాజ్ ఫిన్‌సర్వ్, బజాజ్ ఫైనాన్స్, ట్రెంట్, టాటా మోటార్స్, ఎస్‌బీఐ షేర్లు ఒత్తిడికి గురయ్యాయి. రియల్టీ సూచీ 2 శాతం పెరగ్గా.. మీడియా, ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సూచీలు 2శాతం మేర కుంగాయి.

# కూల్.. కూల్.. ఆఫీస్




ఇందులో 66 శాతం వాటా హరిత కార్యాలయాలదే.. వచ్చే 3 ఏళ్లలో 70 కోట్ల చ.అ.కు గ్రీన్ ఆఫీస్ స్పేస్ క్రెడాయ్- కొలియర్స్ నివేదిక

కరోనా తర్వాత స్థిరాస్తి కొనుగోలుదారులలో మార్పులు వచ్చాయి. తినే తిండితో పాటు ఉండే ఇల్లు కూడా హైజీన్‌గా ఉండాలని భావిస్తున్నారు. దీంతో పర్యావరణహితమైన భవన నిర్మాణాలకు ఆదరణ పెరిగింది. ఈ గ్రీనరీ కేవలం ఇళ్లకే కాదు పనిచేసే ఆఫీసులూ హరితంగానే ఉండాలని భావిస్తున్నారు. దీంతో ఉద్యోగస్తుల అభిరుచులకు తగ్గట్టుగానే యాజమాన్యాలు కూడా గ్రీన్ స్పేస్ ఆఫీసులకే ప్రాధాన్యత ఇస్తున్నాయని క్రెడాయ్- కొలియర్స్ నివేదిక వెల్లడించింది. కరోనా తర్వాతి నుంచి బహుళ జాతి సంస్థలు ఇంధన సామర్థ్యం, కార్బన్ ఉద్గారాల తగ్గుదలతో పాటు ఉద్యోగుల శ్రేయస్సుకు ప్రాధాన్యత ఇస్తున్నాయి. దీంతో హరిత కార్యాలయాలకు ఆదరణ పెరుగుతుంది. 2010లో దేశంలోని ఆఫీసు స్పేస్ స్టాక్‌లో గ్రీన్ ఆఫీసు స్పేస్ వాటా 52 శాతంగా ఉండగా.. గత ఐదేళ్లలో ఏకంగా 80 శాతానికి పైగా చేరడమే ఇందుకు ఉదాహరణ. హరిత భవనాల అత్యధికంగా ఐటీ, బీఎఫ్‌ఎస్‌ఐ, హెల్త్‌కేర్ అండ్ ఫార్మా, ఇంజినీరింగ్ అండ్ మాన్యుఫాక్చరింగ్ సంస్థలు లీజుకు తీసుకుంటున్నాయి.డెవలపర్లు, పెట్టుబడిదారులు, కొనుగోలుదారులు గ్రీన్ సర్టిఫికెట్, ఇంధన సమర్థవంతమైన నిర్మాణాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. స్థిరమైన భవన పద్ధతులు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, సరళమైన నిబంధనలు గ్రీన్ బిల్డింగ్‌ల నిర్మాణానికి ప్రధాన కారణం. దీంతో గృహాలు, ఆఫీసులు, వాణిజ్య సముదాయాలు, గిడ్డంగులు, డేటా సెంటర్లు కూడా కార్బన్ ఉద్గారాల తగ్గించే భవన నిర్మాణానికే బిల్డర్లు మొగ్గు చూపిస్తున్నారు. ప్రస్తుతం దేశంలో హరిత భవనాలు 1,300 కోట్ల చ.అ.కు చేరాయని ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్(ఐజీబీసీ) తెలిపింది. గతేదాది ముగింపు నాటికి దేశంలో 21 లక్షలకు పైగా గృహాలు, 6,500 వాణిజ్య సముదాయాలు, 750 పారిశ్రామిక ప్రాజెక్ట్‌లు గ్రీన్ సర్టిఫికెట్‌ను పొందాయి.గ్రీన్ సర్టిఫికెట్ పొందిన ఆఫీసు భవనాలకు డిమాండ్ ఎక్కువగా ఉంది. వీటిల్లో ఆక్యుపెన్సీ లెవల్ 80-90 శాతం వరకు ఉంది. సాధారణ భవనాలలో పోలిస్తే గ్రీన్ ఆఫీసుల అద్దె 25 శాతం అధికంగా ఉంటుంది. దేశంలోని గ్రీన్ సర్టిఫైడ్ ఆఫీసు స్పేస్ స్టాక్‌లో 31 శాతం వాటాతో బెంగళూరు తొలి స్థానంలో నిలవగా.. ఢిల్లీ-ఎన్‌సీఆర్ 19 శాతం, హైదరాబాద్ 17 శాతంతో ఆ తర్వాతి స్థానాలలో నిలిచాయి. 2024 చివరి నాటికి 50.3 కోట్ల చ.అ. గ్రేడ్-ఏ ఆఫీసు స్పేస్ స్టాక్ ఉంది. వచ్చే 2-3 ఏళ్లలో 70 కోట్ల చ.అ.లకు చేరుతుందని అంచనా.దేశంలో పదేళ్లకు పైగా మించిన 35.5 నుంచి 38.5 కోట్ల చ.అ.లలో పాత భవనాలు ఉన్నాయి. వీటిని గ్రీన్ ఆఫీసులుగా పునరుద్ధరించడానికి 425 బిలియన్లకు పైగా పెట్టుబడులు అవసరం. అలాగే పదేళ్లలోపు 8 నుంచి 11 కోట్ల చ.అ. పాత భవనాలు ఉన్నాయి. వీటి పునరుద్ధరణకు 22-32 బిలియన్లు అవసరం.

**మార్కెట్‌లోకి ఆఫీసు స్పేస్ సరఫరా..**

వచ్చే మూడేళ్లలో ఆరు ప్రధాన నగరాల్లో 17-20 కోట్ల చ.అ. ఆఫీసు స్పేస్ అందుబాటులోకి వస్తుందని అంచనా. అత్యధికంగా ఐటీ హబ్‌లైన బెంగళూరు, హైదరాబాద్‌లో సరఫరా రానుంది.

**ప్రయోజనాలివీ..**

ఏటా 6,430 యూనిట్ల విద్యుత్ ఆదా , సంవత్సరానికి 19,800 కోట్ల లీటర్ల నీరు ఆదా, వార్షికంగా 5.14 కోట్ల టన్నుల సీఓ-2 ఉద్గారాల తగ్గుదల,' ఏటా 25 లక్షల టన్నుల నిర్మాణ వ్యర్థాల పునర్వినియోగం,' ఇంట్లోకి ధారాళమైన గాలి, వెలుతురు, తక్కువ యూటిలిటీ బిల్లులు

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 4.25 | ₹ 4.27 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 89,750 (22 క్యారెట్లు) | ₹ 97,910 (24 క్యారెట్లు) |
|---|---|

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 1,09,000

## భారీ బ్యాటరీ, ఏఐతో మోటోరోలా ఎడ్జ్ 60 ప్రో

ప్రముఖ మొబైల్ ఫోన్ల తయారీ సంస్థ మోటోరోలా వరుస స్మార్ట్‌ఫోన్‌లను భారతీయ మార్కెట్‌లోకి విడుదల చేస్తోంది. ఇప్పటికే మోటోరోలా ఎడ్జ్ 60, మోటోరోలా ఎడ్జ్ 60 స్టైలస్ ఫోన్లను తీసుకొచ్చిన సంస్థ ఇప్పుడు ప్రీమియం ధరల శ్రేణిలో సరికొత్త ఫీచర్లతో మోటోరోలా ఎడ్జ్ 60ప్రోను విడుదల చేసింది. 6000 బ్యాటరీ, 50 మెగా పిక్సెల్ సెల్ఫీ కెమెరా, 4500 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్ సహా ఏఐ ఫీచర్లతో ఈ ఫోన్ వస్తోంది. మరి ఇందులో ఉన్న కీలక ఫీచర్లు, ధర, ఆఫర్లు ఏంటో తెలుసా?మోటోరోలా ఎడ్జ్ 60ప్రో 6.7 అంగుళాల 1.5% ప్యానల్, 120రీఫ్రెష్ రేటు కలిగిన డిస్‌ప్లేతో వస్తోంది. హెచ్‌డీఆర్10ను సపోర్ట్ చేస్తుంది. 4500 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్‌ను కలిగి ఉండటం విశేషం. ఎండలోనూ స్క్రీన్ ఎలాంటి ఇబ్బందిలేకుండా చూడొచ్చు. ఇక ఇందులో మీడియాటెక్ డైమెన్సిటీ 8350 ఎక్స్‌ట్రీమ్ ప్రాసెసర్‌ను ఉపయోగించారు. పదహారు 5జీ బ్యాండ్స్‌ను ఇది సపోర్ట్ చేస్తుంది. అవుటాఫ్‌ది ది బాక్స్ ఆండ్రాయిడ్ 15తో ఈ ఫోన్ పని చేస్తుంది. మూడేళ్ల పాటు ఓఎస్ అప్‌డేట్స్, నాలుగేళ్ల పాటు సెక్యూరిటీ అప్‌డేట్‌లు ఇస్తామని మోటోరోలా హామీ ఇస్తోంది.ఇక కెమెరాల విషయానికొస్తే వెనకవైపు 50 మెగాపిక్సెల్ మెయిన్ కెమెరా, 10 మెగాపిక్సెల్ టెలిఫొటోలెన్స్, 50 మెగాపిక్సెల్ అల్ట్రా వైడ్ యాంగిల్ కెమెరాలను ఇచ్చారు. అల్ట్రా వైడ్ యాంగిల్ కెమెరా మ్యాక్రో కెమెరాగానూ పనిచేస్తుంది. టెలి ఫొటోలెన్స్ కెమెరాను ఉపయోగించి, 3ఎక్స్ వరకూ ఆప్టికల్ జూమ్, 50ఎక్స్ వరకూ సూపర్ జూమ్‌తో ఫొటోలను తీయొచ్చు. ఇక సెల్ఫీల కోసం ముందువైపు 50 మెగాపిక్సెల్ కెమెరాను ఇచ్చారు.



# 'సింధూ'పై పాకిస్తాన్ ఆశలు వదులుకోవాల్సిందేనా?

### పలు పరిష్కార మార్గాలు అన్వేషిస్తున్న దాయాది దేశం

పహల్గాంలో అమాయకులపై ఉగ్రదాడి తర్వాత భారత్ తీవ్రంగా స్పందించింది. పాక్‌తో సింధూ జలాల ఒప్పందాన్ని నిలిపివేసింది. ఈ చర్యలను ఏమాత్రం ఊహించని పాక్ షాక్‌కు గురైంది. 1960లో ఈ ఒప్పందంపై సంతకాలు జరగ్గా.. 1965, 71, 99ల్లో యుద్ధాలు, సైనిక ఘర్షణలు చోటుచేసుకొన్నాయి. అయినా భారత్ ఈ ఒప్పందంలో కొనసాగింది. కానీ తాజా చర్యలతో పాక్‌లో ఆందోళన నెలకొంది. ఈ జలాలను మళ్లించడం లేదా ఆపడం చేస్తే.. దాన్ని యుద్ధానికి కవ్వింపు చర్యగా పరిగణిస్తామంటూ బీరాలు పలుకుతోంది. భారత్ నిర్ణయంతో పాకిస్థాన్ ఎదుట ఇప్పుడు ఆప్షన్లు పరిమితంగానే ఉన్నాయి. తాజాగా దీనిపై ఆ దేశ న్యాయశాఖ మంత్రి అకిల్ మాలిక్ స్పందించారు. న్యాయపోరాటం చేసేందుకు మూడు ఆప్షన్లను పరిశీలిస్తున్నట్లు ఓ ఆంగ్ల వార్తా సంస్థకు వెల్లడించారు. ఈ ఒప్పందం కుదిర్చిన ప్రపంచ బ్యాంకు వద్దకు కూడా వెళ్లే అంశం కూడా దానిలో ఉందని పేర్కొన్నారు.తొలుత భారత్ నిర్ణయాన్ని పర్మినెంట్ కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ లేదా అంతర్జాతీయ న్యాయస్థానం (హేగ్)లోకి తీసుకెళ్లాలని భావిస్తోంది. దీనికి భారత్ అంతర్జాతీయ ఒప్పందాలకు సంబంధించిన వియన్నా ఒడంబడికను ఉల్లంఘించినట్లు సాకు చెప్పవచ్చు. న్యాయ వ్యూహంపై ఇప్పటికే చర్చలు దాదాపు పూర్తయ్యాయని పాక్ మంత్రి మాలిక్ వెల్లడించారు. త్వరలోనే ఏ కేసులు దాఖలు చేయాలనే దానిపై నిర్ణయానికి వస్తామన్నారు.ఇక మరో ఆప్షన్ కింద.. దౌత్యపరంగా ఈ అంశాన్ని ఐరాస భద్రతా మండలిలో లేవనెత్తే అవకాశం ఉందని మాలిక్ పేర్కొన్నారు. అన్ని బలమైన వేదికల పైకి ఈ అంశాన్ని తీసుకెళ్లే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. ఈ ఒప్పందం ఏకపక్షంగా నిలిపివేయడం ఏమాత్రం కుదరదని మాలిక్ వెల్లడించారు. అ ఒడంబడిక రద్దుకు సంబంధించి ఎటువంటి క్లాజ్ లేదని పేర్కొన్నారు.అంతర్జాతీయ న్యాయస్థానం ఎదుటకు పాక్ వెళ్లే అవకాశాలు దాదాపుగా లేవు. ఎందుకంటే ఐసీజే పరిధిలోకి వెళ్లాలంటే.. ఆయా దేశాల అంగీకారం తప్పనిసరి. ఇది పూర్తి లేదా పరిమిత అంగీకారం కావచ్చు.



ఇందుకు ఆ దేశం తీర్మానం చేయాల్సి ఉంటుంది.అంతర్జాతీయ నియమ నిబంధనల క్రమాన్ని పాటించే భారత్.. ఈ అంశాలకు సంబంధించి ఐసీజే చట్టపరిధికి కట్టుబడి ఉంటామని ఆమోదిస్తూ 27 సెప్టెంబర్ 2019లో డిక్లరేషన్ ఇచ్చింది కానీ, దీనికి 13 మినహాయింపులను తీసుకొంది. ఈమేరకు మన విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ ఆ డిక్లరేషన్‌పై సంతకం చేశారు.13 మినహాయింపుల్లోనే ఓ మెలిక ఉంది. కామన్‌వెల్త్ గ్రూపులోని దేశాలతో వివాదాలు ఏర్పడితే మాత్రం.. అవి ఐసీజే పరిధిలోకి రావని నాడు పేర్కొంది. పాకిస్థాన్‌కు కామన్‌వెల్త్‌లో సభ్యత్వం ఉంది. దీంతో ఆ దేశంతో వివాదం ఐసీజే పరిధిలోకి రాదు. ఇస్లామాబాద్ ఆ దిశగా చేసే ప్రయత్నాలు వృథా అవుతాయి. దీనికితోడు సాయుధ ఘర్షణలు, ఆత్మరక్షణ కోసం సమష్టి చర్యలు తీసుకొనే వేళ, దౌర్జన్యాలను అడ్డుకొనేటప్పుడు, తప్పనిసరిగా పూర్తి చేయాల్సిన బాధ్యతలు వంటి పలు అంశాల్లో కూడా ఐసీజే పరిధి చెల్లదని వెల్లడించింది. దీంతో పాక్ అంతర్జాతీయ న్యాయస్థానానికి వెళ్లినా ఒరిగేది ఏమీ ఉండదు.భారత్-పాక్ మధ్య సింధూ జలాల ఒప్పందాన్ని మధ్యవర్తిగా వ్యవహరించి కుదిర్చిందే ప్రపంచ బ్యాంక్. కానీ, దానికి చట్టబద్ధమైన పాత్ర ఏమీ లేదు. అంతేకానీ ఒప్పందాన్ని అమలుచేసే అధికారం లేదు. ఏమైనా అభిప్రాయభేదాలు వస్తే.. చర్చలకు మాత్రమే ప్రోత్సహించగలదు. తటస్థ నిపుణుల నియామకం, కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఛైర్మన్లను నియమించడం వరకే దాని పాత్ర పరిమితం. లేకపోతే.. వివాద పరిష్కార వ్యవస్థను ప్రపంచ బ్యాంక్ ఏర్పాటుచేసే అవకాశం ఉంది. కానీ, సూచనలు, సిఫార్సులకు భారత్ కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదు.




## జాతీయ భద్రతా సలహా బోర్డు ఛైర్మన్‌గా అలోక్ జోషి

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. తాజాగా జాతీయ భద్రతా సలహా బోర్డును పునర్‌వ్యవస్థీకరించింది.అలాగే 'రా' మాజీ చీఫ్ అలోక్ జోషిని ఆ బోర్డు ఛైర్మన్‌గా నియమించింది. ఈ ఘటన వేళ ఈ నియామకం జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఆయనతో పాటు ఆరుగురు సభ్యులు ఉన్నారు.భారత సైన్యంలో పనిచేసిన మాజీ అధికారులు ఎయిర్ మార్షల్ పీఎం సిన్హా, లెఫ్టినెంట్ జనరల్ ఏకే సింగ్, అడ్మిరల్ మోంటీ ఖన్నా, మాజీ ఐపీఎస్‌లు రాజీవ్ రంజన్ వర్మ, మన్మోహన్ సింగ్, మాజీ ఐఎఫ్‌ఎస్ బి.వెంకటేశ్ వర్మ సభ్యులుగా ఉన్నారు. భద్రతా వ్యవహారాలపై క్యాబినెట్ కమిటీ భేటీలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో పాటు రాజకీయ, ఆర్థిక వ్యవహారాలపై క్యాబినెట్ కమిటీ సమావేశాలు కూడా జరిగాయి.ఇదిలా ఉంటే.. పహల్గాం ఉగ్రదాడికి ప్రతిస్పందనపై నిర్ణయం భద్రతా బలగాలదే అని నిన్న జరిగిన అత్యున్నత స్థాయి సమావేశంలో ప్రధాని మోదీ స్వేచ్ఛ ఇచ్చారు.

## రష్యా విక్టరీ డే వేడుకలకు మోదీ దూరం

ప్రధానమంత్రి మోదీ రష్యా పర్యటన రద్దయ్యింది. మే నెలలో రష్యా నిర్వహించనున్న విక్టరీ డే వేడుకల్లో ప్రధాని మోదీ పాల్గొనడం లేదని వెల్లడైంది.ఈ విషయాన్ని రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ ప్రకటించింది. భారత్-పాక్ సరిహద్దులో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ మాస్కో పర్యటనకు మోదీ వెళ్లడం లేదని తెలుస్తోంది.రెండో ప్రపంచ యుద్ధంలో నాజీ జర్మనీపై విజయానికి గుర్తుగా విక్టరీ డే పేరుతో రష్యా ఏటా వేడుకలు జరుపుతుంది. మాస్కోలోని రెడ్ స్క్వేర్‌లో మే 9న భారీ స్థాయిలో సైనిక కవాతు నిర్వహిస్తారు. 80వ వార్షికోత్సవం సందర్భంగా ఈసారి మిత్ర దేశాధినేతలను పుతిన్ ఆహ్వానించారు. ఇందులో భాగంగా ప్రధానమంత్రి మోదీకి ఆహ్వానం అందింది. ఈ వేడుకల్లో పాల్గొననున్నట్లు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే.



## పీవోకేను స్వాధీనం చేసుకోవడమే ఏకైక పరిష్కారం..



### భారత్‌కు బ్రిటిష్ ఎంపీ సూచన

పహల్గాం ఉగ్రదాడిని దేశ ప్రజలంతా ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. ఈ విషయంపై తాజాగా భారత సంతతికి చెందిన బ్రిటిష్ ఎంపీ లార్డ్ మేఘనాథ్ దేశాయ్ స్పందించారు.కశ్మీర్ వివాదాన్ని పూర్తిగా రూపుమాపాలంటే పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని భారత ప్రభుత్వానికి సూచించారు. అదొక్కటే అన్ని సమస్యలకు పరిష్కారమన్నారు. ఉగ్రవాదులను శిక్షించడానికి, ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ఉండాలంటే.. భారత్ కఠినంగా జవాబివ్వాలని కోరారు.పీఓకే ఎప్పటికీ భారత్‌దే అని మేఘనాథ్ దేశాయ్ అన్నారు. పహల్గాంలో పర్యాటకులపై జరిగిన దాడి చాలా క్రూరమైనదని ఆవేదన వ్యక్తంచేశారు. కశ్మీర్ వివాదంలో ఈ ఘటనే చివరిది కావాలని ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ విషయంలో మోదీ నేతృత్వంలోని భారత ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని తాను నమ్ముతున్నానని అన్నారు. కశ్మీర్‌లో ఉన్న సమస్యల్ని శాశ్వతంగా పరిష్కరిస్తానని ప్రధాని ఇప్పటికే పలుమార్లు చెప్పారని గుర్తు చేశారు.నేరస్థులకు కఠిన శిక్ష విధించాలని తాము భారత్‌ను కోరుతున్నట్లు బ్రిటన్ విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ పేర్కొంది. తాము ఎప్పటికీ అండగా ఉంటామని తెలిపింది. పహల్గాం ఘటనకు వ్యతిరేకంగా ఇటీవల లండన్‌లో భారతీయులు నిరసన చేపడుతున్న సమయంలో అక్కడి పాకిస్థాన్ హైకమిషన్ అధికారి వారిని బెదిరిస్తున్నట్లు ఉన్న వీడియో తమను ఆందోళనకు గురి చేసిందని తెలిపింది. దీనిపై విచారణ జరుపుతున్నామని వెల్లడించింది. ఇరుదేశాలతో తమకు సత్సంబంధాలు ఉన్నందున వారి మధ్య ఉద్రిక్తతలు చెలరేగాలని తాము కోరుకోవట్లేదని పేర్కొంది. కశ్మీర్ ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడాన్ని భారత్-పాక్ తమ బాధ్యతగా భావించాలని సూచించింది.

## పాక్‌ప్రభుత్వ సెక్యూరిటీలో.. హాఫీజ్ హాయిగా..


### ఇంటి కింద బంకర్..

### హాఫీజ్ సయీద్ నివాసం ఇలా..!

పహల్గాంలో పర్యాటకులపై జరిపిన పాశవిక దాడి వెనక లష్కరే తోయిబా హస్తం ఉన్నట్లు ఇప్పటికే పలు కథనాలు వెలువడ్డాయి. ఈ దాడికి పాల్పడింది 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్)' ముష్కరులే అయినా..దీనికి కర్త, కర్మ, క్రియ మాత్రం లష్కరే తోయిబా చీఫ్, భారత మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది హాఫీజ్ సయీద్ అని నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. ఈ పరిణామాల వేళ హాఫీజ్‌కు సంబంధించి ఓ సంచలన వార్త వెలుగులోకి వచ్చింది. అతడు పాక్‌లో ప్రభుత్వ భద్రత మధ్య బహిరంగంగా జీవిస్తున్నట్లు తెలుస్తోంది. ఈమేరకు ఓ ఆంగ్ల మీడియా తమ కథనంలో వెల్లడించింది.సాధారణంగా ఉగ్ర నాయకులు ఎవరికీ తెలియని రహస్య ప్రదేశాల్లో దాక్కుని.. అక్కడినుంచే తమ కార్యకలాపాలకు సంబంధించి ఆదేశాలిస్తుంటారు. కానీ, హాఫీజ్ సయీద్ జీవనం మాత్రం ఇందుకు భిన్నంగా ఉన్నట్లు తెలుస్తోంది. అతడు లాహోర్‌లోని జోరమ్ తౌమ్ అనే అత్యంత రద్దీ ప్రాంతంలో సామాన్యపౌరులతో కలిసి నివసిస్తున్నట్లు సమాచారం. హాఫీజ్ నివాసం వద్ద పాక్ ప్రభుత్వానికి చెందిన సెక్యూరిటీ సిబ్బంది నిరంతరం భద్రత కల్పిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ



భవనంలో హాఫీజ్ తన కుటుంబంతో పాటు నివసిస్తున్నారట. ఇంటిముందు ఓ ప్రైవేటు పార్క్, పక్కనే మసీదు, మదర్సా కూడా ఉన్నట్లు సమాచారం. భవనం కింద ఓ బంకర్ కూడా ఉందని సదరు కథనం పేర్కొంది.హాఫీజ్ సయీద్ పాక్‌లో బహిరంగంగా తిరుగుతున్నట్లు గత కొంతకాలంగా కథనాలు వస్తూనే ఉన్నాయి. కానీ, ఆ దేశ ప్రభుత్వం మాత్రం వాటిని తోసిపుచ్చుతూనే ఉంది. ఉగ్ర సంస్థకు నిధులు సమకూర్చి కేసులో అతడికి 31 ఏళ్ల జైలు శిక్ష పడిందని, అతడు జైల్లోనే ఉన్నాడని బుకాయిస్తోంది. 2019లో హాఫీజ్ అరెస్టయినట్లు కథనాలు వచ్చాయి. ఆ మధ్య హాఫీజ్ అనుచరులు, లష్కరే ఉగ్రవాదుల వరుస హత్యలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఆ పరిణామాలతో అతడికి పాకిస్థాన్ భద్రత పెంచినట్లు తెలుస్తోంది. అతడి ఇంటినే సబ్‌జైలుగా మార్చినట్లు వార్తలు వినిపించాయి.2008 నవంబరు 26న దేశ వాణిజ్య రాజధాని ముంబయిలో ఉగ్రమూకలు మారణహోమం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనతో పాటు మరెన్నో ఉగ్ర దాడుల్లో హాఫీజ్ సయీద్ కీలక సూత్రధారిగా ఉన్నాడు. భారత్‌లో మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదుల్లో ఒకడైన సయీద్‌ను.. ఐక్యరాజ్య సమితి కూడా అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించింది. అతడి తలపై అమెరికా 10 మిలియన్ డాలర్ల రివార్డ్ ప్రకటించింది.



# 40 కేజీల బస్తాకు 2 కిలోలు అదనంగా తూకం

**మంచిర్యాల ప్రతినిధి ఏప్రిల్ 30 (జనంసాక్షి)**



**క్వింటాల్‌కు 5 కిలోల చొప్పున రైతుల శ్రమను దోపిడీ**

**వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన మంచిర్యాల మాజీ**

ఆరుగాలం కష్టపడి రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో 40 కేజీల బస్తాకు 2 కిలోలు, క్వింటాల్‌కు 5 కిలోల చొప్పున ధాన్యాన్ని అదనంగా తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం రైతుల శ్రమను దోపిడీ చేస్తుందని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్ పేర్కొన్నారు. బుధవారం నాడు మంచిర్యాల జిల్లాలోని లక్షెట్టిపేట మండలం గుల్లకోట గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బిఆర్ఎస్ నాయకులతో కలిసి మంచిర్యాల మాజీ శాసనసభ్యులు నడిపెల్లి దివాకర్ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు మాట్లాడుతూ .. రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి కట్టింగ్ లేకుండా వరి ధాన్యం కొనుగోలు చేస్తున్నామని చెబుతున్న మాటలకు కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న దానికి ఎలాంటి పొంతన లేదని పేర్కొన్నారు .కొనుగోలు కేంద్రంలో మాత్రం ప్రతి 40 కేజీల బస్తకు రెండు కేజీలు అదనంగా కాంటా వేసి రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం దోచుకుంటుందని ఆరోపించారు. దీని పై ప్రభుత్వం వెంటనే స్పందించి ఎలాంటి కటింగు లేకుండా, ఎలాంటి షరతులు లేకుండా రైతులు దగ్గర నుంచి మరి ధాన్యం కొనుగోలు చేసి రైతులకు అండగా ఉండాలని వారు డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు తరుగు పేరిట మంచిర్యాల నియోజకవర్గంలో అక్రమాలు చేస్తున్నారని, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు చేసిన ఆరోపణలు చేయడమే కాకుండా సిట్టింగ్ జడ్జ్ తో విచారణ జరిపిస్తామని చెప్పి ఇప్పటికే చాలా నెలలు అవుతుందని అన్నారు . వెంటనే గత బిఆర్ఎస్ హయాంలో 10 సంవత్సరాలలో జరిగిన వరి ధాన్యం కొనుగోలు పైన, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన

తర్వాత జరుగుతున్న వరిధాన్యం కొనుగోలు అక్రమాలపైన వెంటనే సిట్టింగ్ జడ్జ్ తో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు..ఈ కార్యక్రమంలో DCMS మాజీ చైర్మన్ తిప్పని లింగయ్య గుల్లకోట మాజీ సర్పంచ్ గొల్ల రవీందర్ , బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జనాభా లెక్కలతో పాటు కులగణన హర్షనీయం

**ఫలించిన బీఆర్ఎస్ పోరాటం: ఎంపీ రవిచంద్ర**

**ఇది బీసీల విజయం: ఎంపీ రవిచంద్ర**

**ఖమ్మం (జనంసాక్షి) :**



దేశంలో జనాభా లెక్కల సేకరణ సందర్భంలో కులగణనను కూడా చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడాన్ని హృదయపూర్వకంగా స్వాగతిస్తున్న: ఎంపీ రవిచంద్రదేశవ్యాప్తంగా జనాభా లెక్కలను సేకరించేటప్పుడు,దాంతో పాటుగా కులాల గణనను కూడా చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడాన్ని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర హృదయపూర్వకంగా స్వాగతించారు. ఇది బీఆర్ఎస్ విజయమని,బీసీల ఐకమత్యానికి ఒక ప్రబల నిదర్శనమని వ్యాఖ్యానించారు. అనాదిగా అన్ని రంగాలలో తీవ్ర అన్యాయాలకు, అణిచివేతకు గురవుతున్న బీసీల పక్షాన బీఆర్ఎస్ నిలబడి పోరాటాలు చేసిన ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం దిగొచ్చి ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. తమిళనాడులో బీసీల సంక్షేమం, అభ్యున్నతికి అమలవుతున్న కార్యక్రమాలు,పథకాలను బీఆర్ఎస్ ప్రతినిధి బృందం ఆ రాష్ట్రంలో పర్యటించి అధ్యయనం చేయడాన్ని ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర గుర్తు చేశారు. తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన కులగణనలో చోటు చేసుకున్న తప్పిదాలను ఎండగడుతూ బీఆర్ఎస్ ఉద్యమించిందని ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42% రిజర్వేషన్స్ కల్పించి తీరాల్సిందేనన్న బీఆర్ఎస్ పోరాట ఫలితంగానే రేవంత్ రెడ్డి ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానించి కేంద్ర ప్రభుత్వానికి నివేదించడం జరిగిందని ఎంపీ రవిచంద్ర చెప్పారు. తమ పార్టీ బీఆర్ఎస్, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు మొదటి నుంచి కూడా అణగారిన వర్గాలకు కొండంత అండగా ఉంటున్న సందర్భాలను ఎంపీ రవిచంద్ర ప్రస్తావించారు. రాష్ట్ర ఏర్పాటు జరిగిన తొలినాళ్లలోనే ఎస్సీ రిజర్వేషన్స్ వర్గీకరణకు అనుకూలంగా ,చట్టసభలలో మహిళలు,బీసీలకు రిజర్వేషన్స్ కల్పించాలని కోరుతూ తీర్మానాలు చేసి కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయడమే కాక కేసీఆర్ స్వయంగా ప్రధాని నరేంద్రమోడీని కలిసి వినతిపత్రం అందించడాన్ని.. బీఆర్ఎస్ మంత్రులు, ఎంపీలు పలుమార్లు లేఖలు రాయడాన్ని ఎంపీ రవిచంద్ర గుర్తు చేశారు. అలాగే, ఢిల్లీ వేదికగా పలుమార్లు ధర్నాలు చేపట్టి,సభలు, సమావేశాలు నిర్వహించి ఓబీసీల ఐక్యతను దేశానికి చాటి చెప్పామని ఎంపీ వద్దిరాజు వివరించారు. కులగణన చేపట్టే సందర్భంగా ఎలాంటి పొరపాట్లు దొర్లకుండా,తప్పిదాలు జరుగకుండా పారదర్శకంగా, పకడ్బంధీగా నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఓబీసీలకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, చట్టసభలలో 33%, తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికలలో 42% రిజర్వేషన్స్ అమలునకు పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించాలని ఎంపీ రవిచంద్ర ప్రధాని నరేంద్రమోడీని కోరారు. అలాగే, తెలంగాణలో మంత్రివర్గ విస్తరణను వెంటనే చేపట్టి ఖాళీగా ఉన్న ఆరింటిలో నాలుగు పదవులను బీసీలకే కేటాయిస్తూ ప్రాధాన్యత శాఖలు కేటాయించాలని కాంగ్రెస్ పార్టీని ఎంపీ వద్దిరాజు డిమాండ్ చేశారు.

# వక్ఫ్ సవరణ చట్టంను రద్దు చేయాలి

**ముస్లిం మైనారిటీల హక్కుల సాధన కోసం ఆర్ పివి శాంతి ఉద్యమం**

**రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ కార్యక్రమానికి మద్దతు**

**భారీ మోటార్ సైకిల్ ర్యాలీ**

**ఖమ్మం (జనంసాక్షి)**



కేంద్ర ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు వ్యతిరేకంగా వక్ఫ్ సవరణ చట్టం 2025 ను తీసుకువచ్చి ముస్లింల హక్కులను కాల రాసిందనీ రాజ్యాంగ పరిరక్షణ వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు (ఆర్ పివి ఫౌండర్ ) సయ్యద్ సాధిక్ అలి ఆరోపించారు.. ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆదేశానుసారం వారికి మద్దతుగా తన నిరసనను తమ సంస్థ చేపట్టిందని అన్నారు.. ముస్లిం మైనార్టీల పట్ల వివక్షతను చూపుతూ ముస్లిం మైనార్టీలను విభజించి పాలించే నైజాన్ని కేంద్ర ప్రభుత్వం అనేక ఏళ్లుగా ప్రదర్శిస్తూ వస్తుందని ఆయన ఆరోపించారు. .ముస్లింల ఐక్యతను చాటుతూ.. మనమంతా హమ్ సబ్ ఏక్ హై... అంటూ.. ముస్లిం యువత పెద్ద ఎత్తున నినాదాలు చేశాయి.. కేంద్రం తీసుకు వచ్చిన నల్ల చట్టాలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ కార్యక్రమాలకు మద్దతుగాఖమ్మం నగరం లోని జడ్పీ సెంటర్ ప్రాంతంలో గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం సాక్షిగా శాంతియుత నినాదాలతో ఆ ప్రాంతం మార్మోగింది.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లి పాదాల కింద స్వర్గం ఉందని ఖురాన్ గ్రంథం చెబుతుందని, ఇంటికి దీపం ఇల్లాలు అనే నానుడి వున్న నేపద్యంలో మాతృమూర్తికి సేవలు, సతీమణి పట్ల బాధ్యతలే తెలియని వారికి భారత దేశంలో ఉన్న 140 కోట్ల ప్రజల బాధలు ఎలా తెలుస్తాయని ఆయన ప్రశ్నించారు. మతేతర రాజ్యంలో మంటలు రేపుతూ..ప్రతినిత్యం మతాల మధ్య చిచ్చు పెడుతూ.. విద్వేషాలను రెచ్చగొడుతూ కేంద్ర ప్రభుత్వం కక్షపూరిత ధోరణితో వ్యవహరిస్తూ.. రాజ్యాంగ వ్యతిరేక చట్టాలను తీసుకువచ్చి ముస్లిం మైనార్టీల పట్ల చిన్నచూపు చూస్తూ.. పైశాచిక ఆనందం పొందుతుందన ఆయన ఆరోపించారు.. ముస్లిం మైనార్టీల హక్కుల సాధన కోసం, నల్ల చట్టాల రద్దు కోసం ఖమ్మం జిల్లా కేంద్రం నుంచి ప్రారంభమైన తమ శాంతి మార్గ నిరసనను రాబోవు రోజుల్లో దేశ రాజధాని హస్తినలో గల జంతర్ మంతర్ ప్రాంతాన్ని ముట్టడించే వరకు విశ్రమించేది లేదని ఆయన హెచ్చరించారు.... వక్ఫ్ భూములు ఏ కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలకు చెందినవి కావని, భారతదేశానికి స్వాతంత్రానికి ముందు ఆనాటి రాజులు దేవుడు మాన్యాల కోసం పీర్ల చావిడి, దర్గా, మసీదు నిర్మాణాల కోసం దాతలు ఇచ్చిన భూములను లాక్కునే హక్కు కానీ, అందులో చైర్మన్, సభ్యుల పేర్ల ద్వారా పదవుల రంగ ప్రవేశం చేసే హక్కు కానీ ఏ ఒక్కరికి లేదని ఆయన విమర్శించారు..ఈ ర్యాలీ ఖమ్మం నగరంలో వరంగల్ క్రాస్ రోడ్స్ నుంచి ప్రారంభమైన మోటార్ సైకిల్ ర్యాలి కాల్వ ఒడ్డు, మయూరిసెంటర్ పాత ఎల్ ఐ సి మీదుగా జడ్పీ సెంటర్ లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జిలు, ప్లకార్డులు చేతబూని వక్ఫ్ సవరణ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు.. ఈ కార్యక్రమంలో పాలేరు నియోజకవర్గం బాధ్యులు డాక్టర్ నజీర్.. రూరల్ మండలం నాయకులు హుస్సేన్ ఇబ్రహీం సోను యాకూబ్ పాషా కుమార్ ఆరిఫ్ తండా హుసేన్ అన్వర్ అబ్దుల్ షాహిద్ షరీఫ్ మోను కాసిం కాజల్ భాష మదర్, 59వ డివిజన్ ఆయేషా సిద్ధికి దానవాయిగూడెం నాయకులు రంజాన్ ఇబ్రహీం ఇఫ్తి కార్ ఆసిఫ్ అఫ్సర్, నాయుడుపేట ప్రాంత నాయకులు ఇబ్రహీం ఖాన్ అబ్బాస్ సోందు అజార్ ఖాసిం, తిమ్మాపురం మండలం నాయకులు సయ్యద్ ద్ బషీర్ , అక్సర్, సుభాన్ , గౌస్మియా మీరా, సైదా మల్సూర్ , బాబు, షబ్బీర్, మీరా, బాబా, సైఫ్, పాల్గొన్నారు..



# పదవ తరగతి ఫలితాల్లో.. పారమిత విద్యార్థుల అత్యుత్తమ ప్రతిభ

**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 30 (జనంసాక్షి)**



: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పదవ తరగతి వార్షిక ఫలితాల్లో స్థానిక నగరంలోని పారమిత ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. ఈ ఫలితాలు కేవలం పారమితకు సంబంధించిన ఒకే పాఠశాలది. ఇట్టి ఫలితాలలో 577 మార్కు లతో రామోజుల సాయిశ్వర్, 573 మార్కులతో గంగిల సాన్విత్ రెడ్డి , 571 మార్కులతో ఉమ్మెంతుల మనస్విని, 570 మార్కులతో అగస్త్య మహావీర అత్యధిక మార్కులు సాధించారు. 550 ఆపైన మార్కులతో 39 మంది విద్యార్థులు, 500 మార్కులు ఆపైన 131 మంది విద్యార్థులు ఫలితాలు సాధించగా, 100% ఉత్తీర్ణతో పారమిత విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యా యులు సి.హెచ్. బాలాజీ తెలిపారు. పారమిత విద్యాసంస్థలలో నైపుణ్యాలకు పెద్దపీట వేసి ప్రస్తుత పోటీ ప్రపంచాన్ని తట్టుకునే విధంగా విద్యార్థులను అన్నిరంగాలలో తీర్చిదిద్దడం జరుగుతుంది. ఈ పద్దతిలో ఎక్కడా కూడా అధిక మార్కులు సాధించడానికి విద్యార్థులను బట్టి విధానానికి ప్రోత్సహించడం జరగదు. అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను పారమిత పాఠశాలల అధినేత డా? ఇ. ప్రసాద రావు, డైరెక్టర్లు ప్రసూన, అనుకర్ రావు, రశ్మిత, రాకేష్, ప్రాచీ, వినోదరావ్, వి.యు.ఎం. ప్రసాద్, టి.ఎస్వి. రమణ, హన్మంతరావు ప్రధానోపాధ్యాయులు బాలాజీ, ప్రశాంత్, కవిత ప్రసాద్, సమన్వయకర్త శ్రీనాథ్ మరియు ఉపాధ్యాయలు అభినందించారు. పాఠశాలకు ఉత్తమ సహకారాన్నందిచిన తల్లి తండ్రులకు చైర్మన్ డా. ఇనుగంటి ప్రసాద రావు కృతజ్ఞతలు తెలియజేశారు.

# వనపర్తి జిల్లాలో రూ. 193 కోట్ల అభివృద్ధి పనులు

**రాష్ట్ర మంత్రులు పొంగులేటి, జూపల్లి శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు**

**వనపర్తి బ్యూరో ఏప్రిల్ 30 (జనంసాక్షి)**



: వనపర్తి జిల్లాలో రూ. 193 కోట్ల అంచనా వ్యయంతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు, రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రారంభోత్సవాలు శంకుస్థాపనలు చేశారు. బుధవారం రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి తో కలిసి 193 కోట్ల అభివృద్ధి పనులకు, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. వనపర్తి జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాలలో 2259 చరపు గజాల్లో రూ. 8.50 కోట్లతో నిర్మించిన పి.జి విద్యార్థుల వసతి గృహాన్ని, 1002 చదరపు గజాల స్థలములో రూ. 4.00 కోట్లతో నిర్మించిన ప్రిన్సిపాల్, సిబ్బంది క్వార్టర్ భవనాలకు రిబ్బన్ కత్తిరించి ప్రారంభోత్సవం చేశారు. మండల అభివృద్ధి అధికారి కార్యాలయ సముదాయంలో రూ. 5.00 లక్షలతో ఏ విధంగా ఒక ఇల్లు నిర్మించవచ్చో ఇందిరమ్మ ప్రదర్శన ఇంటిని ప్రారంభోత్సవం చేశారు. అక్కడే రేవల్లి, శ్రీరంగాపూర్, ఎదుల మండల తహసిల్దార్ కార్యాలయాల భవనాలకు శంఖుస్థాపన చేశారు. ఒక్కో కార్యాలయ భవనానికి రూ. 32 లక్షలకు అంచనా ఖర్చు చేయనున్నారు. అదేవిధంగా ఎంపీలాడ్ నిధులు రూ. 1.20 కోట్ల వ్యయంతో నిర్మించనున్న సోషల్ వెల్ఫేర్ బాలికల వసతి గృహ భవనానికి శంఖుస్థాపన చేశారు. కే.డి.ఆర్. పాలిటెక్నిక్ కళాశాల వెనుక భాగంలో ఉన్న పాత భావాన్ని రూ. 69 లక్షల ఖర్చుతో పునర్వ్యవస్థీకరణ చేసిన కళాశాల విద్యార్థుల బాలుర వసతి గృహాన్ని రిబ్బన్ కత్తిరించి ప్రారంభోత్సవం చేశారు. వనపర్తి జిల్లా ప్రజలు, పిల్లలు ఉదయం సాయంత్రం పూట ఆహ్లాదకరంగా గడపటానికి రూ . 55 లక్షల వ్యయంతో డా. బి.ఆర్. అంబేద్కర్ (నల్ల చెరువు) చెరువు అభివృద్ధి, సుందరీకరణ పనులను ప్రారంభోత్సవం చేశారు. మైనా రిటీ సంక్షేమ శాఖ ద్వారా మైనారిటీ మహిళల స్వయం ఉపాధి కొరకు 200 కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా . జి. చిన్న రెడ్డి, నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి, జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి, జిల్లా ఎస్పీ రావుల గిరిధర్, వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి, దేవరకద్ర

శాసనసభ్యులు జి. మధుసూదన్ రెడ్డి, నాగర్ కర్నూల్ శాసన

సభ్యులు కూచు కుళ్ళ రాజేష్ రెడ్డి ,రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, డి.సి.సి.బి. అధ్యక్షుడు విష్ణు వర్ధన్ రెడ్డి, మైనారిటీ కార్పొరేషన్ అధ్యక్షుడు ఒబెదుల్లా కొత్వాల్, మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ , గ్రంథాలయ చైర్మన్ యుగంధర్, అదనపు కలెక్టర్ రెవెన్యూ జి వెంకటేశ్వర్లు, ఆర్డీఓ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

# బీసీ గురుకుల విద్యార్థుల ప్రభంజనం



**హైదరాబాద్ (జనంసాక్షి)**

**ఉత్తీర్ణత శాతం 97.79 , రెండో స్థానంలో బీసీ గురుకులాల సొసైటీ**

**17431 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 17046మంది ఉత్తీర్ణత**

**వందశాతం ఉత్తీర్ణత సాధించిన 143 పాఠశాలలు**

**విద్యార్థులను, సిబ్బందిని అభినందించిన బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కార్యదర్శి శ్రీధర్, ఎంజేపీ కార్యదర్శి బడుగు సైదులు**

రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు విడుదల చేసిన 2024-25 పదో తరగతి ఫలితాల్లో మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. 97.79 ఉత్తీర్ణత శాతంతో అత్యధిక శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించిన గురుకుల సొసైటీ లో రెండో స్థానంలో నిలిచారు. 17431 మంది విద్యార్థులు పరీక్ష రాయగా వారిలో 17046 మంది విద్యార్థులు పాస్ అయ్యారు. వారిలో 8177 మంది బాలురు, 8869 మంది బాలికలు ఉన్నారు. రాష్ట్ర సగటు ఉత్తీర్ణత శాతం కంటే అధిక ఉత్తీర్ణత సాధించిన బీసీ గురుకుల విద్యార్థులు తమ సత్తా చాటారు. ఖమ్మం జిల్లా దన్వాయి గూడెం బాలికల పాఠశాల విద్యార్థిని దుర్గా భవాని 593 మార్కులు సాధించి రికార్డు సృష్టించారు. కరీంనగర్ జిల్లా వేములవాడ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థిని ఏ. శివాని 590 మార్కులు సాధించగా 588 మార్కులు కె. శ్రావణి, 587 మార్కులు ఎర్రపహాడ్ బాలల పాఠశాల బి. రమేష్, 586 ఇ. అక్షయ( కరీంనగర్ ), కె.వీక్షిత శ్రావణి(వేములవాడ), పి. వినయ్(జాంగాం), జి. సంధ్య(గాంధీనగర్, జయశంకర్ భూపాల పల్లి) , 585 మార్కులు శ్రీజ(ఆదిల్బాబాద్), కె. ప్రవీణ(నిజామాబాద్) సాధించారు. 590 మార్కుల కంటె ఎక్కువ మార్కులు ఇద్దరు విద్యార్థులు సాధించగా, 580 కంటె ఎక్కువ మార్కులు 31మంది విద్యార్థులు సాధించారు. 216 విద్యార్థులు 570 మార్కుల కంటే ఎక్కువ మార్కులు సాధించగా, 560 మార్కుల కంటె ఎక్కువ మార్కులు 479 మంది విద్యార్థులు సాధించారు. 261 బీసీ గురుకుల పాఠశాలల్లో 143 పాఠశాలలు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించాయి. అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను, మంచి ఫలితాలు సాధించిన బోధనా సిబ్బందిని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కార్యదర్శి శ్రీధర్, మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి బి. సైదులు, ఐ ఎఫ్ ఎస్, సంయుక్త కార్యదర్శి తిరుపతి, మద్దిలేటి, శ్యాంప్రసాద్ లాల్ అభినందించారు.

# మొదటి సెమిస్టర్ ఫలితాలు విడుదల

**యస్.బి.ఐ.టి. అటానమస్ కళాశాల**

**ఖమ్మం జనం సాక్షి :**

స్థానిక యస్.బి.ఐ.టి. కళాశాలలో అటానమస్ బ్యాచ్కు సంబంధించిన బి.టెక్., ఎం.టెక్., ఎం.బి.ఏ. మరియు ఎం.సి.ఏ 2024-25 విద్యా సంవత్సరం మొదటి సెమిస్టర్ ఫలితాలను కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ, సెక్రటరి అండ్ కరస్పాండెంట్ డా.జి. ధాత్రి సంయుక్తంగా మంగళవారం విడుదల చేసారు. అటానమస్ హోదా దక్కించుకున్న మొదటి సంవత్సరమే అద్భుత ఫలితాలను సాధించుకోగలిగామని తెలియజేశారు. బి.టెక్, యమ్.బి.ఎ, ఎం.సి.ఎ, ఎం.టెక్ కోర్సులకు చెందిన ఫలితాలను కళాశాల పరీక్షా విభాగంలో మంగళవారం విడుదల చేసారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కృష్ణ మాట్లాడుతూ అటానమస్ హోదాను సాధించటమే కాక దానికి తగ్గ ప్రత్యేక కార్యాచరణను అవలంబించడం ద్వారా విజయాన్ని అందుకోగలిగామని తెలియజేసారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా. జి. ధాత్రి ఫలితాలను వెల్లడిస్తూ ఈ.సి.ఈ. కు చెందిన మధుష 10/10 యస్.జి.పి.ఎ సాధించినట్లు తెలిచజేసారు. సి.యస్.ఈ. (ఎఐ, యమ్ఎల్) కు చెందిన సభాఅబ్రిన్ కు 9.9, సి.యస్.ఈ (డేటా సైన్స్) కు చెందిన ఎ. బినేష్ కుమార్ కు 9.85, సి.యస్.ఈ.కు చెందిన ఎ. కావ్యశ్రీ కు 9.8 మరియు ఈ.ఈ.ఈ. కు చెందిన డి. ప్రశంషా కు 9.65 యస్.జి.పి.ఎ సాధించారని తెలియజేసారు. మొదటి సంవత్సరం అన్ని బి.టెక్ కోర్సులకు

గాను తమ కళాశాల 63.48 శాతం ఫలితాలను సాధించిందని కళాశాల ప్రిన్సిపాల్ డా.జి. రాజ్ కుమార్ తెలియజేసారు. వీటితో పాటు యమ్.సి.ఎ. 81.63. యమ్.బి.ఎ. 64.17 మరియు ఎం.టెక్ లో 55.56 శాతం ఉత్తీర్ణతను సాధించామని తెలియజేసారు. ఈ సందర్భంగా విజయాన్ని అందుకున్న విద్యార్థులను, అధ్యాపకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డా.ఎ.వి.వి. శివ ప్రసాద్, అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డా. జె. రవీంద్రబాబు, డా.యస్. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# అజారుద్దీన్ పేరును తొలగించొద్దు

## ఉప్పల్ స్టేడియం వ్యవహారంలో హెచ్‌సీఏకు హై కోర్టు కీలక ఆదేశాలు




ఉప్పల్ స్టేడియంలో నార్త్ స్టాండ్‌కు భారత మాజీ కెప్టెన్ మహ్మద్ అజారుద్దీన్ పేరును తొలగించవద్దని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌కు తెలంగాణ హై కోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ పూర్తయ్యే వరకు ఈ వ్యవహారంలో ఎలాంటి చర్యలు తీసుకోవద్దని సూచించింది. హైదరాబాద్‌లోని ఉప్పల్ క్రికెట్ స్టేడియంలోని నార్త్ స్టాండ్‌కు అజారుద్దీన్ పేరును తొలగించాలంటూ హెచ్‌సీఏ అంబుడ్సమన్ జస్టిస్ ఈశ్వరయ్య హెచ్‌సీఏకు ఆదేశాలు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ ఆదేశాల్ని సవాల్ చేస్తూ అజారుద్దీన్ తెలంగాణ హై కోర్ట్‌ను ఆశ్రయించాడు. దీనిపై విచారణ చేపట్టిన హై కోర్టు ఈ విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోవద్దంటూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణను వాయిదా వేసింది. హెచ్‌సీఏ ప్రెసిడెంట్‌గా ఉన్న సమయంలో అజారుద్దీన్.. ఉప్పల్ స్టేడియంలోని నార్త్ స్టాండ్‌కు తన పేరు పెట్టుకున్నాడు. అయితే ఈ నిర్ణయాన్ని అజారుద్దీన్ ఏకపక్షంగా తీసుకున్నాడని లార్డ్స్ క్రికెట్ క్లబ్ హెచ్‌సీఏ అంబుడ్స్‌మన్‌కు ఫిర్యాదు చేసింది. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన అంబుడ్సమన్ జస్టిస్ ఈశ్వరయ్య.. హెచ్‌సీఏ అధ్యక్షుడిగా అజారుద్దీన్ ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నట్లు గుర్తించారు. వెంటనే నార్త్ స్టాండ్ కు అజారుద్దీన్ పేరును తొలగించాలని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ను ఆదేశించారు. టికెట్లపై కూడా అజారుద్దీన్ స్టాండ్ అనే పేరు ఉండొద్దని తేల్చి చెప్పారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ అజారుద్దీన్ హైకోర్టును ఆశ్రయించారు. తాను భారత జట్టుకు ఆడానని, సారథ్యం కూడా వహించానని తెలిపారు. ఏకపక్షంగా నిర్ణయం తీసుకోలేదని తన వాదనను వినిపించారు. దాంతో హై కోర్ట్.. అంబుడ్స్‌మన్ తీర్పుపై మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అజారుద్దీన్ హయాంలో హెచ్‌సీఏలో భారీ మొత్తంలో నిధులు గోల్‌మాల్ జరిగినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణలో తేలింది. క్రికెట్ బాల్స్, బకెట్ కుర్చీలు, జిమ్ ఇక్విప్‌మెంట్ కొనుగోలు వ్యవహారంలో అజారుద్దీన్ ఆధ్వర్యంలోని హెచ్‌సీఏ పాలకవర్గ సభ్యులు చేసిన భారీ అవినీతి బయట పడింది. గత హెచ్‌సీఏ ఆఫీస్ బేరర్స్ క్విడ్ ప్రోకోకు పాల్పడ్డారని ఈడీ గుర్తించింది. 20 కోట్ల నిధుల దుర్వినియోగంపై ఏసీబీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఈడీ దర్యాప్తు చేపట్టింది. మార్కెట్ ధరకు మించి పలు కంపెనీలకు కాంట్రాక్ట్ కట్టబెట్టి అవినీతికి పాల్పడ్డారని ఈడీ విచారణలో తేలింది. ఈ అవినీతి దందాలో హెచ్‌సీఏ మాజీ ఉపాధ్యక్షుడు, కోశాధికారి సురేందర్ అగర్వాల్ కీలకంగా వ్యవహరించినట్లు ఈడీ ఓ ప్రకటనను విడుదల చేసింది.

# బ్యాటర్ల వైఫల్యంతోనే మ్యాచ్‌లో ఓడాం

**ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ అక్షర్ పటేల్**



తమ బ్యాటర్ల వైఫల్యంతోనే గెలిచే మ్యాచ్‌లో ఓటమిపాలయ్యామని ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ అక్షర్ పటేల్ అన్నాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా కోల్‌కతా నైట్‌రైడర్స్(కేకేఆర్)తో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా విఫలమైన ఢిల్లీ 14 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. ఈ మ్యాచ్ అనంతరం తమ ఓటమిపై స్పందించిన అక్షర్ పటేల్.. పవర్ ప్లేలో రాణించకపోవడం విజయవకాశాలను దెబ్బతీసిందన్నాడు. బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉన్న వికెట్‌పై తమ బ్యాటర్లు తేలిపోయారని చెప్పాడు. 'పవర్ ప్లేలో మేం సరిగ్గా లేదు. మా బ్యాటింగ్ కూడా సరిగ్గా లేదు. పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉన్నా.. మేం చాలా తేలిగ్గా వికెట్లు కోల్పోయాం. ఇలాంటి పిచ్‌లపై పవర్‌ప్లేలో మెరుగ్గా రాణించడం కీలకం. మా బౌలర్లు అద్భుతంగా బౌలింగ్ చేశారు. కానీ, బ్యాటింగ్ వైఫల్యం మా ఓటమిని శాసించింది. బౌలింగ్‌లోనూ 15-20 పరుగులు అదనంగా ఇచ్చాం. ఈ మ్యాచ్ సానుకూలాంశం ఏంటంటే.. పవర్ ప్లే తర్వాత కేకేఆర్ భారీ స్కోర్ చేయకుండా అడ్డుకున్నాం. బ్యాటింగ్‌లో ఇద్దరు ముగ్గురు బ్యాటర్లు రాణించి ఉంటే మ్యాచ్ మరింత ఉత్కంఠగా మారేది. విప్రజ్ బ్యాటింగ్ చేసే సమయంలో గెలుస్తామనే ఆశలు కలిగాయి. అషుతోష్ శర్మ రాణించి ఉంటే.. మా తొలి మ్యాచ్ తరహా ఫలితం పునరావృతమయ్యేది. ఫీల్డింగ్ చేస్తున్నప్పుడు నా వేలికి గాయమైంది. బంతిని ఆపే ప్రయత్నంలో ప్రాక్టీస్ పిచ్‌పై డైవ్ కొట్టడంతో చర్మం ఊడిపోయింది. బ్యాటింగ్ చేసేటప్పుడు బ్యాట్ హ్యాండిల్ ఆ ప్రదేశానికి తగలడంతో తీవ్ర నొప్పి వచ్చింది. మా తదుపరి మ్యాచ్‌కు 3-4 రోజుల విరామం ఉంది. ఆ మ్యాచ్‌లోపు కోలుకుంటానని ఆశిస్తున్నా.'అని అక్షర్ పటేల్ చెప్పుకొచ్చాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన కోల్‌కతా నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 204 పరుగుల భారీ స్కోర్ చేసింది. అంగ్‌క్రిష్ రఘువంశీ(32 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 44), రింకూ సింగ్(25 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 36) రాణించారు. ఢిల్లీ బౌలర్లలో మిచెల్ స్టార్క్ మూడు వికెట్లు తీయగా.. విప్రజ్ నిగమ్, అక్షర్ పటేల్ రెండేసి వికెట్లు పడగొట్టారు. అనంతరం ఢిల్లీ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 190 పరుగులు చేసింది. ఫాఫ్ డుప్లెసిస్(45 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లతో 62), అక్షర్ పటేల్(23 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లతో 43) రాణించినా ఆ జట్టుకు ఆశించిన ఫలితం దక్కలేదు. కేకేఆర్ బౌలర్లలో సునీల్ నరైన్ మూడు వికెట్లతో ఢిల్లీ పతనాన్ని శాసించాడు. వరుణ్ చక్రవర్తి(2/39) రెండు వికెట్లు తీయగా..అనుకూల్ రాయ్, వైభవ్ అరోరా చెరో వికెట్ తీసారు.



## దాహం.. దాహం !

ఎండలు మండిపోతుండటంతో జనం మధ్యాహ్నం వేళ బయటికి రావాలంటేనే జంకుతున్నారు. మరోవైపు మనుషులే కాదు..ఎండవేడికి మూగజీవాలు కూడా అల్లాడిపోతున్నాయి. చిత్రంలో ఓ కోడి ఇలా నల్లా నీటిని తాగుతూ దాహార్తి తీర్చుకుంటున్నది. ఈ దృశ్యం రాజోలి మండలంలోని తూర్పు గార్లపాడులో ఓ ఇంటి ముందు కనిపించగా 'జనంసాక్షి' క్లిక్ అనిపించింది.

- రాజోలి, ఏప్రిల్ 30 (జనంసాక్షి)

# ఫిల్ సాల్ట్‌పై కోహ్లీ ఫ్యాన్స్ ట్రోల్

పీఎల్ 2025లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) మంచి ప్రదర్శన చేస్తూ ముందుకెళ్తోంది. ఆడిన 10 మ్యాచుల్లో ఏడింటిలో గెలిచింది. పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉంది. అయితే ఆర్సీబీ ఇంత మంచి ప్రదర్శన చేయడానికి కారణం వాళ్ల ఓపెనర్లు. ఓవైపు విరాట్ కోహ్లీ యాంకర్ పాత్ర చేస్తుండగా, మరోవైపు ఫిల్ సాల్ట్ దూకుడుగా ఆడుతూ ఆకట్టుకుంటున్నాడు. అయితే తాజాగా అతడి విరాట్ కోహ్లీతో తనకున్న అనుబంధం గురించి మాట్లాడి విమర్శలకు గురయ్యాడు. కోహ్లీ అభిమానులు అతడిని తెగ ట్రోల్ చేస్తున్నారు. 'ఓ సారి నువ్వు ఐపీఎల్ లో ఫ్రెండ్స్ ఉండరు అని చెప్పావ్ కదా.. మరి నువ్వు ఇప్పుడు విరాట్ తో ఓపెనింగ్ చేస్తున్నావు కదా, మీరు ఫ్రెండ్సా కాదా?'... 'అవును మేం కొలిగ్స్' అని ఫిల్ సాల్ట్ సమాధానమిచ్చాడు. 'అంటే కోహ్లీ ఫ్రెండ్ కాదు, కేవలం కొలిగ్ అని చెబుతున్నావ్ అంతే కదా' అని హోస్ట్ తిరిగి అన్నాడు. ఆ వెంటనే 'నేను ఎవరెవరితో కలిసి క్రికెట్ ఆడానో వాళ్లంతా నా ఫ్రెండ్స్.

# కుల్దీప్, రింకూ 'చెంపదెబ్బ' కాంట్రవర్సీ..



ఐపీఎల్ అంటే ఉత్కంఠ మ్యాచ్‌లే కాదు, కాంట్రవర్సీలకు కేరాఫ్ అడ్రస్. ఈ నేపథ్యంలోనే ప్రస్తుత సీజన్‌లోనూ దిల్లీ క్యాపిటల్స్- కోల్‌కతా నైట్‌రైడర్స్ మ్యాచ్‌లో అనూహ్య ఘటన జరిగింది. ఈ మ్యాచ్ అనంతరం దిల్లీ ప్లేయర్ కుల్దీప్, కేకేఆర్ ఆటగాడు రింకూ సింగ్‌ను రెండుసార్లు చెంపపై కొట్టాడు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. కుల్దీప్ చర్యలపై నెటిజన్లు ఫైర్ అవుతున్నారు. ఇది క్రీడా స్ఫూర్తికి విరుద్ధం అని కామెంట్ చేస్తున్నారు. ఈ క్రమంలో దిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంచైజీ తాజాగా ఈ కాంట్రవర్సీకి చెక్ పెట్టింది. ఈ ఇద్దరూ కలిసి ఉన్న వీడియో ఒకటి షేర్ చేసింది. ఈ వీడియోలో రింకూ- కుల్దీప్ హార్ట్ సింబల్స్‌తో కెమెరాకు ఫోజు ఇస్తూ సరదాగా మాట్లాడుకుంటున్నారు. అంతేకాకుండా ఈ వీడియోకు ఓన్లీ ప్యార్ (ప్రేమ) అంటూ దిల్లీ క్యాపిటల్స్ క్యాప్షన్ కాసుకొచ్చింది. దీంతో నెటిజన్లు కూల్ అవుతున్నారు. మ్యాచ్ ముగిసిన తర్వాత కుల్దీప్- రింకూ సహా ఇతర ప్లేయర్లు కలిసి స్టేడియంలో మాట్లాడుకుంటున్నారు. అప్పటిదాకా నవ్వుతూ సరదాగా మాట్లాడిన కుల్దీప్ ఉన్నట్టుండి రింకూపై ఓ చెంప దెబ్బ వేశాడు. ఏం జరిగిందో తెలియని కోల్‌కతా ప్లేయర్ రింకూ ఆశ్చర్యానికి లోనయ్యాడు. అయినప్పటికీ ఈ విషయాన్ని తాను ఫన్నీగానే తీసుకున్నాడు. అయితే వెంటనే కుల్దీప్ మరోసారి కొట్టడం వల్ల రింకూ అసహనానికి లోనైనట్లు ఆ విడియోలో కన్పించింది. కాగా, మ్యాచ్ విషయాని కొస్తే కోల్‌కతా 14 పరుగుల తేడాతో నెగ్గింది. 205 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో దిల్లీ ఓవర్లన్నీ ఆడి 190-9 పరుగులకే పరిమితమైంది. డూప్లెసిస్ (62), అక్షర్ పటేల్ (43) రాణించారు. చివర్లో విప్రజ్ నిగమ్ (39) పోరాడినా ఫలితం దక్కలేదు. కేకేఆర్ బౌలర్లలో సునీల్ నరైన్ 3, వరుణ్ చక్రవర్తి 2, అనుకుల్ రాయ్, వైభవ్, రస్సెల్ తలో 1 వికెట్ దక్కించుకు న్నారు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన కోల్‌కతా 20 ఓవర్లలో 204-9 స్కోర్ చేసింది. రఘువంశీ (44), రింకూ సింగ్ (36) రాణించారు. గుర్బాజ్ (26), నరైన్ (27) వేగంగా ఆడారు.

# ఇంగ్లాండ్ పర్యటనకు బోర్డు ప్లాన్

## రజత్ పాటిదార్, కరుణ్ నాయర్‌లపై దృష్టి

ఐపీఎల్ 2025 ముగిసిన తర్వాత, టీం ఇండియా ఐదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ కోసం ఇంగ్లాండ్‌లో పర్యటిస్తుంది. భారత జట్టు ఇంగ్లాండ్ పర్యటనకు బీసీసీఐ సన్నాహాలు ప్రారంభించింది. ఐదు టెస్ట్‌ల సిరీస్, దానికి ముందు జరిగే ఇండియా 'ఎ' పర్యటన కోసం బోర్డు ఆటగాళ్ల పేర్లను సిద్ధం చేసింది. టైమ్స్ ఆఫ్ ఇండియా ప్రకారం, రోహిత్ శర్మ ఇండియా 'ఏ', టెస్ట్ జట్ల కోసం ఎంపిక చేసిన దాదాపు 35 మంది ఆటగాళ్ల షార్ట్‌లిస్ట్‌లో చోటు దక్కించుకున్నాడు. టెస్ట్ జట్టులో అతని స్థానం గురించి ఊహాగానాలు వినిపిస్తున్న సంగతి తెలిసిందే. ఇంత ముఖ్యమైన పర్యటనలో అతన్ని కెప్టెన్సీ నుంచి తొలగించడానికి జట్టు సిద్ధంగా ఉందో లేదో సెలెక్టర్లు, బోర్డు ఇప్పటికీ ఖచ్చితంగా చెప్పలేకపోతున్నట్లు తెలుస్తోంది. బోర్డు ఇంగ్లాండ్ పర్యటనను ప్లాన్ చేయడం ప్రారంభించింది. మే రెండవ వారం నాటికి సెలెక్టర్లు జట్లను ఎంపిక చేసే అవకాశం ఉంది. సెలెక్టర్లకు అతిపెద్ద తలనొప్పి ఏమిటంటే, 5 లేదా 6వ స్థానంలో స్థిరమైన మిడిల్ ఆర్డర్ టెస్ట్ బ్యాట్స్‌మన్‌ను కనుగొనడమే. ఈ స్థానానికి సెలెక్టర్లు రజత్ పాటిదార్, కరుణ్ నాయర్‌లను చూస్తున్నారంట. మే 25న ఐపీఎల్ ముగిసిన వారం తర్వాత ప్రారంభం కానున్న ఇండియా 'ఎ' సిరీస్‌లో వీరిద్దరినీ రంగంలోకి దింపే ఛాన్స్ ఉంది. ఆసక్తికరంగా, శ్రేయాస్ అయ్యర్, అక్షర్ పటేల్‌లను ఇంకా షార్ట్‌లిస్ట్‌లో చేర్చలేదంట.


# మరోసారి చిక్కుల్లో మనీశ్ సిసోడియా, సత్యేందర్ జైన్

## రూ.2వేల కోట్ల స్కామ్‌లో ఆప్ నేతలపై ఏసీబీ కేసు



**ఢిల్లీ :** పాఠశాల భవనాలు, తరగతి గదుల నిర్మాణాల్లో అవినీతికి పాల్పడ్డారంటూ దిల్లీలోని ఆమ్ ఆద్మీ పార్టీ నేతలపై ఏసీబీ కేసు నమోదు చేసింది. ఇందులో ఆప్ మాజీ మంత్రులు మనీశ్ సిసోడియా సత్యేందర్ జైన్‌లు ఉన్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆప్ ప్రభుత్వ హయాంలో సిసోదియా విద్యాశాఖ మంత్రిగా, సత్యందర్ జైన్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (పీడబ్ల్యూడీ) మంత్రిగా ఉన్నారు. వారి నేతృత్వంలో దిల్లీలో 12,748 పాఠశాల భవనాలు, తరగతి గదుల నిర్మాణం తలపెట్టారు. ఈ నిర్మాణంలో రూ.2వేల కోట్ల అక్రమాలు జరిగాయి. 34 మందికి దీని కాంట్రాక్టులు దక్కాయి. వారిలో చాలామందికి ఆప్‌తో దగ్గర సంబంధాలు ఉన్నట్లు తేలింది. నిర్ణీత గడువులోగా నిర్మాణాలు పూర్తికాకపోగా, భారీగా ఖర్చు చేశారు. తరగతి గదులను 30 సంవత్సరాలకు ఉండేలా కడితే.. వాటికి అయిన ఖర్చు మాత్రం 75ఏళ్లు ఉండేలా అయ్యింది. గడువు ప్రక్రియను పాటించకుండా కన్సల్టెంట్లు, ఆర్కిటెక్ట్‌లను నియమించుకోవడంతో దాదాపు ఐదు రెట్లు వ్యయం పెరిగిపోయింది. ఇటీవల సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) ఇచ్చిన నివేదికలో తరగతి గదుల నిర్మాణ ప్రాజెక్టులో అవకతవకలు జరిగాయని పేర్కొంది. కొత్త టెండర్లు తీసుకోకపో వడంతో ఈ ప్రాజెక్టు వ్యయం రూ.326 కోట్లు పెరిగిందని రిపోర్టులో తెలిపింది. సిసోదియా, జైన్‌లను విచారించేందుకు మార్చి లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలపడంతో తాజాగా వీరిపై కేసు నమోదైంది.

# యూఎస్‌లో ఇద్దరు భారతీయ విద్యార్థుల అరెస్టు



**న్యూయార్క్:** అమెరికాలో ఇద్దరు భారతీయ విద్యార్థులపై మనీలాండరింగ్ కేసు నమోదు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. విద్యార్థి వీసాపై యూఎస్‌కు వచ్చిన ఇద్దరు భారతీయ యువకులు వృద్ధులను లక్ష్యంగా చేసుకొని బెదిరింపులకు పాల్పడుతుండడంతో ఈ చర్యలు తీసుకున్నామన్నారు.
నిందితులను భారత్‌కు చెందిన 24 ఏళ్ల మహమ్మ దిల్వామ్ వహోరా, హజియాలి వహోరాలుగా గుర్తించినట్లు పేర్కొన్నారు. వారు చికాగోలోని ఈస్ట్-వెస్ట్ విశ్వవిద్యాలయంలో చదువుతున్నట్లు తెలిపారు. తనకు స్కామర్ల నుంచి ఫోన్ వచ్చిందని ఓ వృద్ధుడు పోలీసులను ఆశ్రయించాడని అధికారులు పేర్కొన్నారు. స్కామర్లు తమను ప్రభుత్వ ఏజెంట్లుగా చెప్పుకొని ఓ కేసు విషయంలో డబ్బులు ఇవ్వాలని బెదిరింపులకు పాల్పడ్డారని అతడు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో క్రిప్టోకరెన్సీ ద్వారా బంగారం కొనుగోలు చేసి వారికి ఇచ్చానని తెలిపారు. దీనిపై దర్యాప్తు చేస్తున్న అధికారులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. గతంలోనూ వీరు ఇదేవిధంగా పలువురు వృద్ధులను మోసం చేసినట్లు గుర్తించామన్నారు. స్కామర్లు వృద్ధులను లక్ష్యంగా చేసుకొని డబ్బులు దోచుకుంటున్న కేసులు తరచుగా నమోదవుతున్నాయని అధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వ ఏజెంట్లు, బ్యాంక్ అధికారులు, ఐటీ నిపుణులుగా పేర్కొంటూ తమపై కేసులు నమోదైనట్లు వృద్ధులను నమ్మించి.. దర్యాప్తునకు సహకరించాలని కోరుతున్నారని తెలిపారు. వెంటనే వారి వద్ద ఉన్న క్రిప్టో ఏటీఎంలలో డబ్బు జమ చేసి.. వాటిని బంగారంగా మార్చుకోవాలని సూచిస్తున్నారన్నారు. అనంతరం బంగారాన్ని తమకు ఇవ్వాలని బెదిరింపులకు పాల్పడుతున్నట్లు వివరించారు. ఇటువంటి మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

# వారంలోగా సమాచారం ఇవ్వండి

## గ్రూప్-1 అంశంపై టీజీపీఎస్సీ ఛైర్మన్‌కు కేంద్రమంత్రి లేఖ

హైదరాబాద్: గ్రూప్-1 వ్యవహారంపై వారం రోజుల్లో సమగ్ర సమాచారం అందించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ టీజీపీఎస్సీని కోరారు. ఈ మేరకు టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశంకు లేఖ రాశారు. గ్రూప్-1 అభ్యర్థుల సందేహాలను లేఖలో ప్రస్తావించారు. గ్రూప్-1లో అవినీతి, అక్రమాలు, తప్పిదాలు జరిగాయని అభ్యర్థులు ఆందోళన చేస్తోన్న విషయం తెలిసిందే. ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని పలువురు అభ్యర్థులు బండి సంజయ్‌కి విజ్ఞప్తి చేశారు. వారి ఆందోళనను పరిగణనలోకి తీసుకున్న కేంద్రమంత్రి.. టీజీపీఎస్సీకి లేఖ రాశారు.

# కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మకాలు

కామారెడ్డి: ఎన్నో కష్టాలు పడి పంట పండించిన రైతుకు గిట్టుబాటు, మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. మార్కెట్‌కు సరుకు తెచ్చే రైతుకు ఏలాంటి కష్టం కలుగకుండా చూడాలని, కొనుగోళ్లలో జాప్యం లేకుండా, హమాలీల సమస్య రాకుండా చూడాలని అన్నారు. రైతు నుంచి సరుకులు కొనుగోలు చేసిన 24గంటల్లో బస్తాలను తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాలు పడే అవకాశం ఉన్నందున పంటలకు తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన రైతులకు సూచించారు.

# పహల్గాం దాడి ఘటన దృశ్యాలను విడుదల చేయనున్న కేంద్రం

**ఢిల్లీ :** పహల్గాం ఉగ్రదాడితో దేశం ఉలిక్కిపడిరది. ఆ ఘటన వీడియోలను విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. వాటితో పాటు గతంలో పాక్ ఉగ్రవాదులు భారత్‌లో పాల్పడిన దాడుల దృశ్యాలను బయటపెట్టాలని భావిస్తున్నట్లు సమాచారం. పాక్ చేస్తున్న ఘోరాలను ప్రపంచానికి చూపించే ఉద్దేశంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడిరచాయి. పహల్గాం లో ఏప్రిల్ 22న పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన పాశవిక దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనతో భారత్, పాక్‌ల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పాక్‌తో దౌత్య సంబంధాలకు సంబంధించి భారత్ కీలక నిర్ణయాలు తీసుకుంది. సింధూ జలాల ఒప్పందం అమలును నిలిపివేయడంతో పాటు పాక్ పౌరులు తక్షణమే భారత్ విడిచివెళ్లాలని ఆదేశించింది. ఈ చర్యలతో దాయాది అక్కసు వెళ్లగక్కింది. సిమ్లా ఒప్పందంతోపాటు మిగిలిన ద్వైపాక్షిక ఒప్పందాలను పక్కనబెడుతున్నట్లు ప్రకటించింది. ఇక నిన్న ప్రధాని మోదీ నివాసంలో నిర్వహించిన కీలక సమావేశంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, త్రిదళాధిపతి (సీడీఎస్) అనిల్ చౌహాన్, జాతీయ భద్రతా సలహాదారు అజీత్ డోభాల్, ఆర్మీ, నేవీ, ఐఏఎఫ్ అధిపతులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. దాదాపు గంట పాటు జరిగిన భేటీలో దేశంలో అంతర్గత భద్రతతో పాటు సరిహద్దులో నెలకొన్న పరిస్థితులపై చర్చించినట్లు సమాచారం. పహల్గాం ఉగ్రదాడి బాధ్యులను శిక్షించాలన్నది దేశ ప్రజల దృఢ నిశ్చయమని ప్రధాని మోదీ ఈసందర్భంగా స్పష్టంచేశారు. మన సైనిక దళాల సామర్థ్యాలపై సంపూర్ణ విశ్వాసం ఉందన్నారు.



# నెల్లూరులో ఘోర రోడ్డు ప్రమాదం

- ఇంట్లోకి దూసుకెళ్లిన కారు.. ఆరుగురి మృతి
- మృతుల్లో ఐదుగురు వైద్య విద్యార్థులు

**కోవూరు:** నెల్లూరు జిల్లా కోవూరు మండలంలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. కారు బీభత్సం సృష్టించిన ఘటనలో ఆరుగురు మృతి చెందారు. పోతిరెడ్డిపాలెం వద్ద ఓ ఇంట్లోకి కారు దూసుకెళ్లడంతో ఈ విషాదం చోటుచేసుకుంది. ముంబయి జాతీయ రహదారిపై ఉన్న పెట్రోల్‌బంకు వద్దకు రాగానే అదుపుతప్పిన కారు ఓ ఇంట్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఆ ఇంట్లో నివసిస్తున్న వెంకట రమణయ్య (50) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. కారులో ప్రయాణిస్తున్న ఆరుగురు వైద్య విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. బుచ్చిరెడ్డి పాలెంలో తమ స్నేహితుడి సోదరి నిశ్చితార్థానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. దీంతో స్థానికులు పోలీసులు, 108 వాహనానికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను నెల్లూరులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. నెల్లూరులో చికిత్స పొందుతూ ఐదుగురు వైద్య విద్యార్థులు సైతం ప్రాణాలు కోల్పోయారు. మృతులను అభిషేక్ రాజ్ (అనంతపురం జిల్లా), జీవన్ చంద్రారెడ్డి (నెల్లూరు), యజ్ఞేశ్ (ప్రకాశం), నరేష్ నాయక్ (అనంతపురం), అభిశశి పురుషోత్తం( తిరుపతి), మరో విద్యార్థి నవనీత్ శంకర్ (కడప) ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. వీరంతా నెల్లూరు నారాయణ మెడికల్ కళాశాలలో మెడిసిన్ సెకండ్ ఇయర్ చదువుతున్నట్లు సమాచారం.

### సీఎం చంద్రబాబు తీవ్ర విచారం

గనెల్లూరు జిల్లాలో కారు ప్రమాద ఘటనపై సీఎం చంద్రబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఐదుగురు వైద్యవ ఇద్యార్థులు, మరో వ్యక్తి మరణించడం బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామన్నారు.

# 'భూ భారతి'తో భూ సమస్యలకు పరిష్కారం

- దేశంలోని అనేక రాష్ట్రాలకు చుక్కాణిలా పనిచేస్తుంది
- రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి





**వనపర్తి బ్యూరో ఏప్రిల్ 30 జనంసాక్షి :**
ఇందిరమ్మ పాలనలో ప్రజల భూ సమస్యలు తీర్చడానికి తెచ్చిన భూ భారతి చట్టం దేశంలోని అనేక రాష్ట్రాలకు చుక్కాణిలా పనిచేస్తుందని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం వనపర్తి జిల్లాలో పర్యటించి పట్టణంలోని కళ్యాణసాయి ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన భూ భారతి చట్టం అవగాహన కార్యక్రమంలో రాష్ట్ర ఆబ్కారీ పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూ భారతి చట్టం - 2025 పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ... గత ప్రభుత్వం నాలుగు గోడల మధ్య నలుగురు వ్యక్తులు కలసి వారి స్వార్థం కోసం ధరణి చట్టాన్ని తీసుకువచ్చారు. కానీ నిబంధనలు పెట్టడం మరిచారు. లోపభూయిష్టమైన ధరణి చట్టం వల్ల రైతులు పడుతున్న సమస్యలు, ఇబ్బందులను గమనించి రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, రేవంత్ రెడ్డి ఆనాడు రాష్ట్రంలో కాంగ్రెస్ ను ఆదరిస్తే ధరణి చట్టాన్ని బంగాళా ఖాతంలో పడేస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ ప్రకారం దేశంలోని 18 రాష్ట్రాల్లో పర్యటించి అక్కడ ఉన్న భూ చట్టాలను అధ్యయనం చేసి వాటిలోని మంచి అంశాలను, రెవెన్యూ అధికారులు, న్యాయ కోవిదులు, రైతులతో చర్చించి ధరణిలో ఉన్న సమస్యలు అన్నింటికి పరిష్కారం చూపే భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చి ఏప్రిల్ 14 న డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతి రోజున తెలంగాణ రాష్ట్ర ప్రజలకు అంకితం చేయడం జరిగిందన్నారు. పాస్ పుస్తకంలో ఏదైనా తప్పులు జరిగితే సరిదిద్దుకునేందుకు ధరణిలో ఎలాంటి అవకాశం లేదు. కానీ భూ భారతి చట్టంలో సవరించుకునే అవకాశం కల్పించారు. అధికారులు తప్పు చేస్తే తప్పు చేస్తే చేసిన తప్పును సరిదిద్దేందుకు రైతులు కోర్టుల చుట్టూ తిరుగుతూ మంగళ సూత్రాలు అమ్ముకొని రైతులు రోడ్డున పడ్డారు.

అదే భూ భారతి చట్టంలో రూపాయి ఖర్చు లేకుండా తహసిల్దార్ తప్పు చేస్తే ఆర్డీఓ కు, ఆర్డీఓ తప్పు చేస్తే కలెక్టర్ అక్కడ కూడా న్యాయం జరగకుంటే సి.సి ఎల్. ఏ లేదా ట్రిబ్యునల్ లో ఫిర్యాదు చేసుకునే అవకాశం భూ భారతి లో కల్పించడం జరిగింది. భూమి రిజిస్ట్రేషన్ చేయిస్తే ముందుగా సర్వే చేయించి భూమి పటాన్ని పాస్ పుస్తకంలో ముద్రించడం జరుగుతుంది. సర్వే చేయడానికి ప్రస్తుతం ఉన్న సర్వేయర్లను 1000 మందికి పెంచడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ప్రతి మండలానికి 10 మంది సర్వేయర్ల చొప్పున ప్రైవేట్ సర్వేయర్లను శిక్షణ ఇచ్చి వారి సేవలు వినియోగించుకోవడం జరుగుతుంది. గ్రామ రెవెన్యూ అధికారులను త్వరలోనే ప్రతి గ్రామానికి నియమించుకోవడం జరుగుతోందన్నారు.

భూ భారతి చట్టాన్ని రాష్ట్రంలోని 4 మండలాలను పైలెట్ మండలాలుగా ఎంచుకొని వాటిలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ సమస్యలు పరిష్కరించడం జరుగుతుందన్నారు. త్వరలోనే ప్రతి జిల్లాలో ఒక మండలాన్ని తీసుకొని అందులో రెవెన్యూ సదస్సులు నిర్వహించి అధికారులే ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తారని తెలిపారు. జూన్ 2 నుండి ఆగస్టు 15 వరకు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేస్తాము. భూ భారతి చట్టాన్ని చిత్త శుద్ధితో అమలు చేసి రైతులకు న్యాయం చేసి సమస్యలు పరిష్కరించి రైతులకు అండగా నిలవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా . జి. చిన్న రెడ్డి, నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సైతం భూ భారతి చట్టం పై మాట్లాడారు. జిల్లా ఎస్పీ రావుల గిరిధర్, వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి, దేవరకద్ర శాసనసభ్యులు జి. మధుసూదన్ రెడ్డి, నాగర్ కర్నూల్ శాసన సభ్యులు కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి ,రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, డి.సి.సి.బి. అధ్యక్షుడు విష్ణు వర్ధన్ రెడ్డి, మైనారిటీ కార్పొరేషన్ అధ్యక్షుడు ఒబెదుల్లా కొత్వాల్, మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ , గ్రంథాలయ చైర్మన్ గోవర్ధన్ సాగర్, అదనపు కలెక్టర్ రెవెన్యూ జి వెంకటేశ్వర్లు, ఆర్డీఓ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

# బంకర్‌లో దాక్కున్న ఉగ్రవాది హఫీద్ సయీద్

## భారీగా భద్రత కల్పించిన పాక్ ప్రభుత్వం



**ఇస్లామాబాద్,ఏప్రిల్ 30 (జనంసాక్షి) :** భారత మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది, లష్కరే తోయిబా చీఫ్, ముంబై దాడుల సూత్రధారి హఫీజ్ సయీద్‌కి పాకిస్తాన్ భారీ ఎత్తున భద్రత కల్పిస్తోంది. తన ఇంట్లోనే ఉన్న బంకర్లో అతను దాక్కున్నాడు. అతనికి ప్రభుత్వం కూడా భారీగా భద్రత కల్పించింది. పహల్గామ్ ఉగ్రదాడికి పాల్పడింది లష్కరే ప్రాక్సీ అయిన ది రెసిస్టెన్స్ ఫ్రంట్ ఉగ్రవాదులే అని తేలింది. . పహల్గామ్ దాడి తర్వాత భారత టార్గెట్‌లో ఖచ్చితంగా హఫీజ్ సయీద్ ఉన్నాడని తెలిసి పాకిస్తాన్ ప్రభుత్వం, ఐఎస్ఐ అతడికి హై లెవల్ సెక్యూరిటీని కల్పించినట్లు- తెలుస్తోంది. పాకిస్తాన్ పంజాబ్ రాజధాని లాహోర్‌లోని జన సాంద్రత ఎక్కువగా ఉండే ఒక ఏరియాలో హఫీజ్ సయీద్ నివసిస్తున్నాడు. సాధారణంగా, ఉగ్రవాదులు మారుమూల ప్రాంతాల్లో ఉంటారు. అయితే, హఫీజ్ సయీద్ మాత్రం బిజీ ఏరియాలో నివసిస్తున్నాడు. అతడి నివాసంలో మసీదు, మదర్సా ఉన్నాయి. అతడి కోసం ఒక ప్రైవేట్ పార్కు కూడా ఉన్నట్లు- నిఘా వర్గాలు గుర్తించాయి. పాకిస్తాన్ ప్రభుత్వ భద్రతలో మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది అత్యంత విలాసవంతమైన జీవితం గడుపుతున్నాడు. హఫీస్ సయీద్ ఉంటున్న భవనం కింద బంకర్ ఉన్నట్లు తెలుస్తోంది. ఇన్నాళ్లు హఫీజ్ సయీద్ జైలు ఉన్నాడని పాకిస్తాన్ బుకాయిస్తూ వస్తోంది. కానీ, అతను మాత్రం దర్జాగా అతడి నివాసం నుంచే ఉగ్రవాద కార్యకలాపాలు కొనసాగిస్తున్నాడు. గత నెలలో, హఫీజ్ సయీద్ సన్నిహితుడు అబూ ఖతల్ హత్య తర్వాత పాకిస్తాన్ హఫీజ్ సయీద్‌కి భద్రతను కట్టు-దిట్టం చేసింది. పహల్గామ్ దాడి నేపథ్యంలో ఈ భద్రతను మరింత పెంచినట్లు- తెలుస్తోంది. పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ అతడి నివాసాన్నే సబ్ జైలుగా మార్చింది. సయీద్ బాహ్య ప్రాంతాలకు వెళ్లకుండా ఐఎస్ఐ అతడిని నిరోధిస్తున్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు తెలిపాయి.

# ఎక్స్‌ప్లోజివ్ ఘటనలో కోటి పరిహారం

## కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామన్న కంపెనీ





**హైదరాబాద్,ఏప్రిల్ 30 (జనంసాక్షి) :**
యాదాద్రి భువనగిరి జిల్లాలో నిన్న జరిగిన భారీ పేలుడు ఘటనలో ముగ్గురు కార్మికులు ప్రాణాలు కోల్పోవడం విషాదం రేపింది. దీంతో మృతుల కుటుంబాలకు ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీ పరిహారం ప్రకటించింది. మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారంగా ఇవ్వనున్నట్లు వెల్లడించింది. అలాగే, బాధిత కుటుంబంలో ఒకరికి కంపెనీలో శాశ్వత ఉద్యో గం ఇస్తామని హామీ ఇచ్చింది. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం, వేతనంతో కూడిన సెలవులు ఇచ్చేలా కంపెనీ అంగీకరించింది. యాదాద్రి జిల్లాలోని మోటకొండూరు మండలం కాటేపల్లిలో ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ లోని 18ఏ బ్లాక్ భవనంలో మంగళవారం సాయంత్రం భారీ పేలుడు సంభవించిన విషయం తెలిసిందే. ఈ పేలుడు ధాటికి భవనం కుప్పకూలి పోయిం ది. క్వారీల్లో వినియోగించే బాంబుల ముడిసర కును ఈ పరిశ్రమలో తయారు చేస్తారు. ఘటన సమయంలో భవనంలో మొత్తం తొమ్మిది మంది కార్మికులు ఉండగా.. ముగ్గురు కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. క్షతగాత్రులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

# సింగరేణి కార్మికుల శ్రమదోపిడీ

## కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దుకు డిమాండ్



**కొత్తగూడెం,ఏప్రిల్ 30 (జనంసాక్షి) :**
మేడే అనగానే తెలంగాణలో సింగరేణి, ఆర్టీసీ కార్మికులే గుర్తుకు వస్తారు. అనేక సంస్థలు ఉన్నా ఈ రెండు సంస్థల్లో కార్మికులకు ఇంకా న్యాయం జగాల్సి ఉంది. శ్రమదోపిడీకి గురవుతున్న కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేసి ఆ వ్యవస్థనే రద్దు చేస్తామని ఇచ్చిన హామీ అమలు చేసి వారి సంక్షేమంపై దృష్టి పెట్టాలి. శ్రమదోపిడీకి గురవుతున్న సింగరేణి కాంట్రాక్టు కార్మికులను ఆదుకుని వారికి ఉద్యోగ భరోసా కల్పించాలి. కేంద్ర ప్రభుత్వంతో సమానంగా ఉద్యోగులకు వేతనాలు ఇస్తామని హామీ ఇచ్చారు కనుక కోల్ ఇండియాలో జరిగిన ఒప్పందాలను సింగరేణిలో అమలు చేయాల్సి ఉంది. ప్రధానంగా సింగరేణి కార్మికుల వల్లనే ఇవాళ బొగ్గు ఉత్పత్తి జరిగి విద్యుత్ రంగానికి కీలక భూమికను నిర్వహిస్తున్నారు. వీరు లేకుంటే థర్మల్ పవర్ లేదన్నది గుర్తించాలి. వృత్తిగతంగా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇందులో ఆరోగ్య సమస్య అతి ప్రధానమైనది. బొగ్గుబావుల్లో దిగి తమ ప్రాణాలను పణంగా పెట్టి బొగ్గును వెలికి తీస్తున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో వారి పోరాటం మరువలేనిది. ప్రపంచ కార్మిక దినోత్సవం స్ఫూర్తితో కార్మికులు మరింతగా ఉత్పత్తి క్షేత్రంలో పనిచేసేలా ప్రభుత్వం ఆదుకోవాల్సి ఉంది. సింగరేణి యాజమాన్యం వేతన ఒప్పందాలను, కార్మిక చట్టాలను అమలు చేయకుండా కార్మిక హక్కులను కాలరాస్తుందన్న విమర్శలు ఉన్నాయి. అలాంటివి లేకుండా ఆదాయ వనరుగా ఉన్న కార్మికులను ఆదుకోవాల్సి ఉంది. కోల్ బెల్ట్‌లో గెలిచిన ఎంపీలు సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ముందు నిలబడాలి. సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాల్సి ఉంది. సింగరేణిలో కొత్త బావులు విస్తరస్తామని, ఉపాధి పెంచుతామని, కార్మిక హక్కుల కాపాడుతామని ఇచ్చిన హామీలు అమలు కావాల్సి ఉంది.అలాగే వారసత్వ ఉద్యోగాలు ఇంకా అందని ద్రాక్షగా మిగిలింది. సింగరేణిలో పనిచేసి బయటకు వచ్చిన కార్మికులు మళ్లీ ఏ పనీ చేయలేని స్థాయిలో నిసత్తువ కలిగి ఉంటారు. వారిని ఉత్పాదక శక్తిగా గుర్తించి ఆదుకోవడంలో ప్రభుత్వాలు ఉదారంగా వ్యవహరించి ఆదుకోవాలి. కొత్త బొగ్గుబావుల విస్తరణతోనే ఉద్యోగాలు సృష్టించ బడతాయి. అప్పుడే సింగరేణి మనుగడ కొనసాగుతుంది. కార్మికుల సంక్షేమంపై సింగరేణి యాజమాన్యం దృష్టిసారించాలి. కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే ఉత్పత్తి పెరుగుతుందని గుర్తించాలి. ఇప్పటికైనా సింగరేణి కార్మికుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంపై దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది. పాలకులు సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కార్మికులు కోరుకుంటున్నారు. కోల్ ఇండియా ఒప్పందాలను అమలు చేయాలని, కార్మిక వ్యతిరేక విధానాలను యాజమాన్యం విరమించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# కాళేశ్వరంపై విమర్శలు మానండి

- నిరుపయోగ ప్రాజెక్టుగా చిత్రీకరణ తగదు
- ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి



**నిజామాబాద్,ఏప్రిల్ 30 (జనంసాక్షి) :**
తెలంగాణ అంటేనే ఒక గొప్ప చరిత్ర.. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయ్యాక రాష్ట్రానికి మరో చరిత్ర సృష్టించిందని, కానీ కాంగ్రెస్ పాలకులు దీనిని విఫల ప్రాజెక్టుగా చూపాలని చేస్తున్న ప్రయత్నాలు ఫలించవని ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. కాళేశ్వంం ద్వారా మన సత్తా ఏమిటో కెసిఆర్ రుజువు చేశారని అన్నారు. రాష్ట్రంలో ఒక అద్భుతం కాళేశ్వరంతో సాక్షాత్కరించిందని, ఎండా కాలంలోనూ చెరువుల్లో నీటిని నింపిన ఘనత కెసిఆర్‌దని అన్నారు. రాష్ట్ర ప్రజలను ఉన్నత స్థాయిలో నిలబెట్టాలన్న కేసీఆర్ ఆకాంక్షకు ప్రతిరూపంగా ప్రాజెక్టు నిర్మాణం సాగిందని అన్నారు. ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టుతోనే 70 ఏళ్ల దరిద్రం వదలిందని అన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల ఉత్తర తెలంగాణలో 37 లక్షల ఎకరాలకు సాగునీరు నిరంతరం అందుతుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ కడుతుంటే కాంగ్రెస్ వాళ్లు అప్పులు చేసి కట్టడం కూడా గొప్పేనా అంటూ హేళన చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు నీటిని చూసి కళ్లు కుడుతున్నాయని అన్నారు. భవిష్యత్ తరాలు కేసీఆర్‌ను అపర భగీరథుడిగా చెప్పుకుంటాయని అన్నారు. అన్నారం, మేడిగడ్డ, కన్నెపల్లి, సుందిళ్ల ఈ మారుమూల గ్రామాలు నిన్నటి వరకు బాహ్య ప్రపంచానికి తెలియదని, ఈరోజు ఆ పల్లెల గురించి ప్రపంచం చెప్పు కుంటుందంటే ఆ గొప్పతనమంతా కేసీఆర్‌దే అన్నారు.

70 ఏళ్లుగా ఈ ప్రాంతాల మీదుగా గోదావరి జలాలు వృథాగా వెళ్లి సముద్ర గర్భంలో కలుస్తుంటే చూసుకుంటూ కూర్చున్న కాంగ్రెసోళ్లు ఇప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టు కడితే.. విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా మత్స్యకా రులు ఆర్థికంగా ఎంతో అభివృద్ధి చెందుతున్నారని, ఇప్పుడు తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి ప్రాంతాలు ఎలా ఉన్నాయో అంతకంటే ఎక్కువ రెట్టింపు కాళేశ్వరంతో రూపురేఖలు మారుతాయన్నారు. రాష్ట్రం లోని అన్ని కుల వృత్తులకూ ఆర్థిక వనరులను సమకూర్చాలన్నదే కేసీఆర్ లక్ష్యమన్నారు. అందులో భాగంగానే రూ. 5 వేల కోట్లతో రాష్ట్ర వ్యాప్తంగా సబ్సిడీ గొర్రెలను పంపిణీ చేశారన్నారు. ఎండాకాలంలో గొర్రెలు వాతావరణాన్ని తట్టుకునేలా ఈ దాణా పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా టీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక విమర్శకు పదను పెట్టిందని అన్నారు. కాళేశ్వరంపై విమర్శలు మాని ఆ నీటిని ఉపయోగించాలని అన్నారు. ఏవైనా రిపేర్లు ఉంటే చేయాలని అన్నారు. అంతేగాని దానిని నిరుపయోగం చేసి నీటి సమస్యకు కారణం కారాదని అన్నారు.




# పదో తరగతి 2025 ఫలితాల్లో అగ్రగామి అల్ఫోర్స్






**అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి.నరేందర్ రెడ్డి.**

**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 30 (జనంసాక్షి) :**
సంచలనాత్మక ఫలితాలకు నిర్వచనం అల్ఫోర్స్ విద్యా సంస్థలని అధినేత డా.వి. నరేందర్ రెడ్డి స్థానిక వావిలాలపల్లి లోని అల్ఫోర్స్ టైనీ టాట్స్ ప్రాంగణంలో అల్ఫోర్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ కు చెందిన విద్యార్థులకు రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ మార్కులు రావడం పట్ల ఏర్పాటు చేసినటువంటి విద్యార్థుల అభినందన సభకు ముఖ్య అతిథిగా హాజరై వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాటాడుతూ... పరీక్ష ఏదైనా ఫలితం ఏదైనా అగ్రస్థానం అల్ఫోర్సేనని మరోసారి నిరూపించడం జరిగిందని వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థులకు వార్షిక ప్రణాళిక ప్రారంభంలోనే పలు సూచనలను ఇవ్వడం జరుగుతుందని ఆ సూచనలను కఠినంగా అమలుపరిచి విద్యార్థుల్లో విజయ రహస్యాన్ని పెంపొందిస్తామని వారు తెలిపారు. ఈ క్రమంలో బుధవారం రోజు విడుదల చేసిన యస్.యస్.సి ఫలితాలలో పాఠశాలలకు చెందినటువంటి విద్యార్థులు రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ మార్కులతో ఘన విజయం సాధించారని తెలుపుతూ బి. సాత్విక్ 589, ఎ. విష్ణుప్రియ, కె.శివరాణి, 588, కె. ఐశ్వర్య 587, యన్.సాత్విక్, ఎ. అన్విత్ 586,వి. అక్షర, జి. సహస్ర, సిహెచ్ ఆశ్రయ, టి. చరణ్ కుమార్ వి. అక్షర 585, టి. అక్షర, జి.శ్రీమేదా, వి.శివచరణ్, పి. గణేశ్, యన్. మధుశాలిని, కె. వినయ్ 584, ఎన్.నేహా, టి. నిత్య, జి. అఖిలా రెడ్డి, కె. ప్రణయ్, పి.అఖిల్ రావు 583, జి.సహజ 582, డి. విశ్వతేజ, కె. శోభన, కె.ఆలియా, యం.హర్షి, జి. ఐశ్వర్య, టి. కిషోర్ 581, యం. శృతకీర్తి, యం.డి. ముఖీత్, అర్. మౌనిమా, కె.సహస్ర రెడ్డి, వి. బృహతి, ఎ.రంజిత్ రెడ్డి, కె. సుకృతి 580 మరియు తదితర విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో ఘనవిజయం సాధించారని హర్షం వ్యక్తం చేశారు. 1140 విద్యార్థులకు గాను 861 మంది విద్యార్థులు 500 మార్కులకు పైగా సాధించారని 35 మంది విద్యార్థులు 580 మార్కులకు పైగా, 110 మంది విద్యార్థులు 570 మార్కులకు పైగా మరియు 341 మంది విద్యార్థులు 550 మార్కులకు పైగా సాధించారని చెప్పారు.

రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించినందుకు గాను విద్యార్థులను, అల్ఫోర్స్ విద్య సంస్థలను అగ్రభాగాన నిలిపినందుకు సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు. అదే విధంగా అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులందరికీ పుష్పగుచ్ఛాలతో పాటు స్కోరు కార్డ్స్ అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రిన్సిపాల్స్, సిబ్బంది. తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మూడు రాష్ట్రాల్లో ప్రధాని రెండ్రోజుల పర్యటన

- ముంబై, కేరళ, ఎపిల్లో బిజీబిజీగా కార్యక్రమాలు
- ఎపిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు





**న్యూఢిల్లీ, ఏప్రిల్ 30 (జనంసాక్షి) :**
ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రెండు రోజుల్లో మూడు రాష్ట్రాల్లో పర్యటించనున్నారు. ఈ మేరకు షెడ్యూల్ ఖరారైంది. మే 1,2 తేదీల్లో మహారాష్ట్ర, కేరళ, ఆంధ్రప్రదేశ్‌లలో ప్రధాని పర్యటించనున్నారు. ముంబైలో వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్ (వేవ్స్)ను పీఎం ప్రారంభిస్తారు. దాదాపు 25 దేశాలకు చెందిన మంత్రుల భాగస్వామ్యంతో గ్లోబల్ మీడియా డైలాగ్ సదస్సు జరుగనుంది. అలాగే కేరళలోని విజింజం అంతర్జాతీయ డీప్ వాటర్ మల్టీపర్పస్ ఓడరేవును ప్రధాని మోదీ జాతికి అంకితం చేయనున్నారు. ఇది భారతదేశపు మొట్టమొదటి పూర్తిస్థాయి కంటైనర్ ట్రాన్స్‌షిప్‌మెంట్ పోర్ట్. అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అమరావతిలో 58,000 కోట్ల రూపాయల విలువైన బహుళ అభివృద్ధి ప్రాజెక్టులకు మోడీ శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఏపీ బహుళ రోడ్డు , రైలు ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసి.. అక్కడ నిర్వహించే బహిరంగ సభలో ప్రధాని మోదీ పాల్గొంటారు. మే 2న ఏపీలో పర్యటించనున్న ప్రధాని మోదీ.. రాజధాని అమరావతిలో చేపట్టే రూ.49,040 కోట్ల పనులకు శంకుస్థాపన చేయనున్నారు. హైకోర్ట్, సెక్రటేరియట్, అసెంబ్లీ భవనాలతో పాటు- న్యాయమూర్తుల నివాస సముదాయాలకు పీఎం శంకుస్థాపన చేస్తారు. ఎమ్మెల్యేలు, మంత్రులు, ఆలిండియా సర్వీసెస్ అధికారుల గృహ సముదాయం నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్నారు. రాజధాని ప్రాజెక్టులతో పాటు పెద్ద ఎత్తున కేంద్ర ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు మోదీ. డీఆర్‌డీవో, డీపీఐఐటీ-, ఎన్‌హెచ్ఐ, రైల్వేస్‌కు సంబంధించి రూ.57,962 కోట్ల ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. నాగాయలంకలో దాదాపు రూ.1,500 కోట్లతో నిర్మించే మిసైల్ టెస్ట్ రేంజ్ కు ప్రధాని చేతుల మీదుగా శంకుస్థాపన వైజాగ్‌లో కేంద్ర ప్రభుత్వం నిర్మించే యూనిటీ- మాల్‌కు శంకుస్థాపన రూ.293 కోట్లతో గుంతకల్ వెస్ట్ నుంచి మల్లప్ప గేట్ వరకు చేపట్టిన రైల్వే ప్రాజక్టుకు శంకుస్థాపన చేస్తారు. ఇవి కాకుండా... రూ. 3176 కోట్ల విలువైన నేషనల్ హైవే ప్రాజెక్టులకు కూడా అమరావతి వేదికగా వర్చ్యువల్ పద్ధతిలో శంకుస్థాపనలు చేస్తారు.

అలాగే రూ.3680 కోట్ల విలవైన పలు నేషనల్ హైవే పనులను ప్రారంభించనున్నారు. రూ.254 కోట్లతో పూర్తి చేసిన ఖాజీపేట - విజయవాడ 3వ లైన్, గుంటూరు గుంతకల్ డబ్లింగ్ ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన బుగ్గనపల్లి, కేయాఎఫ్ పాణ్యం లైన్‌లను ప్రధాని ప్రారంభించనున్నారు. మొత్తం రూ.57,962 కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలను ప్రధాని మోదీ చేయనున్నారు. ఎపి పర్యటనకు సంబంధించి భారీగా ఏర్పాట్లు చేశారు. ప్రధాని రాకకోసం అమరావతి ముస్తాబు అవుతోంది.

# సిఎస్‌గా రామకృష్ణారావు బాధ్యతలు స్వీకరణ

## అభినందనలు తెలిపిన మాజీ సిఎస్ శాంతికుమారి

**హైదరాబాద్,ఏప్రిల్ 30 (జనంసాక్షి) :**
రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా కె. రామకృష్ణారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత సిఎస్ శాంతి కుమారి పదవీ విరమణ చేయడంతో.. రామకృష్ణారావును ప్రభుత్వం నూతన సిఎస్‌గా నియమించింది. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి రామకృష్ణారావు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. వచ్చే ఆగస్టులో ఆయన పదవీ విరమణ చేయనున్నారు. ఆయన తన సర్వీసులో నల్లగొండ జాయింట్ కలెక్టర్‌గా, గుంటూరు జిల్లా కలెక్టర్‌గా, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ డైరెక్టర్ జనరల్‌గా, 2016 నుంచి ప్రణాళిక శాఖ ముఖ్యకార్యదర్శిగా పనిచేశారు. 2021 నుంచి ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న కుడ్లిగి రామకృష్ణారావు బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ సిఎస్ శాంతికుమారితో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు. కొత్త సిఎస్‌కు ఆమె అభినందనలు తెలిపారు.

# పుష్కర పనులు ఆశించిన స్థాయిలో జరగలేదు





## మంత్రి శ్రీధర్ బాబు

**కాళేశ్వరం, ఏప్రిల్30 (జనంసాక్షి) :** పుష్కర మహోత్సవాలను దృష్టిలో పెట్టుకొని అన్ని ఏర్పాట్లు సమయానుకూలంగా పూర్తి చేయాలని రాష్ట్ర ఐటీ మరియు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే లతో కలిసి ఆయన కాళేశ్వరం లో వివిఐపి ఘాట్, గోదావరి ఘాట్, 100 గదుల సత్రం మరియు వైద్యశాలను పరిశీలించారు.తొలుత కాళేశ్వరం చుట్టుపక్కల గ్రామాలలో పలు వివాహ వేడుకల్లో పాల్గొన్న ఆయన అనంతరం కాళేశ్వరం లో సరస్వతీ పుష్కర అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గోదావరిలో వ్యర్ధాలు తొలగించి పరిశుభ్రం చేయాలని అధికారులకు సూచించారు. అందుకు స్థానికుల సహకారం తీసుకోవాలని అధికారులకు సూచించారు. సమయం చాలా తక్కువగా ఉందని, ఆశించిన స్థాయిలో ఇప్పటి వరకు పనులు జరగలేదని అధికారులు వాటిని గుర్తించి నిర్దిష్ట కార్యాచరణతో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, అవసరమైన సదుపాయాలను త్వరితగతిన అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు. పుష్కరాలకు భక్తులు పెద్ద ఎత్తున వచ్చే అవకాశం ఉన్నందున, అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని మంత్రి స్పష్టం చేశారు. పనులు వేగవంతం చేసేందుకు కూలీలను పెంచాలని సూచించారు. పనుల్లో నాణ్యత పాటించాలని ఆదేశించారు. వైద్యశాలలో సిబ్బంది ఎంత మంది ఉన్నారు? అలాగే ఎంత మంది సిబ్బంది అవసరం అని అడిగి తెలుసుకున్నారు.పోలీస్ అధికారులతో వాహనాల పార్కింగ్ స్థలాలు, వాహనాల రాకపోకలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, పంచాయతి రాజ్, ఇరిగేషన్, ఆర్ డబ్ల్యూఎస్, వైద్య, దేవాదాయ శాఖల అధికారులు ,కాళేశ్వరం గ్రామ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.




Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370